శనివారం
3•8•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
•సంపుటి 9 •సంచిక 39
•పేజీలు: 16 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE




## మంత్రి నిరంజన్‌రెడ్డికి సీఎం కేసీఆర్ పరామర్శ



2

ఇటీవల మాతృవియోగానికి గురైన మంత్రి నిరంజన్‌రెడ్డిని శుక్రవారం వనపర్తిలోని ఆయన నివాసంలో పరామర్శించి సింగిరెడ్డి తారకమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కూడా ఉన్నారు.

### మేడిగడ్డనుంచి ఎల్లంపల్లి దాకా

# పొంగిన జీవగంగ

**కాళేశ్వరం వద్ద ప్రాణహిత ఉగ్రరూపం**

- మేడిగడ్డకు 4.47 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- కన్నెపల్లిలో నాలుగోరోజూ మోటర్లు బంద్
- పూర్తిస్థాయి నీటిమట్టానికి అన్నారం బరాజ్
- నాలుగు గేట్లు ఎత్తివేసిన అధికారులు
- గోలివాడలో వెట్‌రన్‌కు మోటర్లు సిద్ధం
- పేరూరు దగ్గర తగ్గిన వరద ఉధృతి
- కడెం, ఎల్లంపల్లికి స్థిరంగా ఇన్‌ఫ్లోలు
- భద్రాచలంవద్ద మొదటి ప్రమాద హెచ్చరిక!

4

**ఉరకలేస్తున్న కృష్ణమ్మ**

- రెండు లక్షల క్యూసెక్కులకుపైగా వరద
- ఆల్మట్టి నుంచి శ్రీశైలం దాకా అదే ఉధృతి
- వేగంగా పెరుగుతున్న శ్రీశైలం నీటిమట్టం
- 35 గంటల్లో జలాశయంలోకి 25 టీఎంసీల నీరు
- కల్వకుర్తి లిఫ్టుద్వారా 2400 క్యూసెక్కుల ఎత్తిపోత
- జూరాల, శ్రీశైలం పరిధిలో జోరుగా వ్యవసాయ పనులు



శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిండుకుండలా మారిన అన్నారం బరాజ్

# ఏకధాటిగా వానలు

## రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు

**పలు జిల్లాల్లో భారీగా.. ఉధృతంగా పొంగుతున్న వాగులు**

**మత్తడి దుంకుతున్న చెరువులు**

**ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో అత్యధికంగా 21.6 సెం.మీ. వర్షపాతం**

**మంచిర్యాల జిల్లా బొందచేను వాగులో వ్యక్తి గల్లంతుబు**

**సింగరేణిలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి**

### సాధారణస్థాయికి వర్షపాతం

**వరుసవానలతో భారీగా తగ్గిన లోటు.. రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం**

**కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం**



శుక్రవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం మడిపల్లిలో వరినాట్లు వేస్తున్న మహిళలు



శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లో జోరువానలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న స్కూలు పిల్లలు ఛత్రితో కుస్తీపడుతున్న దృశ్యం



ములుగు జిల్లా మేడారంలోని జంటవంతెనలను ఆనుకొని ప్రవహిస్తున్న జంపన్నవాగు

నైరుతి రుతుపవనాలు బలం పుంజుకోవడంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కొద్దిగా ఆలస్యమైనా తెలంగాణను ముసురు కమ్మేసింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ రూరల్, ములు గు, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షం పడింది. ఖమ్మం, పెద్దపల్లి, మంచిర్యాల, ఉమ్మడి పాలమూరు తదితర జిల్లాల్లో ఓ మోస్తరు వానలు పడగా, నల్లగొండ, సూర్యాపేట, వికారాబాద్ తదితర జిల్లాల్లో ముసురు పట్టింది. రాష్ట్రంలో అత్యధికంగా ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో 21.6 సెం.మీ వర్షపాతం నమోదు కాగా, అదే జిల్లా వెంకటాపురం (నూగూరు) మండలంలో 18 సెం.మీ. వర్షం పడింది. ఇప్పటివరకు భారీలోటుగా ఉన్న వర్షపాతం వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఒక్కసారిగా సాధారణస్థాయికి చేరుకున్నది. ఆగస్టు, సెప్టెంబర్‌లో తరుచూ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రాష్ట్రంలో సాధారణస్థాయికి మించి వర్షపాతం నమోదవుతుందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఇదిలాఉండగా, ప్రస్తుతం కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనానికి తోడు ఆదివారంకల్లా బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనున్నదని చెప్పారు. జోరుగాపడుతున్న వర్షాలతో రైతన్నలు పొలం పనులను ముమ్మరంచేశారు.

> వివరాలు 2, 5 పేజీల్లో

### అన్ని జిల్లా కేంద్రాల్లో

## సూపర్ స్పెషాలిటీ వైద్యం

**నిమ్స్, ఉస్మానియా, గాంధీ తరహాలో దవాఖానలు**

- పేదలకు మెరుగైన వైద్యం అందాలన్నదే సీఎం కేసీఆర్ విజన్
- సిరిసిల్ల దవాఖానకు నలుగురు గైనకాలజిస్టులు, సీటీస్కాన్
- ఉత్తమ సేవలతో పేదల గుండెల్లో సుస్థిరస్థానం పొందాలి
- వైద్యులకు టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచన
- రాజన్నసిరిసిల్ల జిల్లాకేంద్రంలోని దవాఖాన ఆకస్మిక తనిఖీ



2

శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని దవాఖానలో వరలక్ష్మికి పుట్టిన పాప ఆరోగ్యం గురించి ఆమె అత్త అరుణతో మాట్లాడి తెలుసుకుంటున్న కేటీఆర్

## కశ్మీర్‌లో ఉగ్రకుట్ర!

- అమర్‌నాథ్ యాత్రికులు లక్ష్యంగా భారీ దాడికి పాక్ ఉగ్రవాదులు పన్నాగం
- సైన్యం సంచలన ప్రకటన
- యాత్ర దారిలో మందుపాతరలు, పేలుడు పదార్థాలు, తుపాకులను స్వాధీనం చేసుకున్నామని వెల్లడి
- యాత్రను రద్దు చేసుకొని భక్తులు వెంటనే వెనక్కి వచ్చేయాలని అధికారుల సూచన
- రాష్ట్రమంతటా ఉద్రిక్త వాతావరణం

7



అమర్‌నాథ్ యాత్ర మార్గంలో దొరికిన ఉగ్రవాదుల తుపాకీ

### పట్టా భూములపై

## మాఫియా పంజా

- అధికారుల అండతో రెచ్చిపోతున్న భూ బకాసురులు
- ఫోర్జరీ సంతకాలతో తప్పుడు రిజిస్ట్రేషన్
- దొంగ డాక్యుమెంట్లతో దర్జాగా కబ్జా
- బాధితుడి ఫిర్యాదుతో పాస్‌పుస్తకాల నిలిపివేత
- న్యాయం కోసం వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్, సీపీని ఆశ్రయించి బాధితుడు

ధర్మగంట

9

కాదేదీ కబ్జాకనర్హం అన్నట్టు.. రెవెన్యూ అధికారుల అండ ఉంటే.. ఎటువంటి భూమినైనా స్వాహా చేసెయ్యొచ్చు. హక్కుదారు ఊళ్లో లేకపోతే చాలు.. వారి భూమికి రెక్కలొచ్చేస్తాయి. వారి డాక్యుమెంట్లు క్లోనింగ్ అవుతాయి. డాక్యుమెంట్లలో ఫొటోలు మారుతాయి. వారి సంతకాలు ఫోర్జరీ అవుతాయి. చాలా తేలిగ్గా ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ జరిగిపోతాయి. లింక్ డాక్యుమెంట్లు నిజమైనవా కాదా అని సబ్ రిజిస్ట్రార్ పరిశీలించరు. ఆఫీసులో ఎవరి వాటా వారికి చేరితే చాలు.. గుడ్డిగా రిజిస్ట్రేషన్ చేస్తారు. వాటిని చూసి రెవెన్యూ అధికారులు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇచ్చేస్తారు. బాధితులు నెత్తీనోరు బాదుకున్నా పట్టించుకొనేవారుండరు. వరంగల్ అర్బన్ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేట గ్రామానికి చెందిన ఇద్దరు రైతుల భూమిని తప్పుడు డాక్యుమెంట్లతో భూబకాసురులు కబ్జాచేశారు. వీరికి రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు అండగా నిలిచి ఫోర్జరీ డాక్యుమెంట్లతో కబ్జాకోరులకు రిజిస్ట్రేషన్‌చేశారు. తమకు న్యాయం చేయాల్సిందిగా బాధితులు 'ధర్మగంట'ను ఆశ్రయించారు.



శుక్రవారం సూర్యాపేట మెడికల్ కళాశాలను ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో కలెక్టర్ అమయ్‌కుమార్, ఎస్పీ వెంకటేశ్వర్లు, జెడ్పీ చైర్‌పర్సన్ దీపికాయుగంధర్‌రావు తదితరులు ఉన్నారు.

## సీఎంకు ర్యాంకుల కానుక ఇవ్వాలి

2

**సూర్యాపేట ప్రజలు ముఖ్యమంత్రికి రుణపడి ఉంటారు**

**మెడికల్ కళాశాల ప్రారంభోత్సవంలో మంత్రి జీ జగదీశ్‌రెడ్డి**

### జర్నలిస్టు రవీశ్‌కుమార్‌కు

## మెగసెసె పురస్కారం



- అత్యంత ప్రభావవంతమైన జర్నలిస్టుల్లో ఒకరని ప్రశంసించిన ఫౌండేషన్
- ప్రజా సమస్యలు, వారి జీవన పరిస్థితులను వెలుగులోకి తెచ్చిన రవీశ్ 'ప్రైమ్ టైమ్ షో'

7

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 85.00 | రిటైల్ లైవ్ | 107.00 |
| డ్రెస్‌డ్ | 155.00 | స్కిన్‌లెస్ | 177.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 323.00 | రంగారెడ్డి | 323.00 |
| మెదక్ | 323.00 | కరీంనగర్ | 326.00 |
| వరంగల్ | 326.00 | చిల్లర ధర | 3.85 |

### విభజన సమస్యలపై

## కేంద్రం సమావేశం వాయిదా

ఇరురాష్ట్రాలకు లేఖ

2

## దేవదాస్ కనకాల కన్నుమూత



- అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు దవాఖానలో ప్రముఖ నటశిక్షకుడు తుదిశ్వాస
- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం

> వివరాలు చిత్రం పేజీలో

## ఫలించని మధ్యవర్తిత్వం

- అయోధ్య కేసుపై ఇక సుప్రీంకోర్టులో రోజువారీ విచారణ
- ఈ నెల 6 నుంచి ప్రారంభం.. ముగిసేవరకూ కొనసాగింపు
- పిటిషనర్లు సిద్ధంగా ఉండాలని ధర్మాసనం ఆదేశం

8



# టీఆర్టీ ఎస్జీటీ భర్తీకి షెడ్యూల్ జారీ

- 5 నుంచి భర్తీ ప్రక్రియ మొదలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పాఠశాల విద్యాశాఖలో టీఆర్టీ ఎస్జీటీ పోస్టుల భర్తీ ప్రక్రియను సోమవారం (ఈ నెల 5) నుంచి ప్రారంభించనున్నారు. అందుకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టీ విజయ్‌కుమార్ శుక్రవారం షెడ్యూల్ జారీ చేశారు. షెడ్యూల్ ప్రకారం జిల్లాలవారీగా పోస్టులు గుర్తించి, వాటిని నోటీసు బోర్డు, జిల్లా వెబ్‌సైట్‌లో పెట్టాలి. ఈ నెల 6న ఖాళీలకు సంబంధించి జిల్లాస్థాయి కమిటీతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించి నిర్ణయం తీసుకోవాలి. అదేరోజు నోటీసు బోర్డులలో క్యాటగిరీవారీగా పోస్టుల వివరాలు పెట్టాలి. ఎంపికైన వారికి 8వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఆర్డర్లు జారీచేయాలి. హిందీ, కన్నడ, మరాఠీ, బెంగాలీ, ఉర్దూతోపాటు తమిళ భాషల్లో ఉన్న మొత్తం 306 మందికి పోస్టింగ్ ఆర్డర్లు ఇస్తారు. పోస్టింగ్ ఆర్డర్లు పొందిన వారు మరుసటిరోజున సంబంధిత పాఠశాలల్లో రిపోర్టింగ్ చేయాలి. కౌన్సెలింగ్‌కు హాజరుకాని అభ్యర్థులకు రిజిస్టర్ పోస్టు ద్వారా పోస్టింగ్ ఆర్డర్లు పంపించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశించారు.

# విభజన సమస్యలపై సమావేశం వాయిదా

- ఇరురాష్ట్రాలకు లేఖ ద్వారా స్పష్టంచేసిన కేంద్రం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విభజన సమస్యలపై ఈ నెల 8వ తేదీన నిర్వహించతలపెట్టిన తెలంగాణ, ఏపీ రాష్ట్రాల సమావేశాన్ని కేంద్రం వాయిదా వేసింది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు కేంద్ర హోంశాఖ లేఖను పంపింది. సమావేశం తిరిగి ఎప్పుడు నిర్వహిస్తామనేది తెలియజేస్తామని ఆ లేఖలో పేర్కొన్నది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014 ప్రకారం వివిధ సంస్థలు, ఆస్తులను విభజించాల్సి ఉన్నది. రెండు రాష్ట్రాల మధ్య భిన్నాభిప్రాయాల నేపథ్యంలో అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. ఇరురాష్ట్రాల స్థాయిలో వాటిని పరిష్కరించలేని పరిస్థితి నెలకొనడంతో.. ఈ రెండు రాష్ట్రాల మధ్య ఉన్న అపరిష్కృత సమస్యల పరిష్కారంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు సార్వత్రిక ఎన్నికలకు ముందే సమావేశం నిర్వహించాలని భావించినా ఏపీ అధికారులు వాయిదా కోరడంతో అప్పుడు సమావేశం నిలిచిపోయింది. ఇలా సమావేశాలు వాయిదాపడటంతో తామే తేదీ నిర్ణయించి సమావేశం ఏర్పాటుచేయాలన్న నిర్ణయానికి కేంద్రం వచ్చింది. ఈ మేరకు ఆగస్టు 8న ఇరురాష్ట్రాల అధికారులతో ఢిల్లీలోని హోంశాఖ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి స్వయంగా ఇరురాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో మాట్లాడారు. తాము నిర్ణయించిన తేదీన విధిగా పూర్తిస్థాయి సమాచారంతో సమావేశానికి రావాలని ఆదేశించారు. ఆలాగే రెండు రాష్ట్రాలకు లేఖలు కూడా పంపించారు. కేంద్రం ఆదేశాల మేరకు ఇరురాష్ట్రాల అధికారులు సమావేశానికి సిద్ధమయ్యారు. ఢిల్లీకి వెళ్లేందుకు ఏర్పాట్లు కూడా చేసుకొన్నారు. ఈ దశలో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు కేంద్ర హోంశాఖ సమాచారం పంపించింది. జూలై 31వ తేదీతో లేఖను రెండు రాష్ట్రాలకు పంపించారు.





వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని ఓదార్చుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు



మంత్రి నిరంజన్‌రెడ్డి నివాసంలో అసెంబ్లీ మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మంత్రి మహమూద్ అలీ, మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డితో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, టీఆర్‌ఎస్ ఎంపీలు సంతోష్‌కుమార్, పీ రాములు కూడా ఉన్నారు

# నిరంజన్‌రెడ్డికి సీఎం కేసీఆర్ పరామర్శ

**వనపర్తి ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

ఇటీవల మాతృవియోగానికి గురైన వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు శుక్రవారం వనపర్తిలోని ఆయన స్వగృహంలో పరామర్శించారు. నిరంజన్‌రెడ్డి తల్లి సింగిరెడ్డి తారకమ్మ చిత్రపటానికి నివాళి అర్పించి.. కుటుంబసభ్యులను ఓదార్చారు. 105 ఏండ్ల పెద్దవయస్సు వరకు జీవించిన తారకమ్మ చాలా గొప్పవారని కేసీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నిరంజన్‌రెడ్డి ఇంటికి వచ్చినప్పుడల్లా తారకమ్మను ప్రత్యేకంగా పలుకరించిన జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. వాతావరణం అనుకూలించకపోవడంతో సీఎం కేసీఆర్ హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గం ద్వారా వనపర్తికి చేరుకున్నారు. భోజన కార్యక్రమం అనంతరం తిరిగి రోడ్డు మార్గం ద్వారానే హైదరాబాద్‌కు వెళ్లారు. మంత్రులు మహమూద్‌అలీ, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీలు సంతోష్‌కుమార్, పీ రాములు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గువ్వల బాలరాజు, జైపాల్‌యాదవ్, అబ్రహం, రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, దాసరి మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కసిరెడ్డి నారాయణరెడ్డి, శేరి సుభాశ్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, మాజీ మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, జూపల్లి కృష్ణారావు, చిత్తరంజన్‌దాస్, ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మంద జగన్నాథం, సాట్స్ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి, కలెక్టర్ శ్వేతా మొహంతి, సీడ్స్ డైరెక్టర్ కేశవులు, జేసీ వేణుగోపాల్, ఆర్డీవో చంద్రారెడ్డి తదితరులు తారకమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

# సీఎంకు 'ర్యాంకుల' కానుక ఇవ్వాలి

- సూర్యాపేట ప్రజలు ముఖ్యమంత్రికి రుణపడి ఉంటారు
- విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించాలి
- మెడికల్ కళాశాల ప్రారంభోత్సవంలో విద్యాశాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి



ఓరియంటేషన్ ప్రోగ్రాంలో విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి సెల్ఫీ దిగుతున్న సూర్యాపేట వైద్య కళాశాల విద్యార్థినులు

**సూర్యాపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** 'సీఎం కేసీఆర్ సూర్యాపేటలో మెడికల్ కళాశాల ఏర్పాటుచేసి మీకు సీట్లు కానుకగా ఇచ్చారు. ముఖ్యమంత్రి సంతోషపడేలా బాగా చదివి పీజీలో ర్యాంకుల రూపంలో తిరిగి కానుక ఇవ్వాలి' అని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి జీ జగదీష్‌రెడ్డి సూచించారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో వైద్య కళాశాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల తరగతి గదులు, పరిపాలనా విభాగం భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఫస్ట్ బ్యాచ్ ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థుల ఓరియంటేషన్ ప్రోగ్రాంలో జగదీశ్‌రెడ్డి మాట్లాడారు. ఈ కళాశాలలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ప్రభుత్వ ఆశయాలు, తల్లిదండ్రుల ఆలోచనల మేరకు బాగా కష్టపడి చదువుకోవాలని సూచించారు. కొత్తగా ప్రారంభించుకొంటున్న ఈ వైద్య కళాశాలను జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చేలా విద్యార్థులు, అధ్యాపక బృందం కృషిచేయాలన్నారు. మెడికల్ కళాశాలను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సూర్యాపేటకు కానుకగా ఇచ్చారని, స్థానిక ప్రజలు ఆయనకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారని అన్నారు.

**వారి కండ్లు బైర్లు కమ్ముతున్నాయి..**

'మెడికల్ కళాశాల రాదు, దానిని సాధించడం ఎవరి వల్లా కాదు.. అంటూ కొందరు అవాకులు చెవాకులు పేలడమే కాకుండా అవాంతరాలు కూడా సృష్టించారు. ఇవాళ కళాశాల ప్రారంభోత్సవంతో వాళ్ల కండ్లు బైర్లు కమ్ముకొంటున్నాయి. అభివృద్ధిని అడ్డుకొనేందుకు చిల్లర రాజకీయాలు చేసినవారికి ప్రజలే బుద్ధి చెప్తారు' అని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. కళాశాలలో ఎలాంటి సమస్యలున్నా వెంటనే పరిష్కరింపజేస్తానని, అన్ని వసతులతో కూడిన భవన నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేయిస్తానని మంత్రి జగదీశ్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శారద, కలెక్టర్ దుగ్యాల అమయ్ కుమార్, కళాశాల సూపరింటెండెంట్ దండ మురళీధర్‌రెడ్డి, ఎస్పీ వెంకటేశ్వర్లు, జెడ్పీ చైర్‌పర్సన్ దీపికాయుగంధర్‌రావు, వైస్‌చైర్మన్ గోపగాని వెంకటనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కృష్ణాబోర్డు భేటీ 9కి వాయిదా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కృష్ణా బేసిన్‌లో ఇన్‌ఫ్లోలు భారీగా నమోదవుతున్న దరిమిలా ఈ నెల ఆరో తేదీన రెండురాష్ట్రాల ఇంజినీర్లతో సమావేశం నిర్వహించాలనుకున్న కృష్ణాబోర్డు సమావేశాన్ని వాయిదా వేసింది. ఈ నెల 9న సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు బోర్డు రెండు రాష్ట్రాలకు సమాచారం ఇచ్చింది.

## రవాణాశాఖలో పదోన్నతులకు గ్రీన్‌సిగ్నల్!

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర రవాణాశాఖలో అధికారులకు తొలిసారి క్యాడర్ స్ట్రెంత్ ఆధారంగా పదోన్నతులు లభించనున్నాయి. ఇందుకు సంబంధించిన ఫైల్‌పై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అనుమతులు ఇచ్చింది. రాష్ట్రంలో 141 మంది ఎంవీఐలు, 46 మంది ఏఓలు ఉండటంతో వారి సంఖ్యను అనుసరించి పదోన్నతుల శాతాన్ని నిర్ణయించారు. ఈ ప్రకారంగా పది మంది ఎంవీఐలకు, నలుగురు ఏవోలకు పదోన్నతులు లభించనున్నట్టు సమాచారం.

**ముహూర్తం**

సూర్యోదయం: 6.00 గంటలకు

సూర్యాస్తమయం: 6.45 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం తదియ రాత్రి 10.07 వరకు, తదుపరి చతుర్థి, నక్షత్రం: మఖ ఉదయం 6.44 వరకు, తదుపరి పుబ్బ, అమృతఘడియలు: రాత్రి 10.24 నుంచి 12.00 వరకు, తదుపరి ఆదివారం తె.జా. 4.37 నుంచి ఉదయం 6.13 వరకు, రాహుకాలం: ఉదయం 9.11 నుంచి 10.47 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.00 నుంచి 7.42 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 1.52 నుంచి 3.28 వరకు.

**లోకం పోకడ**





పోనీ, పులిజూదం ఆటలో మేకలను చంపొచ్చా పోలీస్!



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రధాన దవాఖానలో పరిస్థితులపై సమీక్ష జరుపుతున్న సిరిసిల్ల ఎమ్మెల్యే, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు

# జిల్లాల్లో సూపర్ స్పెషాలిటీ వైద్యం

- నిమ్స్, ఉస్మానియా, గాంధీ తరహాలో దవాఖానలు
- పేదలకు మెరుగైన వైద్యం అందాలన్నదే సీఎం విజన్
- సిరిసిల్ల దవాఖానకు నలుగురు గైనకాలజిస్టులు, సీటీస్కాన్

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

- ఉత్తమ సేవలతో పేదల గుండెల్లో సుస్థిరస్థానం పొందాలి
- వైద్యులకు టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచన
- రాజన్నసిరిసిల్ల జిల్లాకేంద్రంలోని దవాఖాన ఆకస్మిక తనిఖీ



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రధాన దవాఖానలో రుద్రంగి మండలానికి చెందిన శిరీషకు పుట్టిన బాబును ఆమె అక్క స్వాతి ఎత్తుకోగా సెల్ఫీ తీసుకుంటున్న కేటీఆర్

రాష్ట్రంలోని అన్ని జిల్లాకేంద్రాల్లో నిమ్స్, ఉస్మానియా, గాంధీ తరహాలో దవాఖానలను ఏర్పాటుచేసి సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందించాలని ప్రభుత్వం సంకల్పించిందని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. అందులోభాగంగా రాజన్నసిరిసిల్ల జిల్లాకు 300 పడకల దవాఖాన మంజూరైందని తెలిపారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్నది ముఖ్యమంత్రి కేసీఆర్ విజన్ అని పేర్కొన్నారు. ఉమ్మడిరాష్ట్రంలో ఒకప్పుడు నేనురాను బిడ్డో సర్కారు దవాఖానకు అనే నానుడి ఉండేదని, తెలంగాణ ప్రభుత్వం వచ్చాక కేసీఆర్ కిట్లు, అమ్మఒడి వంటి వినూత్నపథకాల అమలుతో ప్రభుత్వ దవాఖానలకు క్యూకడుతున్నారని గుర్తుచేశారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాజన్నసిరిసిల్ల జిల్లాకేంద్రానికి చేరుకున్న ఆయన జిల్లా కేంద్ర దవాఖానను ఆకస్మికంగా తనిఖీచేశారు. అన్ని వార్డులను పరిశీలించి దవాఖానలో అందుతున్న సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంయుక్త కలెక్టర్ యాస్మిన్‌భాషాతో కలిసి సూపరింటెండెంట్ కార్యాలయంలో వైద్యులు, జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, దవాఖానలోని సమస్యలపై సమీక్షించారు. 'ప్రసవాలతో పాటు ఔట్‌పేషెంట్ల సంఖ్య విపరీతంగా పెరుగుతున్నది. ప్రాణాంతక రోగాలను నయంచేసే వైద్యులు దేవుళ్లతో సమానం. ఉత్తమ సేవలందించి ప్రజల గుండెల్లో సుస్థిరస్థానం సంపాదించుకోవాలి' అని సూచించారు. దవాఖానలో ప్రసవాలు చేసేందుకు గైనకాలజిస్టులు లేరని వైద్యులు చెప్పడంతో స్పందించిన కేటీఆర్, వెంటనే వైద్యారోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి శాంతకుమారికి ఫోన్‌చేశారు. జిల్లాకు నలుగురు గైనకాలజిస్టులను కేటాయించాలని కోరారు. దవాఖానలో బ్లడ్‌బ్యాంక్, డయాలిసిస్, వెంటిలేటర్ వంటి అత్యున్నత సౌకర్యాలున్నాయని, గైనకాలజిస్టు లేరనే కారణంతో ప్రసవాల కోసం వచ్చే గర్భిణులను వేరేప్రాంతాలకు పంపించడం సరికాదన్నారు.

**త్వరలో దవాఖానకు సీటీస్కాన్ యంత్రం**

పేదలకు మెరుగైన వైద్యం అందించడం కోసం జిల్లా కేంద్ర దవాఖానలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని కేటీఆర్ హామీఇచ్చారు. దవాఖానలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులు, ఇతర సమస్యలపై ఆరాతీశారు. డయాలిసిస్‌లో బెడ్లు పెంచాలని వైద్యులు కోరగా, వెంటనే ఏర్పాటు చేస్తామని చెప్పారు. దవాఖానలో సీటీస్కాన్ లేనందున పేదలు ఇబ్బందిపడుతున్నారని జేసీ వివరించగా, త్వరలో సీటీస్కాన్ తెప్పిస్తామని హామీఇచ్చారు. జిల్లాకేంద్రంలో నిర్మాణంలో ఉన్న నర్సింగ్ కళాశాలను త్వరలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. సమస్యలుంటే వెంటనే తన దృష్టికి తేవాలని, మౌలిక వసతులపై నివేదికలు అందజేయాలని కోరారు. వైద్యారోగ్యశాఖ మంత్రి, ముఖ్య కార్యదర్శులను సిరిసిల్లకు తీసుకొచ్చి సమస్యలను పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. 'అంకితభావంతో పనిచేసిన వైద్యులను, అధికారులను ప్రజలు గుర్తిస్తారు. బదిలీ జరిగినా పోనివ్వరు. అందరి మన్ననలు పొందేలా సేవలందించాలి' అని వైద్యులను కేటీఆర్ కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్, సూపరింటెండెంట్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## నువ్వే నా పెద్దకొడుకువు!

కేటీఆర్‌ను ఆలింగనం చేసుకొని మురిసిన మణెవ్వ



మణెవ్వతో ఆప్యాయంగా మాట్లాడుతున్న కేటీఆర్

**ప్రభుత్వం** అమలుచేస్తున్న పథకాలు చాలా బాగున్నాయంటూ టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఓ వృద్ధురాలు ఆలింగనం చేసుకొని ఆత్మీయత ప్రదర్శించింది. పింఛన్లతోపాటు కేసీఆర్ కిట్లు ఇచ్చి ఆదుకుంటున్న నువ్వే నా పెద్దకొడువంటూ సిరిసిల్ల మండలం రాజీవ్‌నగర్‌కు చెందిన వీరబత్తిని మణెవ్వ మురిసిపోయింది. దవాఖానలో అన్ని విభాగాలను పరిశీలిస్తున్న కేటీఆర్‌ను చూసిన ఆమె పరుగున వచ్చి నమస్కరించింది. అవ్వా బాగున్నావా? అంటూ కేటీఆర్ దగ్గరకు తీసుకొని ఆత్మీయంగా పలుకరించడంతో ఆమె భావోద్వేగానికి లోనయ్యింది. 'నీ దయతో బతుకమ్మ చీరల తయారీ పని దొరికింది.. మా కుటుంబమంతా సంతోషంగా ఉన్నాం' అని కృతజ్ఞతలు తెలిపింది. దవాఖానలో తన మనుమరాలు వరలక్ష్మికి రెండోకాన్పులో పాప పుట్టడంతో చూసేందుకు దవాఖానకు వచ్చినట్టు వివరించింది. బిడ్డతో కలిసి స్వాతి అనే పాపను ఎత్తుకొని కేటీఆర్‌తో సెల్ఫీ దిగారు. రుద్రంగి మండలానికి చెందిన శిరీషకు పుట్టిన బాబును ఆమె అక్క స్వాతి ఎత్తుకోగా కేటీఆర్ సరదాగా సెల్ఫీ తీసుకొన్నారు.

# సగటుస్థాయికి వర్షపాతం!

- భారీవర్షాలతో తగ్గిన లోటు వర్షపాతం
- బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- రాష్ట్రవ్యాప్తంగా రెండ్రోజులుగా తెరిపివ్వని వానలు
- జిల్లా కలెక్టర్లను అప్రమత్తం చేసిన ప్రభుత్వం

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** వారంక్రితం వరకు ముఖం చాటేసిన వర్షాలతో 40 శాతం లోటుగా ఉన్న వర్షపాతం ప్రస్తుతం ఎడతెరిపిలేకుండా కురుస్తున్నవర్షాలతో సాధారణ స్థాయికి చేరింది. ఉత్తర కోస్తాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాలను ఆనుకుని ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో నైరుతి రుతుపవనాలు మరింత బలం పుంజుకుని వేగంగా కదులుతున్నాయి. దీని ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రెండ్రోజులుగా పలు ప్రాంతాల్లో వర్షం తెరిపివ్వడం లేదు. భారీవర్షాల నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాల యంత్రాంగాలను అప్రమత్తం చేసింది. రాష్ట్రంలో ఇప్పటివరకు సగటున 383 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా.. 344.1 మిల్లీమీటర్లు నమోదయింది. సగటు వర్షపాతంలోటు 10శాతం లోపే ఉన్నది. వాస్తవంగా సగటు వర్షపాతానికి 10 నుంచి 20 శాతం మధ్య లోటు ఉన్నా.. దానిని సాధారణ వర్షపాతంగానే పరిగణిస్తామని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వై కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో వర్షపాతం సాధారణ స్థాయికి చేరినట్టేనని ఆయన వెల్లడించారు. ఆగస్టు, సెప్టెంబర్‌లో ఇంకా వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రాష్ట్రంలో సాధారణస్థాయికి మించి వర్షపాతం నమోదవుతుందని తెలిపారు.

**పలు జిల్లాల్లో సగటును మించిన వర్షం**

రాష్ట్రంలో పలు జిల్లాల్లో జిల్లా సగటును మించి వర్షపాతం నమోదయింది. ఆదిలాబాద్, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, జగిత్యాల, వరంగల్ అర్బన్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో సగటును మించి వానలు కురిశాయి. జయశంకర్ భూపాలపల్లిలో 619.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఇది జిల్లా సగటు వర్షపాతం కంటే 3 శాతం అధికం. జగిత్యాలలో 481.3 మి.మీ. (+12), ఆదిలాబాద్‌లో 535.2 మి.మీ. (+1), కరీంనగర్‌లో 455.3 మి.మీ. (+22), కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో 612.1 మి.మీ. (+27), వరంగల్ అర్బన్ జిల్లాలో 432.3 మి.మీ. (+20) వర్షం కురిసింది. కాగా, నల్లగొండ (-46), సంగారెడ్డి (-39), వికారాబాద్ (-38), ఖమ్మం (-30), జోగుళాంబ గద్వాల (-29)తోపాటు, మరికొన్ని జిల్లాల్లో లోటువర్షపాతం నమోదయింది.

**రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం**

ఉత్తర కోస్తా ఆంధ్ర, దక్షిణ ఒడిశాతీరాలకు దగ్గరలో పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న వాయవ్య బంగాళాఖాతం ప్రాంతాల్లో సముద్రమట్టానికి 5.8 నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం స్థిరంగా కొనసాగుతున్నది. ఉత్తర కోస్తా ఒడిశా, దాని పరిసర ప్రాంతాల్లో 4.5 కిలోమీటర్ల ఎత్తువరకు ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఈశాన్య బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాల్లో ఈ నెల 4వ తేదీన అల్పపీడనం ఏర్పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. దీనిప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశముందని చెప్పారు.

**జిల్లాల్లో ఉద్యోగులకు సెలవులు రద్దు**

రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం అప్రమత్తమైంది. నిత్యం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లను ఆదేశించింది. జిల్లాల్లో ఉద్యోగులకు సెలవులు రద్దుచేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేకప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌తివారి ఆదేశాలు జారీచేశారు. వర్షాలవల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురుకాకుండా వెంటనే సహాయకచర్యలు చేపట్టాలని సూచించారు. భద్రాచలం వద్ద గోదావరి 41.5 అడుగుల ఎత్తున ప్రవహిస్తున్నదని, వరద ప్రవాహం 43 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేస్తారని పేర్కొన్నారు.

# రోగులకు అసౌకర్యం కలుగకుండా చూడాలి

- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్
- నిమ్స్‌లో మాస్టర్ హెల్త్ కేర్ వెల్‌నెస్ కేంద్రం ప్రారంభం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దవాఖానలకు వచ్చే రోగులకు అసౌకర్యం కలుగకుండా చూడాల్సిన బాధ్యత వైద్యులపైనే ఉన్నదని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ఐఏఎస్ అధికారులకు ప్రత్యేక వైద్యసేవలందించాలన్న ఉద్దేశంతో నిమ్స్‌లో ఏర్పాటుచేసిన మాస్టర్ హెల్త్ కేర్ వెల్‌నెస్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎంఎన్‌సీ బిల్లుకు వ్యతిరేకంగా గాంధీ దవాఖానలో వైద్యులు ఆమరణ నిరాహారదీక్షకు దిగడంపై ప్రతిస్పందించారు. రోగులకు అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలని వైద్యులకు సూచించారు. అనారోగ్య సమస్యలతో వచ్చేవారికి సకాలంలో వైద్యసేవలు అందకపోతే ఎదురయ్యే ముప్పేమిటో వైద్యులకే బాగా తెలుసని, రోగులకు సేవలందించడంలో వైద్యులు బాధ్యతాయుతంగా ఉండాలని మంత్రి ఈటల పేర్కొన్నారు.

# బాసర ట్రిపుల్ ఐటీకి అంతర్జాతీయ అవార్డు

- 11న ఢిల్లీలో ఇండియాస్ మోస్ట్ ట్రస్టెడ్ ఎడ్యుకేషన్-2019 అవార్డు ప్రదానం



**బాసర:** తెలంగాణలోని అత్యున్నత సాంకేతిక విద్యాసంస్థల్లో ఒకటైన బాసర ట్రిపుల్ ఐటీని 'ఇండియాస్ మోస్ట్ ట్రస్టెడ్ ఎడ్యుకేషన్-2019' అవార్డు వరించింది. ఇంటర్నేషనల్ బ్రాండ్ కన్సల్టింగ్ కార్పొరేషన్ యూఎస్‌ఏ ఆధ్వర్యంలో రూపొందించిన కన్జ్యూమర్ రీసెర్చ్ రిపోర్ట్ -2019 ఆధారంగా ఈ అంతర్జాతీయ అవార్డు దక్కింది. నవ భారత నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన విద్యాసంస్థగా బాసర ట్రిపుల్ ఐటీని గుర్తించి ఈ అవార్డు ప్రకటించారని ఇంచార్జి వీసీ అశోక్‌కుమార్ తెలిపారు. అత్యాధునిక ప్రయోగశాలలతో ఇప్పటివరకు 13 వేలమంది విద్యార్థులకు అంతర్జాతీయస్థాయి సాంకేతిక విద్యను అందించడం, వారికి ఉన్నతమైన వసతులు కల్పించడం లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని బాసర ట్రిపుల్ ఐటీని ఈ అవార్డుకు ఎంపికచేశారని, ఈ నెల 11న ఢిల్లీలో ఈ అవార్డు అందుకోనున్నామని ఆయన వివరించారు. బాసర ట్రిపుల్ ఐటీకి ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తంచేశారు.

Bharat 6
Petrol & Diesel

PRESENTING

# SELTOS

## BADASS BY DESIGN

| Signature Kia Design | Next-gen AT & MT | 1.4 Turbo GDI with DCT | 37 Connectivity Features |
|---|---|---|---|
| Globally Acclaimed | Petrol & Diesel BS VI Engines | First-in-segment | With Kia UVO Connect |




**Pre-book your Seltos today** | **Test drive at your nearest dealership** | **Visit www.kia.com/in** Book Kia Seltos

@KiaMotorsIN @KiaMotorsIN Kia Motors India @KiaMotorsIN

First-in-segment




Smart 8.0 Head-up Display

Best-in-segment



BOSE Premium Sound System with 8 Speakers & LED Sound Mood Lights

Best-in-segment



10.25 HD Touchscreen Navigation

First-in-world




Smart Pure Air Purifier with UVO Controls

First-in-segment



Rear Sunshade Curtains

UVO Connect




Remote Start & Voice Recognition with 37 Connectivity Features

### 26 New Additional Features

Signature Tiger Nose Grille | R17 Crystal-cut Alloy Wheels | 6 Airbags | Ventilated Front Seats | Crown Jewel LED Headlamps | Sweeping LED Light Bar | Heartbeat LED DRL | Multi-layer Side Turn Indicator | Heartbeat LED Tail Lamps | Ice Cube LED Fog Lamps | Electric Sunroof | Dual Trims – GT Line and Tech Line | Dual Muffler Design | Red Brake Caliper | Red Center Cap | Ambient Mood Lighting | Advance 7.0 Colour Display Cluster | Multi-drive Mode | Multi-traction Mode | Front Sensor | 4 Disc Brakes | 360° View Camera with Blind View Monitor (BVM) | Reclining Rear Seats | Solar Glass | Driving Rear View Monitor (DRVM) | 8-way Driver Power Seat

## Close to you, no matter where you are

Our long term commitment to India is as big as our ambition. That is why we begin our journey in India with a nation-wide network of dealerships and service centres which ensures ready spare parts availability and quick service. So, no matter where you are in India, you are not very far from Kia.

**160** City Coverage **265** Consumer Touchpoints **206** Sales Points **192** Service Points

**For more information contact - 1800 108 5000**

T&C Apply. Visit your nearest Kia dealership for more details. The product shown is for representation purpose only, actual features, colours and specifications as shown may not be part of standard fitment and may vary. Segment is defined as Mid SUV whose length lies between 4260-4390mm and width between 1775-1825mm. Kia urges you to follow traffic rules, these are meant to keep you safe on roads.

KIA
The Power to Surprise

**FOR INFORMATION CONTACT: HYDERABAD: CAR KIA,** JUBILEE HILLS, PH: 7997720333, **AUTOMOTIVE,** KONDAPUR, PH: 6309908117, **AUTOMOTIVE,** LB NAGAR, NAGOLE, PH: 6309908118, **VIHAAN AUTO,** SECUNDERABAD, PH: 9738312345, **VIHAAN AUTO,** KUKATPALLY, PH: 9394812345



## ఉప్పొంగిన తెలంగాణ నయాగరా!

ములుగు జిలా వాజేడు మండలం చీకుపల్లి అటవీప్రాంతంలో తెలంగాణ నయాగరాగా పేరుగాంచిన బొగత జలపాతం ఉప్పొంగుతున్నది. గురువారం రాత్రి నుంచి ఛత్తీస్‌గఢ్‌తో పాటు స్థానికంగా కురుస్తున్న వర్షాలతో ఉరకలెత్తుతున్నది. జలపాతం అందాలను చూసి పర్యాటకులు తన్మయత్వంతో మురిసిపోయారు. సెల్ఫీలు, కేరింతలతో సందడి నెలకొన్నది. భారీగా వరదనీరు చేరడంతో పర్యాటకులను స్నానాలు చేసేందుకు నీటిలోకి అనుమతించడం లేదు. -వాజేడు

## భద్రాదివద్ద మొదటి ప్రమాద హెచ్చరిక!

**భద్రాచలం, నమస్తే తెలంగాణ/ చర్ల రూరల్:** భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చుతున్నది. శుక్రవారం రాత్రి 9 గంటలకు 41.7 అడుగులకు చేరుకున్నది. ఇది అర్ధరాత్రి తర్వాత 43 అడుగులకు పెరిగే అవకాశం ఉన్నట్టు సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. 43 అడుగులు దాటితే మొదటి ప్రమాదహెచ్చరిక జారీచేస్తారు. గోదావరి పెరుగడంతో భద్రాచలం వద్ద స్నానఘట్టాలు నీటమునిగాయి. కల్యాణకట్ట చుట్టూ వరదనీరు చేరింది. పట్టణ శివారుకాలనీల్లోకి నీరు చేరుకుంది. పలు ఏజెన్సీ గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. చర్ల మండలంలో తాలిపేరు ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో రాత్రి 8.30 గంటల సమయంలో 25 గేట్లను ఎత్తి, 1.92 లక్షల క్యూసెక్కులు విడుదలచేస్తున్నారు.



శుక్రవారం భద్రాచలం కరకట్ట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి



# పొంగిన జీవగంగ



నీటితో కళ కళ లాడుతున్న మంథని మండలం సిరిపురంలోని సుందిల్ల బరాజ్



శుక్రవారం మహదేవ్‌పూర్ మండలం మేడిగడ్డ బరాజ్‌లో నిల్వ ఉన్న నీరు

- కాళేశ్వరం వద్ద ప్రాణహిత ఉగ్రరూపం
- మేడిగడ్డకు 4.47 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- కన్నెపల్లిలో నాలుగోరోజూ మోటర్లు బంద్
- పూర్తిస్థాయి నీటిమట్టానికి అన్నారం బరాజ్
- నాలుగు గేట్లు ఎత్తివేసిన అధికారులు
- గోలివాడలో వెట్‌రన్‌కు మోటర్లు సిద్ధం
- పేరూరు దగ్గర తగ్గిన వరద ఉధృతి
- కడెం, ఎల్లంపల్లికి స్థిరంగా ఇన్‌ఫ్లోలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ నెట్‌వర్క్:** దిగువన మేడిగడ్డ నుంచి.. ఎగువన ఎల్లంపల్లి దాకా గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తున్నది. ప్రాణహిత నుంచి భారీగా వరదనీరు వస్తుండటంతో మేడిగడ్డ బరాజ్ దగ్గర 4.47 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 65 గేట్ల ద్వారా దిగువకు అంతే మొత్తం నీటిని విడుదలచేస్తున్నారు. అటు అన్నారం, సుందిల్ల బరాజ్‌లు కూడా నిండుకుండలను తలపిస్తున్నాయి. ఎల్లంపల్లి జలాశయానికి క్రమంగా వరద పెరుగుతున్నది. ప్రాణహిత కలిసిన తర్వాత కాళేశ్వరం వద్ద గోదావరి పుష్కరఘాట్‌ను ఆనుకొని ప్రవహిస్తున్నది. పుష్కరఘాట్ వద్ద 9.3 మీటర్ల లోతులో పారుతున్నది. కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెన సమీపంలోని కన్నెపల్లి పంప్‌హౌస్‌ను తాకుతూ జలాలు మేడిగడ్డ బరాజ్‌కు వెళ్తున్నాయి. వర్షాల కారణంగా కన్నెపల్లి పంప్‌హౌస్‌లో నాలుగోరోజు కూడా మోటర్లు నిలిపివేశారు. ప్రస్తుతం మేడిగడ్డబరాజ్‌లో 4.72 టీఎంసీల నీటినిల్వ ఉన్నది. రానున్న రోజుల్లో బరాజ్‌లోకి భారీస్థాయిలో జలాలు చేరినట్లయితే మరిన్ని గేట్లను ఎత్తివేసే అవకాశాలున్నట్లు అధికారులు తెలిపారు. పేరూరు దగ్గర గురువారం ఉదయం 8 లక్షల క్యూసెక్కులకుపైగా నమోదైన ప్రవాహం శుక్రవారం ఉదయానికి 6.7 లక్షల క్యూసెక్కులుగా ఉన్నది. ఈ నేపథ్యంలో ధవళేశ్వరం దగ్గర ఇన్‌ఫ్లో ఎనిమిది లక్షల క్యూసెక్కులు ఉండగా.. 7.85 లక్షల క్యూసెక్కులను సముద్రంలోకి వదులుతున్నారు. ఈ నీటిసంవత్సరంలో ఇప్పటిదాకా 213.79 టీఎంసీల గోదావరిజలాలు సముద్రంలో కలిశాయి. మరోవైపు కడెం, ఎల్లంపల్లికి స్థిరంగా వరద కొనసాగుతున్నది. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల సమయానికి కడెం ప్రాజెక్టుకు 6,149 క్యూసెక్కుల వరద వస్తున్నది. 7.6 టీఎంసీల పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులో ప్రస్తుతం 6.32 టీఎంసీల నిల్వ ఉండటంతో 7,774 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. దీంతో ఎల్లంపల్లికి 4,805 క్యూసెక్కుల వరద వస్తున్నది. జలాశయం పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 20.18 టీఎంసీలు కాగా ప్రస్తుతం జలాశయంలో నిల్వ 9.60 టీఎంసీలకు చేరుకున్నది.



మహదేవ్‌పూర్ మండలంలోని కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద పారుతున్న గోదావరి

### నిండుకుండలా అన్నారం బరాజ్

నెలరోజులుగా అన్నారం బరాజ్‌కు చేరిన ప్రాణహిత జలాలు.. ఇక దిగువకు ప్రయాణం చేస్తున్నాయి. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నిరంతరంగా జలాలను ఎత్తిపోయడంతో అన్నారం బరాజ్ నీటిమట్టం శుక్రవారం పూర్తిస్థాయికి చేరింది. దీంతో తొలుత బరాజ్ బ్లాక్-2లోని 5, 7, 8, 9 గేట్లు ఎత్తారు. ప్రవాహం అధికంగా ఉండటంతో మరో రెండు గేట్లను కూడా ఎత్తి దిగువకు 32వేల క్యూసెక్కులను వదిలారు. మరోవైపు మానేరు నుంచి 32వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో అన్నారం బరాజ్ శుక్రవారం తొలిసారిగా 9.47 టీఎంసీల సామర్థ్యానికి చేరింది. దీంతో అప్రమత్తమైన అధికారులు నాలుగు గేట్లను తెరిచి 21,604 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఇప్పటికే ఈ బరాజ్ నుంచి సుందిల్ల బరాజ్‌కు నీటిని ఎత్తిపోయడంతో రామగుండంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు వరకు గోదావరి నిండుకుండలా మారింది. అన్నారం బరాజ్ నీటిమట్టం పూర్తిస్థాయికి చేరుకుంటుందనే ముందస్తు ఆలోచనతో అధికారులు ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి కార్యాలయానికి పరిస్థితులను నివేదిస్తున్నారు. పరిస్థితిని పరిశీలించిన సీఎంవో అధికారుల ఆదేశాలతో గేట్లను ఎత్తివేశారు. మేడిగడ్డ నుంచి వస్తు న్న నీటితో పాటు.. గురువారం రాత్రి నుంచి వర్షాలు పడటంతో వాగులు, తోగులు ఉధృతంగా ప్రవహించి కలుస్తుండటంతో ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం దేవాదుల ఇన్‌టేక్ వెల్ వద్ద నీటిమట్టం పెరుగుతున్నది.

### గోలివాడలో వెట్‌రన్‌కు సిద్ధమవుతున్న ఆరు మోటర్లు

కాళేశ్వరం ప్రాజెక్టు లింకు-1లోని చివరి పంప్‌హౌస్ అయిన అంతర్గాం మండలం గోలివాడ పంప్‌హౌస్‌లోని పంపులకు వెట్‌రన్‌కు అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఇక్కడ తొమ్మిది మోటర్లు ఉండగా ఆరింటిని నేడో రేపో నడిపేందుకు సిద్ధమవుతున్నారు. ఎగువన ఎల్లంపల్లి జలాశయంలోకి వరద వస్తుండటంతో పంప్‌హౌస్ నుంచి నెమ్మదిగానే ఎత్తిపోతలు ప్రారంభించనున్నట్టు అధికారులు తెలిపారు.

# కృష్ణమ్మ ఉరకలు

- ఏకధాటిగా రెండు లక్షల క్యూసెక్కులకుపైగా వరద
- ఆల్మట్టి నుంచి శ్రీశైలం దాకా అదే ఉధృతి
- వేగంగా పెరుగుతున్న శ్రీశైలం నీటిమట్టం
- 35 గంటల్లో జలాశయంలోకి 25 టీఎంసీల నీరు

**హైదరాబాద్/ మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఆల్మట్టినుంచి శ్రీశైలంవరకు కృష్ణమ్మ ఉరకలేస్తున్నది. దాదాపు 2 లక్షల క్యూసెక్కులకుపైగా వరద పోటెత్తుతుండటంతో కృష్ణాబేసిన్‌లో జలకళ ఉట్టిపడుతున్నది. కృష్ణాజలాలు అంతకంతకూ ఉధృతిని పెంచుకుంటూ శ్రీశైలం జలాశయానికి చేరుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ నీటిపారుదల శాఖ ఒకవైపు జూరాలనుంచి సాగునీటిని విడుదలచేస్తూ చెరువులను నింపడంతోపాటు మరోవైపు శ్రీశైలం నుంచి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా నీటి ఎత్తిపోతలు చేపట్టింది. ఆల్మట్టి మొదలు శ్రీశైలం వరకు శనివారం కూడా వరద స్వల్పంగా పెరుగుతుందని కేంద్ర జలసంఘం స్పష్టంచేసింది. మరో 15-20 రోజులపాటు ఇన్‌ఫ్లోలు ఇదేరీతిన నమోదైతే తెలుగు రాష్ట్రాల పరిధిలోని ప్రాజెక్టులన్నీ నిండుకుండల్లా మారనున్నాయి. ఈ నీటి సంవత్సరంలో మొన్నటిదాకా శ్రీశైలం జలాశయం సుమారు 805 అడుగుల నీటిమట్టంతో 31 టీఎంసీల వరకు నీటినిల్వతో ఉన్నది. గత రెండురోజులుగా వస్తున్న వరదతో నీటిమట్టం వేగంగా పెరుగుతున్నది. గత నెల 31 నుంచి ఈ నెల ఒకటో తేదీ ఉదయం వరకు (24 గంటలపాటు) 3.21 టీఎంసీల నీరు వచ్చి చేరగా.. శుక్రవారం ఉదయం ఆరు గంటల సమయానికి అదనంగా 16.68 టీఎంసీలు వచ్చాయి. సాయంత్రం ఐదుగంటల సమయానికి మరో ఎనిమిది టీఎంసీల వరకు రావడంతో గత 35 గంటల్లోనే శ్రీశైలానికి దాదాపు 25 టీఎంసీల నీరు వచ్చింది. శుక్రవారం రాత్రి ఏడు గంటలకు శ్రీశైలానికి ఇన్‌ఫ్లో 2.02 లక్షల క్యూసెక్కులకు పైగా నమోదైంది. శనివారం ఉదయానికి అది మరింత పెరుగుతుందని కేంద్ర జల సంఘం అంచనావేస్తున్నది. ప్రాజెక్టులో నీటినిల్వ ప్రస్తుతం 59.98 టీఎంసీలకు చేరుకున్నది. 215.81 టీఎంసీల పూర్తిసామర్థ్యం ఉన్న శ్రీశైలం నిండాలంటే ఇంకా 155.83 టీఎంసీలు రావాలి. ఇదే వరద కొనసాగితే 8 రోజుల్లో ప్రాజెక్టు నిండుతుంది. భీమా, తుంగభద్ర వరద కూడా తోడైతే శ్రీశైలం ప్రాజెక్టు మరింత త్వరగా నిండేందుకు అవకాశం ఏర్పడుతుంది.



శుక్రవారం శ్రీశైలం ప్రాజెక్టులో పెరిగిన వరద దృశ్యం

### ఆల్మట్టికి భారీగా ఇన్‌ఫ్లోలు

కేంద్ర జల సంఘం ముందస్తు సమాచారం ప్రకారం ఆల్మట్టి నుంచి వరద కాస్త ఎక్కువగానే రానున్నది. శనివారం జూరాలకు ఇన్‌ఫ్లో 2.22 లక్షల క్యూసెక్కులు ఉండొచ్చని సీడబ్ల్యూసీ అంచనా వేస్తున్నది. మూడురోజులుగా ఆల్మట్టి నుంచి స్థిరంగా వస్తున్న వరదతో నారాయణపుర, జూరాల నుంచి శ్రీశైలానికి స్థిరంగా 2 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. శుక్రవారం సాయంత్రం కూడా ఆల్మట్టికి 2.02 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. దీంతో దిగువకు 2.30 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. నారాయణపుర వద్ద 2.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 2.10 లక్షల క్యూసెక్కు అవుట్‌ఫ్లో ఉన్నది.

### జూరాలకు స్థిరంగా వరద

నారాయణపుర- జూరాల మధ్య చిన్న బరాజ్‌లు ఉన్నా.. వాటినుంచి పెద్దగా నీటి వినియోగం లేకపోవడంవల్ల జూరాలకు స్థిరంగా వరద వస్తున్నది. జూరాల జలాశయానికి రాత్రి 9 గంటల సమయంలో 2.10 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం కొనసాగుతున్నందున నారాయణపుర నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లుగా 23 గేట్లు ఎత్తి శ్రీశైలంవైపు విడుదల చేస్తున్నారు. ఇక్కడ అవుట్‌ఫ్లో 2.09 లక్షల క్యూసెక్కులుగా ఉన్నది. నాలుగురోజులుగా జూరాలనుంచి సాగునీటి విడుదల నిరవధికంగా కొనసాగుతున్నది. నెట్టెంపాడు-1500 క్యూసెక్కులు, భీమా-1300 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్-315 క్యూసెక్కులు, ఎడమ కాల్వ-1140 క్యూసెక్కులు, కుడికాల్వ-725 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా మరో 750 క్యూసెక్కులు.. మొత్తంగా 5,730 క్యూసెక్కుల వరకు వదులుతున్నారు. జూరాల కుడి కాల్వ నుంచి నీటిని తీసుకునే నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం పరిధిలోని గుడ్డెందొడ్డి, ర్యాలంపాడు రిజర్వాయర్లలో క్రమం గా నీటిమట్టం పెరుగుతున్నది. గ్రావిటీ కాల్వల ద్వారా రిజర్వాయర్లకు నీటిని తరలిస్తున్న క్రమంలో రైతులు మోటర్లు వేసుకుని పంటలు సాగుచేస్తున్నారు. భీమా ఎత్తిపోతల పథకం పరిధిలోనూ వ్యవసాయపనులు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. జూరాల నుంచి ఉంద్యాల వద్ద లిఫ్ట్ చేసిన జలాలు పర్దీపూర్ వరకు చేరుకున్నాయి. అక్కడినుంచి మూడురోజుల్లో తీలేరుకు, ఆపై కోయిల్‌సాగర్‌కు చేరుకుంటాయని అధికారులు చెప్తున్నారు.



శుక్రవారం నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని స్వర్ణ ప్రాజెక్టు ఎడమ కాల్వద్వారా నీటిని విడుదలచేసిన అనంతరం నదిలో పూలు చల్లుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, నిర్మల్ జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

**శుక్రవారం వివిధ ప్రాజెక్టుల్లో నీటిమట్టాల వివరాలు**

| రిజర్వాయర్ | ఎఫ్‌ఆర్‌ఎల్ అడుగుల్లో | ప్రస్తుత మట్టం అడుగుల్లో | పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో | ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో | ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో | అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో |
|---|---|---|---|---|---|---|
| ఆల్మట్టి | 1705.00 | 1700.59 | 129.72 | 106.83 | 2,02,400 | 2,30,207 |
| నారాయణపుర | 1615.00 | 1610.70 | 37.64 | 31.85 | 2,40,135 | 2,10,128 |
| జూరాల | 1045.00 | 1044.39 | 9.66 | 9.29 | 2,10,000 | 2,09,881 |
| తుంగభద్ర | 1633.00 | 1607.65 | 100.86 | 30.96 | 17,293 | 1,233 |
| శ్రీశైలం | 885.00 | 838.70 | 215.81 | 59.98 | 2,02,704 | 2,400 |
| నాగార్జునసాగర్ | 590.00 | 506.80 | 312.05 | 126.30 | 837 | 837 |
| సింగూరు | 1717.93 | 1670.28 | 29.91 | 0.44 | 20 | 20 |
| నిజాంసాగర్ | 1405.00 | 1367.92 | 17.80 | 0.11 | 41 | 10 |
| శ్రీరాంసాగర్ | 1091.00 | 1049.10 | 90.31 | 5.72 | 406 | 232 |
| లోయర్‌మానేరు | 920.00 | 881.35 | 24.07 | 3.40 | 921 | 204 |
| కడెం | 700.00 | 694.72 | 7.60 | 6.29 | 6,083 | 7,200 |
| ఎల్లంపల్లి | 485.56 | 470.41 | 20.18 | 9.93 | 4,805 | - |



జోగుళాంబ గద్వాల జిల్లాలో జూరాల ప్రాజెక్టు వద్ద కొనసాగుతున్న నీటి విడుదల



మూడేండ్ల కిందట నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులో వేప మొక్క నాటుతున్న సీఎం కేసీఆర్



మూడేండ్ల కిందట సీఎం కేసీఆర్ నాటిన మొక్క ఏపుగా ఇలా పెరిగింది

## సీఎం కేసీఆర్ నాటిన మొక్క చెట్టయ్యింది!

గుండ్రాంపల్లిలో వృక్షంగా మారిన వేప మొక్క

**చిట్యాల:** హరితహారంలో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ మూడేండ్ల కిందట నాటిన మొక్క ఏపుగా పెరిగి చూపరులను ఆకర్షిస్తున్నది. 2016 జూలై 8న నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులో 65వ జాతీయరహదారి పక్కన సీఎంకేసీఆర్ వేప మొక్కనునాటి హరితహారాన్ని ప్రారంభించారు. మూడేండ్లలో ఈ మొక్క చెట్టులా ఎదిగింది. జాతీయరహదారిపై హరితహారంలో నాటిన మిగిలిన మొక్కలకు భిన్నంగా పొడవుగా కనిపిస్తుండటంతో పలువురు ఈ చెట్టును ఆసక్తిగా గమనిస్తున్నారు. ఆ ఒక్కరోజే పెద్దఎత్తున విద్యార్థులు, పలుసంస్థల భాగస్వామ్యంతో జాతీయరహదారి వెంట నాటిన హరితహారం మొక్కలన్నీ పెరిగి నేడు ప్రత్యేకఆకర్షణగా నిలుస్తున్నాయి.

హరిత చైతన్యం

# అడవుల్లో 'హరిత విప్లవం'!

- అడవి క్షీణించిన భూముల్లో మొక్కల పెంపకం
- ఏడాది వ్యవధిలోనే ఖాళీస్థలాల్లో పూర్వవైభవం
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అద్భుతం

**జయశంకర్ జిల్లాప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కలప స్మగ్లర్ల కారణంగా క్షీణించిన అడవులకు పూర్వ వైభవం తేవాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాలను సవాల్‌గా తీసుకొన్న అటవీశాఖ అద్భుతాన్ని సృష్టించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం గాంధీనగర్, మైలారం మధ్య మైదానంలా మారిన అటవీభూముల్లో గత ఏడాది అటవీశాఖ పెద్దఎత్తున మొక్కలు నాటింది. ఇవేగాక మిగతా ప్రాంతాల్లోని అడవుల్లోని కొన్ని వందల ఎకరాల్లో హరితహారాన్ని ఉద్యమంలా చేపట్టింది. వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న అటవీభూములను చదును చేసి ప్లాంటేషన్ చేపట్టింది. నర్సరీల్లో ఏపుగా పెరిగిన వివిధరకాల మొక్కలను నాటి సంరక్షించింది. ఫలితంగా మైదానం కాస్తా ఇప్పుడు పచ్చబడి పూర్వవైభవం సంతరించుకున్నది.

### బతికిన 90 శాతం మొక్కలు

చెల్పూర్ అటవీ రేంజ్ పరిధిలోని గాంధీనగర్, మైలారం మధ్య క్షీణించిన అటవీప్రాంతంలో ఖాళీగా ఉన్న నలభై ఎకరాలను అటవీశాఖ గుర్తించింది. మొక్కలు నాటేందుకు 45 సెంటీమీటర్ల వెడల్పు, 45 సెంటీమీటర్ల లోతుతో మొదట గుంతలుతీశారు. మూడు మీటర్లకు ఒకటి చొప్పున మొత్తం 20,500 మొక్కలు గత ఏడాది ఆగస్టులో నాటారు. వీటిలో కదంబ, మహాగని, ఉసిరి, రావి, మర్రి, వేప, నేరేడు, ఎగిస, ఏరుమద్ది, పనస తదితర రకాల మొక్కలు ఉన్నాయి. చెల్పూర్ అటవీ రేంజ్ అధికారులు ఈ మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టారు. ఒక బోరు వేసి మోటరు అమర్చారు. వేసవిలోనూ సరిపడా నీరందించారు. వర్మి కంపోస్టుతో పాటు ఎరువులువేశారు. దీంతో ఏడాది తిరుగకముందే ఇక్కడి మొక్కలు మీటరుకుపైగా పెరిగాయి. నాటిన సమయంలో మీటరు కంటే తక్కువగా ఎత్తు ఉన్న మొక్కలు, ప్రస్తుతం రెండు మీటర్ల ఎత్తుతో కనిపిస్తున్నా యి. ఈ మొక్కలన్నీ పచ్చనిహారంలా తయారై చిట్టడవిని తలపిస్తున్నాయి. నాటిన మొక్కల్లో సుమారు 19 వేల వరకు(90 శాతం) బతికి ఉన్నాయని, అటవీ శాఖ అధికారులు తెలిపారు. జిల్లాలో అడవి క్షీణించిన ఇతర ప్రాంతాల్లోనూ గత ఏడాది హరితహారం నుంచి చేపట్టిన ప్లాంటేషన్లలో నాటిన మొక్కలు కూడా బతికాయని పేర్కొన్నారు. ఈ ప్రయోగం విజయవంతమైన నేపథ్యంలో ఈ ఏడాది ఐదోవిడుత హరితహారంలో కూడా క్షీణించిన అడవులస్థానంలో అటవీ భూములను గుర్తించి మొక్కలు నాటుతున్నారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం గాంధీనగర్ వద్ద మైదానంలా మారిన అటవీ భూమిలో గత ఏడాది నాటిన మొక్కలు ఇవి


కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్-టి మండలం చింతగూడ చెక్‌డ్యాం వద్ద వరదలో కొట్టుకుపోతున్న ఆటోను తాడు సాయంతో లాగుతున్న స్థానికులు


మత్తడిపోస్తున్న ములుగు జిల్లా మంగపేట మండలం తిమ్మంపేట పెద్ద చెరువు


మంచిర్యాల జిల్లా బొందచేను వాగులో గల్లంతైన వ్యక్తి కోసం గాలిస్తున్న అధికారులు (ఇన్‌సెట్‌లో) మాంతయ్య (ఫైల్)


వర్షంతో జలమయమైన వరంగల్‌లోని ప్రధాన రహదారి


నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలం కొత్తపల్లి-పాతపల్లి గ్రామాల మధ్య పొంగుతున్న రంగన్‌గుంట్ల వాగును దాటుతున్న విద్యార్థులు


నిర్మల్ జిల్లాలోని సదర్‌మాట్ ఆనకట్ట ఎగువ నుంచి పారుతున్న నీరు


ములుగు రూరల్ మండలంలోని జగ్గన్నగూడెం-సర్వాపురం మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న బొగ్గుల వాగు

# జోరందుకున్న వాన

## రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు

పలు జిల్లాల్లో భారీగా.. ఇంకొన్నిచోట్ల ముసురు

ఉధృతంగా పొంగుతున్న వాగులు

పదుల సంఖ్యలో గ్రామాలకు స్తంభించిన రాకపోకలు

మంచిర్యాల జిల్లా బొందచేను వాగులో వ్యక్తి గల్లంతు

సింగరేణిలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

అత్యధికంగా వెంకటాపూర్‌లో 21.6 సెం.మీ. వర్షం


మహబూబాబాద్‌లో ఉధృతంగా పారుతున్న మున్నేరు వాగు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** రాష్ట్రంలో వాన జోరందుకున్నది. ముసురుతో మొదలై దంచి కొడుతున్నది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, వరంగల్ రూరల్ జిల్లాల్లో భారీ వర్షం పడింది. ఖమ్మం, పెద్దపల్లి, మంచిర్యాల, ఉమ్మడి పాలమూరు తదితర జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం పడగా, నల్లగొండ, సూర్యాపేట, వికారాబాద్ తదితర జిల్లాల్లో ముసురు కురిసింది. మంచిర్యాల జిల్లాలో ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. భారీ వర్షాలతో సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. పలు జిల్లాల్లో వాగులు ఉధృతంగా ప్రవహించడంతో పదులసంఖ్యలో గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. రాష్ట్రంలో అత్యధికంగా ములుగు జిల్లాలోని వెంకటాపూర్ మండలంలో 21.6 సెం.మీ., అదే జిల్లాలోని వెంకటాపురం (నూగూరు) మండలంలో 18 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

### వాగులో వ్యక్తి గల్లంతు..

మంచిర్యాల జిల్లావ్యాప్తంగా 6.9 మి.మీ. వర్షం పడింది. గురువారం రాత్రి ఉధృతంగా ప్రవహిస్తున్న బొందచేను వాగు దాటుతూ వేమనపల్లి మండలం ముల్కలపేటకు చెందిన మాంతయ్య(50) గల్లంతయ్యాడు. శుక్రవారం అధికారులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. బెల్లంపల్లి పోచమ్మచెరువు, కన్నెపల్లి మండలం ఎర్రవాగు వరద నీటితో పరవళ్లు తొక్కుతున్నది. బాబాపూర్, తంగెళ్లపెల్లి గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వేమనపల్లి మండలంలో బద్దలపల్లి వాగుపై తాత్కాలిక వంతెన కొట్టుకుపోవడంతో ముల్కపేట, రాచర్ల, కోటపల్లి మండలంలోని వెంచవల్లి, జనగామ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

### వాగులో చిక్కుకున్న ఆటో..

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్-అగర్‌గూడ మధ్య వంతెనపైనుంచి వరద ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సిర్పూర్-టీ మండలం చింతకుంటలోని చెక్ డ్యాం వద్ద నీటి ఉధృతికి డ్రైవర్‌తో సహా ఆటో వరదలో కొట్టుకుపోతుండగా.. స్థానికులు తాళ్ల సాయంతో బయటకు తీశారు. శుక్రవారం 5.5 సెం.మీ. వర్షపాతం నమోదైంది. కుమ్రం భీం ప్రాజెక్టులోకి 2,425 క్యూసెక్కుల వరదనీరు చేరుతుండగా, మూడు గేట్లను ఎత్తి దిగువకు 30 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

### మత్తడి దుంకుతున్న చెరువులు..

కరీంనగర్ జిల్లాలోని చెరువులు మత్తడి దుంకుతున్నాయి. జగిత్యాల జిల్లాలో ఓ మోస్తరు వర్షం కురిసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 5.5 సెం.మీ., పెద్దపల్లి జిల్లాలో 4 సెం.మీ., జనగామ జిల్లాలో 2.6 సెం.మీ. సగటు వర్షపాతం నమోదైంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మూల వాగు, గంజివాగు, నక్కవాగు, తిప్పాపూర్ కట్టు కాల్వ ప్రవాహం ఊపందుకున్నది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ములకలపల్లి మండలంలో అత్యధి కంగా 14.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. చర్ల మండలంలోని ఈతవాగు, పైడివాగులు పొంగి ప్రవహిస్తుండటంతో 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దుమ్ముగూడెం మండలం కే లక్ష్మీపురం-గౌరారం మధ్య వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. గుప్పలమంగి వాగు పొంగి ప్రవహిస్తుండటంతో ఎనిమిది గిరిజన గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పర్ణశాల వద్ద సీతమ్మవాగు పొంగిపొర్లుతూ.. సీతమ్మ కుటీరంలోకి నీరుచేరింది. గుండాల మండలంలోని కిన్నెరసాని వాగు పొంగి 11 గ్రామాలకు, మల్లన్నవాగు పొంగి ప్రవహించడంతో ఎనిమిది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఖమ్మంలో ఓ మోస్తరు వాన కురిసింది.

### వరంగల్‌లో..

వరంగల్ అర్బన్ జిల్లాలో 6.1 సెం.మీ. వర్షం పడింది. వరంగల్ రూరల్ జిల్లాలో భారీ వర్షం కురుస్తున్నది. పాకాల సరస్సులో 11 అడుగుల నీటి మట్టం చేరింది. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ అడవి ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. నర్సంపేట- నెక్కొండ మార్గంలో ముగ్ధుంపురం తాత్కాలిక వంతెనపై నుంచి నీరు వెళ్తున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నది. టేకుమట్ల మండలంలోని చలివాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. చిట్యాలలో వర్షంతో ఎస్‌ఆర్‌ఎస్పీ కెనాల్ తెగి సుమారు 20 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి.

### పొంగిన వాగులు.. నిలిచిన రాకపోకలు

ములుగు జిల్లాలో కుండపోత వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా 15.6 సెం.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లాలోని వెంకటాపూర్ మండలంలో అత్యధికంగా 21.6 సెం.మీ., వెంకటాపురం(నూగూరు)లో 18సెం.మీ., ములుగులో 15.2 సెం.మీ., తాడ్వాయి, మంగపేటలో 15 సెం.మీ. చొప్పున, గోవిందరావుపేటలో 14.4 సెం.మీ., వాజేడులో 13.6 సెం.మీ., ఏటూరునాగారంలో 12. సెం.మీ. వర్షం కురిసింది. లక్నవరం చెరువు నీటి మట్టం 30 అడుగులకు చేరుకోగా, ఎగువన కురుస్తున్న వర్షాలతో రామప్ప చెరువు 19 అడుగులకు చేరుకున్నది. వర్షం, ఈదురుగాలులకు పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. వాజేడు మండలంలో కొంగలవాగు పొంగిపొర్లుతున్నది. వెంకటాపురం( నూగూరు) మండలంలో భారీ వర్షానికి వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. తాడ్వాయి మండలం మేడారం వద్ద జంపన్నవాగు ఉగ్రరూపం దాల్చింది.

### పొంగిన మున్నేరు వాగు

మహబూబాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. మున్నేరు వాగు పొంగి ప్రవహిస్తున్నది. కేసముద్రం మండలంలో అత్యధికంగా 14.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ముసురు వాన కురిసింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. భూదాన్ పోచంపల్లి మండలంలో కుంటలు పొంగి పెద్దరావుపల్లి, భట్టుగూడెం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వికారాబాద్, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉమ్మడి పాలమూరు జిల్లాను ముసురుపట్టుకున్నది. నారాయణపేటలోని పది మండలాల్లో భారీ వర్షం పడింది. నారాయణపేటలో 5.4 సెం.మీ., దామరగిద్దలో 4.8 సెం.మీ. వర్షపాతం నమోదైంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో ముసురు పట్టుకున్నది. వనపర్తి జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఓ మోస్తరు వానలు పడ్డాయి. నిజామాబాద్ జిల్లాలో విస్తారంగా వర్షం కురిసింది. రెంజల్ మండలం కందకుర్తి సమీపంలో త్రివేణి సంగమ క్షేత్రం వద్ద గోదావరిలో వరద ప్రవాహం పెరిగింది.

### సింగరేణిలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి


మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో..

భారీ వర్షాలకు మంచిర్యాల జిల్లాలో సింగరేణివ్యాప్తంగా బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. శ్రీరాంపూర్, మందమర్రి, రామకృష్ణాపూర్ ఏరియాల్లో ఉన్న ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. క్వారీల్లో భారీగా నీరు చేరింది. ఓవర్‌బర్డెన్‌తోపాటు బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. శ్రీరాంపూర్ ఏరియాలో 9 వేల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడగా, 75 వేల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీత నిలిచిపోయింది. మందమర్రిలో 60వేల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీత పనులు, 5వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. భద్రాద్రి కొత్తగూడెంలోని సింగరేణి ఓపెన్‌కాస్ట్‌లో బొగ్గు ఉత్పత్తి ఆగిపోయింది. భూపాలపల్లి ఏరియా కేటీకే ఓసీపీ-2 బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది.

### గ్రేటర్ హైదరాబాద్‌లో భారీ వర్షం


అఫ్జల్‌గంజ్ వద్ద మూసీలో వరద ప్రవాహం


మాదాపూర్‌లో జలమయమైన ప్రధాన రహదారి

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** గ్రేటర్ హైదరాబాద్‌లో భారీ వర్షం కురుస్తున్నది. రెండ్రోజులుగా ఎడతెరిపిలేకుండా పడుతున్న వానలతో శుక్రవారం లోతట్టు ప్రాంతాల్లోకి నీరుచేరింది. నగరంలోని పలు ప్రధాన రహదారులపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ఉప్పల్, తార్నాక, సికింద్రాబాద్ ప్రధాన రహదారిపై బంజారాహిల్స్ వరకు, హైటెక్‌సిటీ, గచ్చిబౌలి, మాదాపూర్, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాల్లోనూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సెంట్రల్‌జోన్, ఈస్ట్‌జోన్ పరిధిలో పలుచోట్ల చెట్లు నేలకూలాయి. బల్దియా అధికారులు రంగంలోకి దిగి రోడ్లపై నిలిచిన నీటిని మోటర్ల సాయంతో తొలగించారు.


సూర్యాపేటలో పాత జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఇంటిని కోల్పోయిన గుండా భారతమ్మ శుక్రవారం క్యాంపు కార్యాలయంలో మంత్రి జగదీశ్‌రెడ్డిని కలిసి తనకు న్యాయం చేయాలని కోరగా.. మంత్రి స్పందిస్తూ.. డబుల్‌బెడ్రూం ఇంటితో పాటు మోడల్ మార్కెట్‌లో దుకాణం కేటాయిస్తానని హామీ ఇచ్చారు.
- సూర్యాపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ

# సాగు సంబురం

## విస్తారంగా వర్షాలతో ఊపందుకున్న వ్యవసాయ పనులు


మంచిర్యాల జిల్లా చెన్నూరులో జోరుగా సాగుతున్న వరినాట్లు

**నెట్‌వర్క్ నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో సాగు సంబురం మొదలైంది. వ్యవసాయ పనుల్లో జోరు పెరిగింది. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో రైతుల మోముల్లో సంతోషం వెల్లివిరిస్తున్నది. రైతులు, రైతు కూలీలు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. జగిత్యాల జిల్లాలో 1,20,602 హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణం కాగా, ఇప్పటివరకు 65,212 హెక్టార్లలో రైతులు వివిధ పంటలు వేశారు. జూలై నెలాఖరు వరకు 6,128 హెక్టార్లలో వరినాట్లు వేసిన రైతులు.. మరో 26,392 హెక్టార్లలో వరినాట్లు వేస్తారని అధికారులు అంచనాకు వచ్చారు. 22,952 హెక్టార్లలో మక్కజొన్న, 8,839 హెక్టార్లలో పత్తి, అత్యధికంగా 13,070 హెక్టార్లలో పసుపు పంట వేస్తున్నారు. కరీంనగర్‌లో జిల్లాలో 1,10,828 హెక్టార్లలో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేయగా, ఇప్పటివరకు 90,172 హెక్టార్లలో సాగుచేశారు. వరి 32,081 హెక్టార్లలో, మక్కజొన్న 12,007 హెక్టార్లు, పత్తి 42,987 హెక్టార్లలో సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. పెద్దపల్లి జిల్లాలో సాధారణ విస్తీర్ణం 85,952 హెక్టార్లు ఉండగా. ఇప్పటివరకు బావులు, బోర్ల కింద 51,620 హెక్టార్లలో పంటలు వేశారు. సాధారణ విస్తీర్ణంలో 60 శాతానికి పైగా పంటలు సాగైనట్టు వ్యవసాయాధికారి తెలిపారు. మంచిర్యాల జిల్లాలో 2,35,650 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటివరకు 1,51,702 ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 80 వేల హెక్టార్లలో రైతులు పత్తి పంట సాగు చేస్తున్నారు. కంది 15,500 హెక్టార్లు, 20 వేల హెక్టార్లలో సోయా, 39 వేల 500 హెక్టార్లలో వరి పంటలు సాగు చేస్తున్నారు. మెదక్ జిల్లాలో 50 వేల ఎకరాల్లో వరి, 35 వేల ఎకరాల్లో మక్కజొన్న, 45 వేల ఎకరాల్లో పత్తి, 7 వేల ఎకరాల్లో కొర్రలు, రాగులు, కందులు సాగు చేస్తున్నారు.

## శ్రీనివాసరావు హత్యకేసులో ఇద్దరు అరెస్ట్

**చర్ల రూరల్:** గతనెలలో మావోయిస్టులు హతమార్చిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం బీ కొత్తూరు మాజీ ఎంపీటీసీ నల్లూరి శ్రీనివాసరావు హత్యకేసులో ప్రమేయం ఉన్న ఇద్దరువ్యక్తులను పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. భద్రాచలం ఏఎస్పీ రాజేశ్‌చంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. మావోయిస్టు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కలివేరు క్రాస్‌రోడ్డు వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. పట్టుబడిన వారు బెస్త కొత్తూరుకి చెందిన జీడిగుంట జగదీశ్ (38), ఛత్తీస్‌గఢ్‌లోని కిష్టారంకి చెందిన సోడి ఉంగయ్య (22)గా పోలీసులు గుర్తించారు. వీరికి శ్రీనివాసరావు హత్యకేసులో ప్రమేయం ఉన్నట్టు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి మావోయిస్టులకు సంబధించిన రెండు బ్యానర్లు, పది పోస్టర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

హైదరాబాద్ నగరంలోని ప్రముఖ ISP కంపెనీతో కలిసి పనిచేయు సంస్థలకు అవకాశం
ద్విచక్ర వాహనంతో పాటు మ్యాన్‌పవర్ ఏర్పాటు చేయగల సంస్థలు కావలెను. (Cable Works)
ఆకర్షణీయమైన షరతులతో పాటు దీర్ఘకాలిక నిబద్ధతను మేము ఆశిస్తున్నాము
మరిన్ని వివరాలకు సంప్రదించండి: శేషు–040-42884240

PROFESSOR JAYASHANKAR TELANGANA STATE AGRICULTURAL UNIVERSITY
Administrative Office, Rajendranagar, Hyderabad-30, Telangana State, India
Advt.No.6005/Exams/2019(3) Date:02-08-2019
ADMISSION NOTIFICATION
Combined counselling for admission into various undergraduate programmes of PJTSAU, PVNRTVU and SKLTSHU for the academic year 2019-20 will be conducted during 07-08-2019 to 14-08-2019 (Except 10th, 11th & 12th August, 2019).
For further details visit: www.pjtsau.edu.in
Dr. S.SUDHEER KUMAR, REGISTRAR.

P.V. NARSIMHA RAO TELANGANA VETERINARY UNIVERSITY
Administrative Office, Rajendranagar, Hyderabad-500030
FIRST CONVOCATION NOTIFICATION
No. 1920/PVNRTVU/Convocation Date : 01.08.2019
The 1st convocation of P.V.Narsimha Rao Telangana Veterinary University, Hyderabad for conferring degrees will be held on 17-08-2019 at University Auditorium, PJTSAU, Rajendranagar from 9:00 AM. All the candidates in the faculties of Veterinary Science and Dairy Technology who got qualified from 31-12-2015 to 31-12-2017 for the award of degrees are eligible for admission in to this convocation. The candidates who have submitted applications for taking degrees in person are eligible to attend this convocation. The list of eligible candidates for taking degrees in person will be placed on the University website. For further details, please follow the University website http://tsvu.nic.in.
S.T. VIROJI RAO
REGISTRAR


సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జ్యోతి ప్రజ్వలన చేసి సాహితీ సదస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు రమణాచారి తదితరులు

## యువతను చైతన్యపరిచేలా సాహిత్యం

### రాష్ట్రస్థాయి సాహితీ సదస్సులో ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

**సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ:** కవులు, రచయితలు ఆకుపచ్చని, ఆరోగ్యతెలంగాణ దిశగా తమరచనలు చేయాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. యువతను సన్మార్గం వైపు నడిపించేందుకు, చైత్యపరిచేందుకు సాహిత్యం తోడ్పడాలని సూచించారు. శుక్రవారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీకళాశాలలో కేవీ రాఘవాచారి స్మారక సాహిత్య పీఠం, డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాహితీ సదస్సుకు ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి హాజరయ్యారు. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల రెండోబ్యాచ్ తరగతుల ప్రారంభోత్సవంలోనూ పాల్గొన్నారు. ఆయా సమావేశాల్లో హరీశ్‌రావు మాట్లాడుతూ.. సాహిత్యానికి పుట్టినిల్లు సిద్దిపేట అనిచెప్పారు. వైద్యవిద్యార్థులు సామాజిక స్పృహ.. సేవా దృక్పథంతో ముందుకు సాగాలని ఆయన సూచించారు.

## విద్యుదాఘాతంతో దంపతులు మృతి

### తీగపై దుస్తులు ఆరేస్తుండగా ఘటన
### జగిత్యాల జిల్లా వెల్లుల్లలో విషాదం

**మెట్‌పల్లి రూరల్:** ఇనుప తీగపై దుస్తులు ఆరేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై దంపతులు మృతిచెందారు. ఈ ఘటన జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వెల్లుల్లలో శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నది. ఆసరి గంగాధర్(45), లక్ష్మి(40) దంపతులు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం ఇంట్లో దంపతులిద్దరే ఉంటున్నారు. శుక్రవారం రాత్రి స్నానంచేసిన గంగాధర్ ఇనుప తీగపై దుస్తులు ఆరేస్తుండగా కరెంట్ షాక్‌కు గురయ్యాడు. గమనించిన లక్ష్మి.. భర్తను రక్షించే క్రమంలో తీగను పట్టుకొని తానూ విద్యుదాఘాతానికి గురైంది. ఇద్దరు అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. వర్షం వల్ల తడిగా ఉండటంతో తీగలకు విద్యుత్ ప్రవహించి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు.

## డెంగీతో విద్యార్థిని మృతి

**కూసుమంచి:** ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పోచారం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ రమేశ్, జనని దంపతుల కుమార్తె గోఅర్చిత శుక్రవారం డెంగీతో మృతిచెందింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరం సమీపంలోని నాగయ్యగడ్డ ఎస్సీ గురుకుల పాఠశాలలో గో అర్చిత ఏడోతరగతి చదువుతున్నది. గతనెల జ్వరం రావడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించి, చికిత్స అందిస్తుండగా మృతిచెందింది.



జమ్మూకశ్మీర్‌కు కేంద్రం ఈ మధ్యనే పంపిన 10 వేల సైన్యానికి తోడు మరో 25 వేల మందిని పంపి ప్రజలను మానసికంగా భయాందోళనలకు గురిచేస్తున్నది. కశ్మీర్‌లో భద్రతా బలగాలకు కొదువలేదు. కశ్మీర్ సమస్య రాజకీయమైనది. దాన్ని మిలిటరీతో పరిష్కరించలేరు. కేంద్రం ఈ విషయంలో పునరాలోచించాలి.

**మెహబూబా ముఫ్తీ, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి**

జమ్మూకశ్మీర్ సమస్యను మరింత జటిలం చేయొద్దని మేం ప్రధాని మోదీని కోరాం. బలగాలు పెంచటం ద్వారా కశ్మీర్ లోయలో పరిస్థితి మరింత దిగజారుతుంది. రాజకీయ, న్యాయపరమైన సమస్యలు ఎన్నికైన ప్రభుత్వాలతోనే పరిష్కారమవుతాయి. అంతేకానీ భద్రతా బలగాలతో కాదు.

**ఒమర్ అబ్దుల్లా, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి**



**చరిత్రలో నేడు**



**1492**

కొత్త భూ ఖండాల అన్వేషణ కోసం మూడు పడవలతో సముద్రయానానికి బయల్దేరిన కొలంబస్.

**1914**



బెల్జియంను ఆక్రమించి ఫ్రాన్స్‌పై యుద్ధం ప్రకటించిన జర్మనీ. మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభం.



**1967**

వియెత్నాం చేరుకున్న 45 వేల అమెరికా సేనలు.

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మోటారు వాహనాల చట్ట సవరణ బిల్లుతో దేశంలో రోడ్డు భద్రత పెరుగుతుందని ఆశించవచ్చు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు, అతివేగం తదితర విషయాల్లో గతంలో ట్రాఫిక్ పోలీసులు వ్యవహరించిన తీరు అప్రతిష్ఠను తెచ్చింది. ఆధునిక టెక్నాలజీ సాయంతో స్పీడ్ కెమారాలు, సీసీ టీవీలు, స్పీడ్ గన్స్ తదితరాలతో నిబంధనలు పాటించేలా చేసి రోడ్డు భద్రతను పెంచాల్సిన అవసరం ఉన్నది. ఈ కొత్త బిల్లుతోనైనా రోడ్డు రవాణాలో మంచి రోజులొస్తాయని ఆశించవచ్చు.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

కేరళ లోని కొచ్చిలో నిర్మించిన ఫ్లై ఓవర్లలో చోటుచేసుకున్న అవినీతి అక్రమాలపై అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ యుద్ధం నడుస్తున్నది. పలరివట్టోమ్, వైట్టిలా ఫ్లై ఓవర్ల నిర్మాణాల్లో జరిగిన అవినీతిపై యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్‌లు పరస్పర ఆరోపణలతో కాలం గడుపుతున్నాయి. మరోవైపు కొచ్చి పజలు మాత్రం ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్నారు. పలరివట్టోమ్ ఫ్లై ఓవర్ నిర్మాణం జరిగిన 3 నెలలకే రంధ్రాలు, పిల్లర్లకు పగుళ్లు పడ్డాయి. దీంతో దానిపై నుంచి ట్రాఫిక్‌ను నిలిపేశారు. 2016లో 42 కోట్లతో నిర్మించిన ఆ ఫ్లైఓవర్ మరమ్మతులకు 18 కోట్లు ఖర్చుచేశారు. మరో ఫ్లైఓవర్ ఇంకా పూర్తికాలేదంటే ప్రభుత్వాల పనితీరు చెప్పకనే చెబుతున్నది.

**ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్**



# మధురానుభూతి

'ఒకట నదివయి, ఒకచోట ఒదిగి ఒదిగి/(నిజాం) సాగరమవై చలింపక సమసియుంటి/ వెంత సౌమ్య స్వభావమోయీ! పరుంగు/లిడు మనస్సును బంధింప దొడగినావు' అంటూ గోదావరికి ఉపనదియైన మంజీరాపై కట్టిన నిజాంసాగర్‌ను చూసి కవితాఝరిని ప్రవహింపచేశాడు మహాకవి దాశరథి ఆనాడు. నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఆ యోధుడు, నిజాములు కట్టించిన ఆ ప్రాజెక్టును చూసి మురిసిపోయాడే తప్ప వంకర బుద్ధితో తప్పుపట్టలేదు. 'నేలదున్ని బతుకంత యు పస్తులు పన్న రైతు మా/పోతనయేమో! వాని వడబోతలలో కవితా ప్రపంచ మా/పాత మనోహరమ్మయిన పల్కు జగద్వితమ్ము: వాని సం/గాతమ్ము నీకు కావ్యతను కల్పన చేసినదోయి, వాహినీ!' అంటూ నదీమ తల్లిని సంబోధిస్తూ వర్ణించాడు ఆ మహాకవి. పస్తులు పన్న రైతన్నలో పోతనను గాంచాడు, ఆ రైతు సంగాతమే ఈ నదికి కావ్యతను కల్పన చేసినదన్నాడు. ఆ కాలంలో నిజాం సాగరమే అతిపెద్ద ప్రాజెక్టు. నేడు తెలంగాణ సమాజం ప్రపంచాన్ని అబ్బురపరిచే విధంగా కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించుకున్న తీరును దాశరథి కాంచి ఉంటే ఎంత మురిసిపోయేవారో ఎంతగొప్పగా వర్ణించేవారో! ప్రాణహిత నదీజలాలను ఒడిసిపట్టి కొండలు కానల గుండా ఎదురెక్కించి, శుష్కించిన గోదావరి నదీమాతకు పునరుజ్జీవం పోయడం ఎంత అద్భుతం! అందుకే కాళేశ్వరం నీళ్ళు జలాశయాలను నింపుతూ పైకి చేరే కొద్దీ– మంథనిలో, గోదావరిఖని వంతెన దగ్గరా, అడుగడుగునా ప్రజలు పసుపు కుంకుమలు జల్లి హారతులిస్తున్నారు. ఉప్పొంగే హృదయాలతో స్వాగతం పలుకుతున్నారు. ప్రజలకు నదులతో ఉన్న అనుబంధాన్ని, జలాల ప్రాధాన్యాన్ని వర్ణించడానికి ఎన్ని కావ్యాలయినా చాలవు కదా!

**దాదాపు ఆరు దశాబ్దాలుగా తెలంగాణలో చెరువులను శిథిలం చేసి, ప్రాజెక్టులు కట్టకుండా, రైతులు గోస పడుతుంటే కుంభకర్ణ నిద్రను నటించిన పెద్ద మనుషులు ఇప్పుడు కాళేశ్వరం జలాలు పరవళ్ళు తొక్కుతుంటే అభ్యంతరాలు చెబుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తలపెట్టిన ప్రాణహిత చేవెళ్ళ కూడా లిఫ్టులతో కూడుకున్నదనే వాస్తవాన్ని విస్మరిస్తున్నారు. తుమ్మిడిహట్టి నుంచి నీళ్ళు తరలించినా ఎత్తిపోతల తప్పదనే సత్యాన్ని ప్రజలకు చెప్పకుండా అర్ధసత్యాలు వల్లిస్తున్నారు.**

కాళేశ్వరం అనేక ప్రాజెక్టుల సమాహారం. ప్రకృతి రమణీయతను ప్రసాదించే ఆ ప్రాజెక్టులో అద్భుత సాంకేతికత పలుకరిస్తూ ఉంటుంది. ముఖ్యమంత్రి మనోసాగరంలో విరిసిన ఈ అద్భుత భావనను సాకారం చేయడానికి అనేక మంది ఇంజినీర్లు, సాంకేతిక సిబ్బంది, కార్మికులు అహరహం శ్రమించారు. ఈ కృషి ఫలించి నీరు పల్లమెరుగన్న ప్రకృతి సూత్రానికి భిన్నంగా నదీజలాలు మిట్టానికి ప్రవహించాయి. ఈ అసాధారణ ప్రయోగం విజయవంతం కావడం చూసినవారికి, నవజాత శిశువు దరహాసాన్ని చూసిన అనుభూతి కలుగడం సహజం. తొలిసారిగా జూలై 31వ తేదీన మేడిగడ్డ ఎత్తిపోతల ప్రారంభమైంది. కన్నెపల్లి పంప్‌హౌజ్ ద్వారా బయలుదేరిన ప్రాణహిత జలాలు అన్నారం జలాశయంలోకి ప్రవహించాయి. అక్కడినుంచి నడక మళ్ళా మొదలై సుందిల్ల బరాజ్ దగ్గరికి చేరాయి. గోలివాడ పంప్‌హౌజ్ నుంచి ఎత్తిపోయడంతో ఎల్లంపల్లి జలాశయంలోకి పరవళ్ళు తొక్కాయి. దీంతో కాళేశ్వరం ప్రాజెక్టులోని ఒకటవ లింక్ ప్రయోగం ఒక అపూర్వ ఘట్టంగా నిలిచిపోయింది. వందకు పైగా కిలోమీటర్ల జల తాండవంతో తెలంగాణ తల్లి మది పులకరించిపోయింది. ఇక గోదావరి నది దాదాపు 120 కిలోమీటర్ల మేర సజీవంగా ఉంటుందనేది శిలాశాసనం గా భావించవచ్చు. ఇది మన తెలంగాణ రైతు బిడ్డలకు భరోసా. తెల్లారితే బిందె పట్టుకొని నీటి కోసం పోయే కష్టాలు ఇక లేవనే ఆడబిడ్డల ధీమా. గ్రామీణులకు ఇక చెరువులు నిండవనే దిగులు ఉండదు. ఇప్పటికే కాలువల పొడుగునా భూగర్భ జలాలు పెరిగిపోయాయి. మూడు నాలుగేండ్ల కు ఒకసారి వానలు గట్టిగా పడినా కరువు దరికి చేరదు. గుండె గదుల నుంచి రక్తనాళాల ద్వారా దేహమంతా ప్రసరించినట్లు జీవధారయైన జలం బీడు భూములకు ప్రవహించి సస్యశ్యామలం చేస్తుంది.

దాదాపు ఆరు దశాబ్దాలుగా తెలంగాణలో చెరువులను శిథిలం చేసి, ప్రాజెక్టులు కట్టకుండా, రైతులు గోస పడుతుంటే కుంభకర్ణ నిద్రను నటించిన పెద్ద మనుషులు ఇప్పుడు కాళేశ్వరం జలాలు పరవళ్ళు తొక్కుతుంటే అభ్యంతరాలు చెబుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తలపెట్టిన ప్రాణహిత చేవెళ్ళ కూడా లిఫ్టులతో కూడుకున్నదనే వాస్తవాన్ని విస్మరిస్తున్నారు. తుమ్మిడిహట్టి నుంచి నీళ్ళు తరలించినా ఎత్తిపోతల తప్పదనే సత్యాన్ని ప్రజలకు చెప్పకుండా అర్ధసత్యాలు వల్లిస్తున్నారు. చేతనయితే ఉమ్మడి రాష్ట్రంలో ఎత్తిపోతల అవసరం లేకుండా తెలంగాణ ప్రాజెక్టులను కట్టి చూపించాల్సింది! ఎత్తిపోతలకు వ్యయం అవుతుందంటూ నీటిని సముద్రం పాలుచేసి, పంట పొలాలను బీళ్ళుగా వదిలిపెడుతామా? ఎంత విద్యుత్తయినా భరించి రైతన్నలకు నీళ్ళు అందిస్తామన్న ముఖ్యమంత్రి సాహసోపేత సంకల్పాన్ని ప్రశంసించలేక తప్పులు వెదుకడానికి తంటాలు పడుతున్నారు. బోరుబావి నుంచి నీళ్ళు తోడుకోవడం ఎత్తిపోతల కాదా! వ్యక్తిగతస్థాయి నుంచి సమష్టి స్థాయికి ఎదిగిన ఫలితమే ఈ భారీ ఎత్తిపోతల. పరిశ్రమల కోసం కోట్లు ఖర్చు పెట్టి మౌలిక వసతులు కల్పిస్తే మాట్లాడనివారు, ప్రాణాధారమైన వ్యవసాయానికి తోడ్పాటునిస్తే అభ్యంతరాలు చెప్పడం ఇటీవల పెరిగిపోయిన వింత పోకడ. భవిష్యత్తులో నీటికి తీవ్ర కొరత ఏర్పడుతుందనేది ప్రపంచవ్యాప్తంగా విజ్ఞులు చేస్తున్న హెచ్చరిక. మన నీటిని మనం వినియోగించుకోవడం ద్వారానే మన హక్కులను కాపాడుకోగలుగుతాం. ఎత్తిపోతల అవసరాలు తీర్చడానికి విద్యుత్ కేంద్రాల ఏర్పాటు కూడా జోరుగా సాగుతున్నది. కాళేశ్వరం ద్వారా గోదావరిని పునరుజ్జీవింపజేసుకోవడం తెలంగాణ ప్రజలు గర్వించదగిన మహా యజ్ఞం.

**జనగళం**

## సంయమనం అవసరం

ఆందోళనల సమయంలో పోలీసులు ఎంతో ఓపికతో వ్యవహరించాలి. ఆందోళన కార్యక్రమాల్లో ఆయా వర్గాలు తమవైన డిమాండ్లతో చేసేటప్పుడు ఒక విధమైన ఆగ్రహావేశాలతో ఉంటారు. అలాంటి వారితో వ్యవహరించేటప్పుడు పోలీసులు నేర్పుతో, ఓపికతో వ్యవహరించాలి. ముఖ్యంగా మహిళలు ఆందోళనా కార్యక్రమాల్లో ఉన్నప్పుడు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. లేకుంటే ఈ మధ్య వైద్య విద్యార్థుల విషయంలో జరిగిన పొరపాటు జరుగటానికి అవకాశం ఉంటుంది. మహిళా ఆందోళనకారుల విషయంలో మహిళా పోలీసులనే వినియోగిస్తే మంచిది. ఏ మాత్రం మితిమీరినా ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు అర్థమే ఉండదు. ఇదొక గుణపాఠంగా తీసుకొని పోలీస్ వ్యవస్థ నడుచుకోవాలె.

**- విష్ణు, హయత్‌నగర్, హైదరాబాద్**

## అప్రమత్తత అవసరం

రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసుర్లతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నది. మరోవైపు అన్ని దవాఖానల్లో జూనియర్ వైద్యులు నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు వ్యతిరేకంగా సమ్మె చేస్తున్న తీరు ఆందోళన కలిగిస్తున్నది. కాబట్టి జ్వరాలతో దవాఖానలకు వచ్చే రోగులకు సత్వర వైద్యం అందేట్లు చర్యలు తీసుకోవాలె. వైద్య సిబ్బంది అంతా అప్రమత్తంగా ఉంటే మంచిది.

**- బేగరి ప్రవీణ్‌కుమార్, అంతారం, చేవెళ్ల, రంగారెడ్డి జిల్లా**

## మొక్కలు నాటాలె

రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పల్లె మొదలు పట్టణం దాకా అంతటా ఇదే అదనుగా మొక్కలు నాటడం పెద్ద కార్యక్రమంగా చేపట్టాలె. ప్రభుత్వం ఇచ్చిన పిలుపులో భాగంగా ఎప్పుడో చేపట్టే బదులు ఇప్పుడు కురుస్తున్న వానలను మొక్కలు నాటడానికి అనువైన పరిస్థితిగా వినియోగించుకోవాలె. రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలె. మొక్కలు నాటేటప్పుడు సంప్రదాయ వృక్షాలైన వేప,రావి, మర్రి చెట్లతో పాటు పల్లె కు పచ్చదనాన్ని ఇచ్చే కానుగ, పండ్ల చెట్లను కూడా నాటాలె.

**- ఎర్ర సైదులు, వలిగొండ, భువనగిరి యాదాద్రి జిల్లా**


**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118


ముక్తసరి



**దేవులపల్లి ప్రభాకరరావు**

# దేశానికి దిక్సూచి తెలంగాణ

మోదీజీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తలాక్ చట్టం వల్ల ముస్లిం స్త్రీలకు న్యాయం జరిగితే సంతోషించని వారుండరు. ముస్లిం స్త్రీల సమాన హక్కుల కోసం ఆరాటపడుతున్న మోదీజీ, ఆయన అనుయాయులు శబరిమల దేవాలయంలో, దేశంలోని ఇతర దేవాలయాల్లో హిందూ స్త్రీలకు సమాన హక్కులుండాలని ఎందుకు కోరడం లేదు?

నాడు, నేడు అనేక విషయాల్లో దేశానికి దీపస్తంభం తెలంగాణం. ఇది తెలంగాణ ప్రత్యేకత. ఆంగ్లేయ పాలన అంతమై దేశం స్వాతంత్ర్యం పొందిన రోజున భరతఖండంలో ఒక ముఖ్య భాగమైన, దక్కన్ పీఠభూమికి తలమానికమైన తెలంగాణ ప్రజలు రాచరిక వ్యవస్థలో దుర్భరమైన కష్టాలను అనుభవిస్తూ తమ భవిష్యత్తు అంధకార బంధురమవుతుందేమోనని ఆందోళనకు గురైనారు. అంత కష్ట కాలంలో సైతం తెలంగాణ ప్రజలు ఆత్మవిశ్వాసాన్ని, పోరాట పటిమను కోల్పోలేదు. ఇది తెలంగాణ ప్రజల విశిష్టత "...Never lose faith in your self , you can do anything in this universe. Never weaken, all power is yours..." వివేకానంద వాణిలో నినదించిన ఈ మాటలు తెలంగాణ ప్రజలకు అక్షరాల వర్తిస్తాయి. తెలంగాణ ప్రజలు బానిసత్వపు సంకెళ్లను బద్దలుచేసే దృఢ సంకల్పంతో సాయుధ పోరాటం నడిపారు; గాంధేయమార్గంలో శాంతియుత సమరం నిర్వహించారు. తెలంగాణ ప్రజల పోరాటాలు, ప్రజా ఉద్యమాలు ప్రపంచ ప్రసిద్ధి పొందాయి; ఒకవంక గాంధేయ మార్గంలో పయనిస్తూ తెలంగాణ ఆధునిక సామ్యవాద, మార్క్సిస్టు భావాలకు తన మస్తిష్క ద్వారాలను తెరచిపెట్టింది. మొదట రెండు వందల ఏండ్ల, తర్వాత అరువై ఏండల అణిచివేత, దోపిడి నుంచి బయటపడి తన భౌతిక, భౌగోళిక, ప్రాదేశిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి, స్వరాష్ట్రం సాధించుకొని, స్వపరిపాలనతో సర్వతోముఖాభివృద్ధి సాధించడానికి తెలంగాణ ప్రజలు నిర్వహించిన ఉద్యమా లు, కొనసాగిస్తున్న కృషి నిరుపమానమైనవి, సకల భారతావనికి మార్గదర్శకమైనవి–దిక్సూచి వంటివి.

అసహనం, విద్వేషం, వివక్షత బాధలు తెలిసిన తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ నాయకత్వంతో, పరిపాలనాదక్షతతో అసహనాన్ని త్యజించి మానవతా దృక్పథంతో ప్రజాస్వామ్య పరిణతికి బాటలు వేసింది; అరువై ఏండ్ల పరాయి పెత్తనంలో, దోపిడిలో తన వనరులు పరుల పాలవుతుంటే కుంగి కృషించిన తెలంగాణ ప్రజలు తమ రాష్ట్రంలో తమ వనరుల గరిష్ఠ వినియోగానికి జరుగుతున్న అపూర్వ కృషిని, అద్భుత ఫలితాలను స్వయంగా వీక్షించగలుగుతున్నారు. రాష్ట్ర సాధనలో, రాష్ట్ర ప్రగతిలో దేశానికి, వివిధ రాష్ట్రా ల్లో, అనేక ప్రాంతాల్లో అన్యాయాలకు, అక్రమాలకు గురవుతున్న బాధిత, పీడిత ప్రజలకు తెలంగాణ రాష్ట్రం ఐదేండ్ల అతి స్వల్పకాలంలోనే ఒక దీపశిఖరం వలె నిలిచి సరైన దారి చూపించే సమున్నత స్థాయికి రావడం గర్వకారణం.

కోట్లాది దీనుల, పరాధీనుల జీవన ప్రమాణాలు మెరుగుపడటానికి పలు సంక్షేమ కార్యక్రమాలను, అభివృ ద్ధి పథకాలను చేపట్టిన తెలంగాణ రాష్ట్రం దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు, రాజ్యాంగ భద్రతకు, రాజ్యాంగబద్ధ పాలన కు నడుం బిగించవలసిన ప్రమాదకర పరిస్థితులు కారుమబ్బులవలె కమ్ముకుంటున్నాయి. స్థాలీపులాక న్యాయంగా, కేగత రెండు నెలల్లోనే (మోదీజీ పాలన, రెండవ అంకం ప్రారంభమైన తర్వాత) రానున్న నాలుగున్నరేండ్ల పాలన రంగు, రుచి దేశ ప్రజలకు విదితమైనాయి. జ్యోతిష్యం చెప్పడం కాదుగాని త్వరలోనే ఈ దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, ఫెడరల్ వ్యవస్థ కోసం కంచు కాగడాలు పట్టి వెతుక వలసి వస్తుందని లేక అమెరికాలోని పురాతన వస్తు ప్రదర్శనశాలల్లో అన్వేషించవలసి వస్తుందని ఆందోళన చెందుతున్నవారున్నారు. 'ఒకే దేశం, ఒకే పార్టీ, ఒకే ఒక్క నేత' నినాదం పడగకింద ఈ దేశంలోని ఫెడరల్ వ్యవస్థ హరప్ప–మొహంజదారో శిథిలాల్లో భాగమవుతుందని రాత్రింబవళ్లు చెమటపట్టి భయపడుతున్న వాళ్లున్నారు.

'ఆగె ఆగె దేఖియే హోతాహై క్యా' అని ఉర్దూలో అంటారు. ఈ మధ్య, దేశ వ్యవహారాల శాఖ అమాత్యుడిగా నియమితుడైన పిదప అమిత్ షాజీ కశ్మీర్ వెళ్లివచ్చారు. అక్కడి శాంతి భద్రతల పరిస్థితి సంతృప్తికరంగా ఉందని ఢిల్లీవచ్చి ప్రకటించారు. 'బుల్లెట్లు, బాంబుల కంటే ముఖ్యం కశ్మీరు అభివృద్ధి' అని ప్రధాని మోదీజీ అన్నారు. 'ప్రపంచంలో ఏ శక్తీ కశ్మీర్‌ను భారతదేశం నుంచి విడగొట్టలేదు' అని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌జీ అన్నారు. 'మళ్లీ పిచ్చి వేషాలు వేస్తే మక్కెలు విరగ్గొడతాం, తాటతీస్తాం' అని సైన్యాధిపతి బిపిన్‌చంద్ర రావత్ పాకిస్తాన్‌ను హెచ్చరించారు. మాజీ రక్షణమంత్రి అమ్మాజీ మాత్రం రెండు మాసాల మోదీజీ రెండవ అంకంలో కనీవినీ ఎరుగని అభివృద్ధి జరిగిందని చూపే లెక్కలు వండటంలో బిజీగా ఉండి పాకిస్తాన్‌ను హెచ్చరించలేకపోయారు. కశ్మీర్ లో శాంతిభద్రతల పరిస్థితి చక్కగా ఉందని అమిత్ షాజీ ఢిల్లీలో, జమ్మూకశ్మీర్ గవర్నర్ శ్రీనగర్‌లో ప్రకటించిన వెంటనే రెండురోజుల్లో కశ్మీరుకు పదివేల మంది సీఆర్‌పీఎఫ్ దళాలను విమానాల్లో హుటాహుటిన ఎందుకు పంపించారో ఎవరి కీ అంతుపట్టడం లేదు. ఇప్పటికే కశ్మీర్ లోయలో లక్షా ఇరువై వేల సాయుధ బలగాలున్నాయని అంచనా. స్థానిక పోలీసు బలగాలకు, మొన్నటి పది వేల మందికి అదనంగా. ఇటీవలి లెక్కల ప్రకా రం కశ్మీర్ జనాభా ఒక కోటి గూడ కాదు, 69 లక్షలే. సాయుధ బలగాల అండతో, ఇన్‌కమ్‌టాక్స్, ఎన్‌ఫోర్స్ డిపార్ట్‌మెంట్, సీబీఐ దాడులతో జమ్మూకశ్మీరులో ప్రజాస్వామ్యం ఇంకా బతికే ఉందని, పౌరహక్కులకు కొదువ లేదని ప్రపంచానికి చాటిచెప్పి నోరుమూయడానికి జమ్మూకశ్మీరు శాసనసభ ఎన్నికలు నిర్వహిస్తారని రాజకీయ కోవిదులు అంటున్నారు. అమిత్‌షాజీ తీరిక చేసుకొని (దేశ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో కొల్లలు కొల్లలుగా పాత, కొత్త ఫైళ్లు ఉంటాయి. గాంధీజీ హత్య, నేతాజీ అంతర్ధానం, అన్ని పార్టీల, అనేక నాయకుల చిట్టాలు, బ్రిటిష్ జమానాలో కొందరు ఇక్కడి పెద్దలు రాసిచ్చిన క్షమార్పణ పత్రాలు, అవినీతి కుంభకోణాలు వగైరా వగైరా 72 ఏండ్ల ఫైళ్లలో నుంచి పనికివచ్చే వాటిని వెతికితీయడం, ప్రత్యర్థులను లొంగదీయడం ఆషామాషీ కాదు. కేంద్రంలో ఫ్రంట్ ప్రభుత్వాలు పాలించినప్పుడు సీపీఐకి చెందిన కామ్రేడ్ ఇంద్రజిత్ గుప్తా దేశ వ్యవహారాల మంత్రి. కానీ ఆయన పాత వ్యవహారాలను వెలికితీయలేదు, ప్రమాదకరం కాలేదు). ఉత్తరప్రదేశ్ కూడా వెళ్లారు. యూపీ ముఖ్యమంత్రి గురుస్వామి, గోరఖ్‌పూర్ పీఠాధిపతి యోగి ఆదిత్యనాథ్. యోగీజీ పాలన చాలా బాగుందని, శాంతిభద్రతల పరిస్థితి చాలా చాలా బాగుందని, ఇంతకుముందటి అఖిలేష్ యాదవ్ పాలనకు యోగీజీ పాలనకు మధ్య 'జమీన్ ఆస్మాన్ ఫరఖ్‌హై' అని అమిత్‌షాజీ ఒక సర్టిఫికెట్ ఇచ్చారు. యోగీజీ ప్రభుత్వంలోని ఒక మంత్రి దగ్గరి బంధువు ఎమ్మెల్యే కుల్‌దీప్ సింగ్ సెంగార్ కొన్నాళ్ల కిందట ఉన్నావ్‌లో ఒక యువతి మానాన్ని హరించిన పిదప, ఆమె తండ్రి పోలీ స్స్టేషన్‌లో మరణించిన తర్వాత, వారం రోజుల కిందట ఆమెను, ఆమె న్యాయవాదిని, సన్నిహిత బంధువులను (కారులో ప్రయాణిస్తుండగా) చంపడానికి ప్రయత్నించిన అనంతరం అమిత్ జీ ఈ సర్టిఫికెట్ ఇవ్వడం విచిత్రం.

**స్త్రీలకు-జనాభాలో సగం మందికి చట్టసభల్లో సమాన హక్కు కాకపోయినా, కనీసం మూడో వంతు ప్రాతినిధ్యం కల్పించే బిల్లును (ఇరువై ఏండ్ల నుంచి మూలుగుతున్న బిల్లు) ఆమోదింపజేయడానికి మోదీయులు ఎందుకు శ్రద్ధ చూపడం లేదు?**

మోదీ–షా రెండవ అంకంలో రెండు నెలలైనా కాకముందే పార్లమెంట్ ఉభయసభలు దాదాపు ఇరువై రాజ్యాంగ సవరణలకు, తలాక్ బిల్లుకు ఆమోదముద్ర వేశాయి. మొదటి అంకంలో ఆర్డినెన్సుల మీద ఆధారపడ్డ మోదీజీ ప్రభుత్వానికి ఇప్పుడు ఈ రెండవ అంకంలో రాజ్యాంగ సవరణల మజా దొరికింది. ఇదే స్పీడుతో మోదీజీ ప్రభుత్వం రాజ్యాంగ సవరణలు జరుపుతూ పోతే అంబేద్కర్ మహాశయుడు తాను ఆవిష్కరించిన స్వతంత్ర భారత రాజ్యాంగం ఎక్కడికి పోయిందని, ఎవరు అపహరించారని దిగులుపడవలసి వస్తుందని ఒక పరిశీలకుడు అన్నాడు. పార్లమెంట్‌లో తలాక్ బిల్లుకు ఆమోదముద్ర పడటం చరిత్రాత్మక సంఘటన అంటున్నారు. మోదీజీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తలాక్ చట్టం వల్ల ముస్లిం స్త్రీలకు న్యాయం జరిగితే సంతోషించని వారుండరు. ముస్లిం స్త్రీల సమాన హక్కుల కోసం ఆరాటపడుతున్న మోదీజీ, ఆయన అనుయాయులు శబరిమల దేవాలయంలో, దేశంలో ని ఇతర దేవాలయాల్లో హిందూ స్త్రీలకు సమాన హక్కులుండాలని ఎందుకు కోరడం లేదు? స్త్రీలకు–జనాభాలో సగం మందికి చట్టసభల్లో సమాన హక్కు కాకపోయినా, కనీసం మూడో వంతు ప్రాతినిధ్యం కల్పించే బిల్లును (ఇరువై ఏండ్ల నుంచి మూలుగుతున్న బిల్లు) ఆమోదింపజేయడానికి మోదీయులు ఎందుకు శ్రద్ధ చూపడం లేదు? మోదీజీ నినాదాల్లో ఒకటి 'సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్'. కర్ణాటకలో బీజేపీ ఇటీవలి ప్రభుత్వం ఏర్పడగానే కొన్ని గంటల్లోనే, మంత్రివర్గమైనా ఏర్పాటుకాకముందే, టిప్పు సుల్తాన్ జయంతి కార్యక్రమాన్ని రద్దుచేయడం ఈ నినాదం డొల్లతనాన్ని నిరూపించడం లేదా?

# కాళేశ్వరంపై కాకిలెక్కలు చెల్లవు

ప్రాజెక్టు



**డాక్టర్ నాగేందర్ మాధవరం**

కాళేశ్వరం ప్రాజెక్టును తులనాత్మకంగా విశ్లేషించేవారు తెలంగాణ భౌగోళిక, సామాజిక, ఆర్థిక పరిస్థితులను, ప్రపంచ పర్యావరణలో వస్తున్న మార్పులను పరిగణనలోకి తీసుకోవాలి. గత కాలంలో జీవిస్తూ, సంప్రదాయక నదీప్రవాహక నీటి పారుదల పద్ధతులను ఈ ప్రాజెక్టుకు అన్వయించడం సరైన విధానం కాదు. తరిగిపోతున్న నీటి వనరులు, వర్షాభావంతో భారమౌతున్న వ్యవసాయం, తడారిపోతున్న గ్రామాలను గమనిస్తే కాళేశ్వరం ప్రాజెక్టు కంటే మెరుగైన ప్రత్యామ్నాయం కనిపించడంలేదు. జాతి మనుగడకు, ప్రగతికి నీరు ప్రధానం. ఏడు దశాబ్దాలుగా ప్రభుత్వాలు తెలంగాణ ప్రాజెక్టుల పట్ల సమన్యాయం పాటించి ఉంటే ఇప్పుడు ఈ చర్చకు ఆస్కారం ఉండేది కాదు. కృష్ణానదిలో నీరులేదు, గోదావరిని మళ్ళించొద్దంటారు. విమర్శనే వృత్తిగా చేసుకొని ప్రజల్లో గందరగోళం చేయడానికి ప్రయత్నించే వారికి వాస్తవాల అవసరం లేదు. వివిధ ప్రాంతాలు నీటి అవసరాలు తీర్చుకోవడానికి అనేక పద్ధతులు అవలంబిస్తుంటాయి. కొత్త పద్ధతిని అనుసరించిన ప్రతిసారీ విమర్శలు వస్తాయి.

లిబియాలో వర్షపాతం తక్కువ. తాగునీరు లేదు. పెట్రోలియం గనుల కింది 500 మీటర్ల అడుగున వేల ఏండ్ల కిందట ఘనీభవించిన నీటిని బయటకుతీసి మంచినీటి సౌకర్యం కల్పించాలని గఢాఫీ ప్రయత్నిస్తే కుహనా మేధావులందరు మతితప్పిన నియంత సాధ్యం కాని ప్రాజెక్టును ప్రారంభించాడనీ, దేశాన్ని దివాలా తీయిస్తాడని ప్రచారం చేశారు. 1984 లో ప్రాజెక్టును ప్రారంభించి ప్రపంచంలోనే మొదటగా భూగర్భ జలాలను తోడి కృత్రిమ నదిని సృష్టించి, వేల హెక్టార్లలో గోధుమలు, భారీ కూరగాయలను పండించాడు. సముద్రపు నీటిని మంచినీటిగా మారే పద్ధతికి స్వస్తిచెప్పి 90 శాతం ఖర్చును తగ్గించారు. లిబియా ఆర్థిక వ్యవస్థకు భూగర్భ నీటి ప్రాజెక్టు కీలకంగా మారి జీవన ప్రమాణాలను పెంచింది. చైనా కూడా దక్షిణాదిన ఉన్న యాట్జ్ నది నుంచి 1,432 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకు 1,582 టీఎంసీల నీటిని తరలిస్తున్నది. నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల కన్నా 3 రెట్లు అధికమైన నీరు కొండల కింది నుంచి, నదుల కింది నుంచి ప్రవహిస్తుంది. 3,38,000 మంది నిర్వాసితులైనారు. వ్యయానికి వెనుకాడకుండా ఉత్తరాది రాష్ట్రాల మనుగడకు చైనా సముద్రాన్నే కదిలించింది.

జాతి అస్తిత్వాన్ని నిలబెట్టే యత్నాలకు సంప్రదాయ పెట్టుబడి ఆదాయ సిద్ధాంతాన్ని అన్వయించడమే అసంబద్ధం. బంజారా గర్భిణీ చంకలో పిల్లను ఎత్తుకొని, నెత్తిపై మూడు బిందెలు పెట్టుకొని మండుటెండలో కిలోమీటర్ల దూరం వెళ్లి తీసుకొచ్చే నీటికి, పదుల సంఖ్యలో బోర్లు వేసి అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకున్న రైతుల జీవితాలకు, ఫ్లోరైడ్ బారినపడి యవ్వనంలోనే వృద్ధాప్యానికి గురైన విధి వంచితుల జీవితాలకు విలువకట్టే మూల్యాంకన సిద్ధాంతాలు ఇంతవరకు రూపొందలేదు. బాధ్యతాయుత ప్రభుత్వాలు మాత్రమే పరిష్కారాలను సాధిస్తాయి.

పర్యావరణ మార్పు తెలంగాణకు భవిష్యత్తులో పెను సవాళ్లు విసరబోతున్నది. మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రకారం భారత్ అత్యంత వేడి ప్రదేశంగా మారబోతున్నది. చోటా నాగపూర్ ప్రాంతం, ఈశాన్యంలోని కొన్ని ప్రాంతాలు నివాసయోగ్యం కాకుండా మారుతాయి. తేమ, వేడిని ఆధారంగా కొలిచే వెట్ బల్బ్ టెంపరేచర్ పద్ధతి ప్రకారం 35 డిగ్రీల సెల్షియస్‌లో మానవులు బతుకలేరు. భారత్ సగటున 26.4 డిగ్రీలకు చేరుకున్నది. జూన్‌లో ఢిల్లీలో సాధారణ వేడి 48 డిగ్రీలు, రాజస్థాన్ లో 50.6 డిగ్రీలు ఉంటే, బీహార్‌లో 100 మంది మరణించడంతో ఆ రాష్ట్రంలో 6 రోజులు ఎమర్జెన్సీ ప్రకటించారు. వ్యవసాయిక దేశంలో 6 రోజులు బయటకు వెళ్లకపోతే జంతువుల సంరక్షణ కష్టం. అనేకరంగాల పై ఈ ప్రభావం ఉంటుంది. చెన్నైలో నీరు లేక 360 కిలో మీటర్ల దూరంలో ఉన్న జొలార్‌పెట్టాయి జలాశయం నుంచి రైలుద్వారా నీటిని తెస్తున్నారు. రైల్వేస్టేషన్ నుంచి ప్రతి ఇంటికి నీటిని చేరవేసే వ్యవస్థ లేదు. నీటి రవాణా ట్రక్కులకు అయ్యే వ్యయం దారిలో వృథా అయ్యే నీటిని లెక్కిస్తే అత్యంత వ్యయం, అసౌకర్యమని తెలుస్తుంది. దూరదృష్టితో వ్యవహరిస్తే ఈ తిప్పలు తప్పేవి. కంచిలో నీటి కొరత వల్ల బట్టలు కొనడానికి వచ్చేవారు తగ్గడం వల్ల హోటళ్లు దెబ్బతిన్నాయి. సరైన చర్యలు తీసుకోకపోతే హైద్రాబాద్‌లో కూడా ఈ పరిస్థితులే వస్తాయి.

**రాష్ట్రం సముద్ర మట్టానికి 300 మీటర్ల ఎత్తులో ఉన్నందున వ్యవసాయానికి కాల్వల ద్వారా నీరందదనీ, బోర్లు వేసుకొని భూగర్భంలో కలిసిపొమ్మని దశాబ్దాలుగా ఈ ప్రాంతంపై మైండ్ గేమ్ ఆడినవారికి కేసీఆర్ ఇచ్చే సమాధానమే కాళేశ్వరం ప్రాజెక్టు.**

తెలంగాణ విధ్వంసకారులు ఇంకా అడ్డుపుల్లలు వేయ యత్నిస్తున్నారు. తెలంగాణ రాదన్నారు, వచ్చినా కరెంట్ కోతతో రాష్ట్రం విఫలమవుతుందని కలలుగన్నారు. సంక్షేమ పథకాలు రాష్ట్రాన్ని దివాలా తీయిస్తాయని గగ్గోలుపెట్టారు. అవి జరుగకపోయేసరికి నిరాశ నుంచి ఉపశమనం పొందడానికి కాళేశ్వరంపై విషం చిమ్ముతున్నారు. తెలంగాణ ప్రజల పట్ల ఏ మాత్రం పట్టింపు లేనివారు, అవకాశం దొరికినప్పుడు ఈ ప్రాంతానికి నిస్సిగ్గుగా ద్రోహం చేసే వారు నీటి నిపుణులుగా కొత్త అవతారమెత్తి కాళేశ్వరం ప్రాజెక్టు పట్ల హేయమైన ప్రచారానికి ఒడిగడుతున్నారు. మాజీ ఐఏఎస్ అధికారి జయప్రకాశ్ నారాయణ్ బట్టకాల్చి మీదేసి కాలకుండ నిజాయితీ నిరూపించుకోమని పరిహసిస్తున్నాడు. ప్రకాశం జిల్లాలో కలెక్టర్‌గా అద్భుతమైన సేవ చేశాను, రాష్ట్రంలో అలాంటి పాలనే తెస్తాను అందుకే లోక్‌సత్తా పార్టీని గెలిపించండని 2009లో ప్రచారం చేశాడు. అమాయక తెలంగాణ ప్రజలు ఆయనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే, ప్రకాశం జిల్లా ప్రజలు 12 అసెంబ్లీ స్థానాల్లో డిపాజిట్ పోగొట్టి ఆ పార్టీకి 14,844 ఓట్లు మాత్రమే వేశారు. ప్రకాశంలో కన్పించని సేవ గురించే ఇంతకాలం మార్కెటింగ్ చేసుకుంటున్నాడు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతమైన మహబూబ్ నగర్, నల్లగొండ జిల్లాలను కాదని శ్రీశైలం ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా చెన్నైకి నీరు తీసుకొనిపోయినప్పుడు ఎవడి సొమ్ము ఖర్చుచేశారు? తెలంగాణ ప్రజాభిప్రాయాన్ని తీసుకున్నారా? ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరంపై గోల పెడ్తున్నాడు. కరెంట్‌ను 200 రోజులు వాడటం వల్ల ఎకరాకు రూ. 50 వేల ఖర్చు వస్తున్నదని కాకి లెక్కలు చెప్తున్నాడు. అమరావతిని అడ్డంగా సింగపూర్‌కు అమ్ముకున్న వ్యక్తి తెలంగాణ బందర్ పోర్టును ఆక్రమించుకుంటుందని ప్రచారం చేస్తుంటే ఈ తెలంగాణ శ్రేయోభిలాషి ఒక్క మాట మాట్లాడడు.

13 జిల్లాల్లో 20 రిజర్వాయర్‌లలో 145 టీఎంసీల నీటిని నిల్వచేసే కాళేశ్వరం తెలంగాణ వరప్రదాయిని. 1,832 కిలో మీటర్లు విస్తరించిన కాలువల ద్వారా ప్రవహించే నీరు తెలంగాణ అవసరాలను అన్ని కాలాలలో తీరుస్తుంది. రాష్ట్రం సముద్ర మట్టానికి 300 మీటర్ల ఎత్తులో ఉన్నందున వ్యవసాయానికి కాల్వల ద్వారా నీరందదనీ, బోర్లు వేసుకొని భూ గర్భంలో కలిసిపొమ్మని దశాబ్దాలుగా ఈ ప్రాంతంపై మైండ్ గేమ్ ఆడినవారికి కేసీఆర్ ఇచ్చే సమాధానమే కాళేశ్వరం ప్రాజెక్టు. పరిశ్రమలకు 16 టీఎంసీల, హైద్రాబాద్‌కు 30 టీఎంసీ, గ్రామీణ నీటి అవసరాలకు 10 టీఎంసీల నికర జలాలను కేటాయించడం ద్వారా ఆర్థిక, నిత్యావసరాలకు భద్రత లభించింది. ప్రాజెక్టు ప్రయోజనం గురించి లెక్కలు వేసేవారు రక్షి త మంచినీటి ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, నీటిని తెచ్చే స్త్రీల పనిగంటలను ఉత్పాదకతవైపు మళ్ళించడం, పరిశ్రమలకు నిరంతర నీటి సరఫరా, చేపలు, పశువులు, గొర్రెలు, వ్యవసాయాధారిత రంగాలు అభివృద్ధి చెందడం ద్వారా కలిగే ప్రయోజనాలను లెక్కించాలి. నీళ్ల తేవడం నుంచి విముక్తి పొందిన స్త్రీల ఆత్మగౌరవాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. రాష్ట్రంలో హరితహారానికి ఈ నీరు ప్రధాన భూమిక పోషిస్తుంది. 500 కి.మీ. విస్తరించిన ప్రధాన కాలువలపై ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చు. కరెంట్‌పై రైతులకు ఇస్తున్న సుమారు రూ.6 వేల కోట్లు సబ్సిడీ తగ్గిపోతుంది. చేపల పెంపకమేగాక భూగర్భ నీటి మట్టం కూడా పెరుగుతుంది. కాళేశ్వరం మెట్ట ప్రాంతాల సాగుకు మోడల్ ప్రాజెక్టుగా పాఠ్యపుస్తకాల్లో ఉండబోతున్నది. గోదావరి పరుగులు తెలంగాణ ఆర్థిక, సామాజిక, పర్యావరణ పరిస్థితులను గణనీయంగా మార్చబోతున్నాయి. ఎవ్వరెన్ని శాపనార్థాలు పెట్టినా ప్రతి నీటి బిందువులో కేసీఆర్ కన్పిస్తున్నారు.

**(వ్యాసకర్త: రాజకీయ విశ్లేషకులు, వాషింగ్టన్ డి.సి.)**


Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy**. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

### జమ్ముకశ్మీర్‌లో
# ఏం జరుగబోతున్నది?

వారంలోనే 38 వేల మంది జవాన్లను పంపిన కేంద్రం



కీలక పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయంటూ స్పష్టమైన సంకేతాలు

ఆర్టికల్స్ 35-ఏ, 370 ఎత్తివేతతోపాటు పలు అంశాలు తెరపైకి..

**న్యూఢిల్లీ:** కేంద్రం జమ్ముకశ్మీర్‌లో భద్రతాబలగాలను భారీ స్థాయిలో మోహరిస్తున్నది. వారం వ్యవధిలోనే దాదాపు 38 వేల మంది జవాన్లను కశ్మీర్‌కు తరలించింది. శ్రీనగర్‌తోపాటు లోయవ్యాప్తంగా బలగాలను మోహరించింది. అనేక ప్రాంతాలను బలగాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. దీంతో రాష్ట్రంలో ఏదో జరుగబోతున్నదనే స్పష్టమైన సంకేతాలను కేంద్రం ఇచ్చింది. పైకి మాత్రం 'భద్రత'ను కారణంగా చెప్తున్నా.. పలు అంశాలు తెరమీదికి వస్తున్నాయి. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హక్కులు, స్వయం ప్రతిపత్తిని అందించే ఆర్టికల్ 35-ఏ, 370లకు సంబంధించి కేంద్రం కఠిన నిర్ణయం తీసుకోబోతున్నదని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. తదనంతర పరిణామాలను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యల్లో భాగంగానే భద్రతా బలగాలను మోహరిస్తున్నారని భావిస్తున్నారు. దేశవ్యాప్తంగా ప్రజలు ఇప్పుడు కశ్మీర్‌లో ఏం జరుగబోతున్నదోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

**వారంలో 38 వేల మంది..**

ఇప్పటికే రాష్ట్రంలో 65 బెటాలియన్ల సీఆర్పీఎఫ్ జవాన్లు విధుల్లో ఉన్నారు. అమర్‌నాథ్‌యాత్ర నేపథ్యంలో మరో 20 బెటాలియన్ల జవాన్లను మోహరించారు. తాజాగా కేంద్రం వారం వ్యవధిలోనే అదనంగా 38 వేల మంది జవాన్లను పంపించింది.




### ఆర్టికల్స్ 35ఏ, 370 రద్దు చేస్తారా?

'ఆర్టికల్స్ 35ఏ, 370ని రద్దుచేయబోతున్నారా?' అదనపు బలగాలను తరలించగానే ప్రతి ఒక్కరిలో మెదిలిన ప్రశ్న ఇది. ఈ అంశాన్ని బీజేపీ తన 2014, 2019 సార్వత్రిక ఎన్నికల మ్యానిఫెస్టోలో సైతం పొందుపరిచింది. దీనికితోడు పీడీపీ అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ ఇటీవల మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిపత్తిని కాపాడుకోవడానికి ఉద్యమించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

### మంచుకొండల్లో జెండావందనం?



ప్రధాని మోదీ ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఢిల్లీలోని ఎర్రకోటకు బదులు జమ్ముకశ్మీర్‌లో జెండా ఎగురవేస్తారనే ప్రచారం కూడా ఉన్నది. ఇప్పటికే మోదీ ప్రభుత్వం పలు సంప్రదాయాలను మార్చింది. కేంద్ర బడ్జెట్‌ను మార్చి 31కి బదులు ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టడం, రైల్వే బడ్జెట్‌ను కేంద్ర బడ్జెట్‌లో విలీనం చేయడం వంటి నిర్ణయాలు తీసుకుంది. ఇప్పుడు 'ఎర్రకోట' సంప్రదాయానికి స్వస్తిపలికి మంచుకొండల్లో జెండా ఎగురవేసే అవకాశముందని విశ్లేషకులు చెప్తున్నారు.

**అసెంబ్లీ ఎన్నికలు?**

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించబోతున్నారని, అందుకే అదనపు బలగాలను మోహరించారని జమ్ముకశ్మీర్ బీజేపీ నేతలు చెప్తున్నారు. రాష్ట్రంలో 9 నెలలుగా రాష్ట్రపతి పాలన కొనసాగుతున్నది.

**శరణార్థులకు ఓటుహక్కు?**

పశ్చిమ పాక్ నుంచి వచ్చిన శరణార్థులకు ఓటుహక్కు కల్పించాలనే డిమాండ్ ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్నది. వారికి ఓటుహక్కు కల్పించాలని కేంద్రం నిర్ణయించిందని వార్తలు వినిపిస్తున్నాయి.

### స్వగ్రామాలకు కశ్మీరీ పండిట్లు?

ఉగ్రదాడుల నేపథ్యంలో కశ్మీర్ లోయ నుంచి వలస వెళ్లిన కశ్మీరీ పండిట్లను తిరిగి సొంత ప్రాంతాలకు రప్పించేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదనే వాదన కూడా ఉన్నది. ఇందులో భాగంగానే బలగాలను మోహరించారని భావిస్తున్నారు.

**ఏదేమైనా మోదీ ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు పూర్తయిన తర్వాతే కశ్మీర్ అంశంపై చర్యలు తీసుకుంటుందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఆగస్టు 7వ తేదీ తర్వాత ఏదైనా ప్రకటన రావొచ్చని, లేదా ఆర్డినెన్స్‌ను విడుదల చేయొచ్చని అంచనా వేస్తున్నారు.**

### యూజీసీ ప్రఖ్యాత విద్యా సంస్థగా సెంట్రల్ వర్సిటీ

ఢిల్లీ వర్సిటీ, ఐఐటీ మద్రాస్, ఐఐటీ ఖరగ్‌పూర్‌లకు కూడా హోదా

**న్యూఢిల్లీ:** హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం, ఢిల్లీ విశ్వవిద్యాలయం, బెనారస్ హిందూ యూనివర్సిటీలతోపాటు ఐఐటీ మద్రాస్, ఐఐటీ ఖరగ్‌పూర్‌లకు ప్రఖ్యాత విద్యా సంస్థ (ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్- ఐవోఈ) హోదా కల్పించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ప్రభుత్వానికి సిఫారసు చేసింది. సాధికార నిపుణుల కమిటీ (ఈఈసీ) ఇచ్చిన నివేదికపై సమావేశమైన యూజీసీ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్సిటీ, చెన్నైలోని అన్నా విశ్వవిద్యాలయంలకు 'ఐవోఈ' హోదా కల్పించే విషయమై సంబంధిత రాష్ట్రప్రభుత్వాలు 50 శాతం వాటా నిధులు కేటాయించేందుకు సిద్ధమైన తర్వాతే తుది ప్రకటన చేస్తామని యూజీసీ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

### ఈ నెల 12 - సెప్టెంబర్ 30 వరకు ముందస్తు జనగణన

**న్యూఢిల్లీ:** రెండేండ్ల తర్వాత 2021లో జరుగబోయే జనగణనకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. దేశ వ్యాప్తంగా ఆగస్టు 12 నుంచి సెప్టెంబర్ 30 వరకు ముందస్తు సర్వే చేపట్టనున్నారు. ఈ వివరాలను శుక్రవారం వెల్లడించారు. జనాభా లెక్క ల సేకరణ దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో 2021 మార్చి 1 నుంచి ప్రారంభంకానున్నది. జమ్ముకశ్మీర్‌తోపాటు హిమాచల్ ప్రదేశ్,ఉత్తరాఖండ్ రాష్ట్రాలోని మంచు ప్రాంతాల్లో 1 అక్టోబర్ 2020నే ప్రారంభిస్తారు.

### నిందితుల స్వర నమూనా తీసుకోవచ్చు!

సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** నేరపూరిత కేసుల విషయంలో నిందితుల స్వర నమూనా(వాయిస్ శాంపిల్)ను సేకరించేందుకు అవకాశమిచ్చే కీలకమైన తీర్పును సుప్రీంకోర్టు శుక్రవారం వెలువరించింది. నేరపూరిత కేసుల విచారణలో భాగంగా దర్యాప్తు సంస్థలు నిందితుల స్వర నమూనాను అడిగితే, నిందితులు తప్పనిసరిగా ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని న్యాయస్థానాలకు సుప్రీంకోర్టు సూచించింది. ఈ మేరకు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్లు తమ అధికారాలను వినియోగించాలని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్లీనరీ అధికారాలను ఉపయోగించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. కాగా.. ఇప్పటివరకు, నిందితుల అభీష్టానికి వ్యతిరేకంగా దర్యాప్తు సంస్థలు వాళ్ళ స్వర నమూనాను బలవంతంగా తీసుకునే అవకాశం లేదు.

## అమర్‌నాథ్ యాత్రపై
# ఉగ్రకుట్ర!

యాత్రికులు లక్ష్యంగా భారీ దాడికి పాక్ ఉగ్రవాదులు పన్నాగం ■ సైన్యం సంచలన ప్రకటన



సైన్యం స్వాధీనం చేసుకున్న స్నైపర్ రైఫిల్, బుల్లెట్లు

- యాత్ర దారిలో మందుపాతరలు, పేలుడు పదార్థాలు, తుపాకులను స్వాధీనం చేసుకున్నామని వెల్లడి
- యాత్రను రద్దు చేసుకొని భక్తులు వెనక్కి వచ్చేయాలని సూచన

**శ్రీనగర్, ఆగస్టు 2:** అమర్‌నాథ్ యాత్రికులు లక్ష్యంగా ఉగ్రవాదులు దాడికి పాల్పడే అవకాశముందని సైన్యం హెచ్చరించింది. నిఘా వర్గాల సమాచారం మేరకు గత ఐదు రోజులుగా అమర్‌నాథ్ యాత్ర పొడవునా తనిఖీలు నిర్వహించామని, ఈ సందర్భంగా మందుపాతరలను, పేలుడు పదార్థాలను, తుపాకులను స్వాధీనం చేసుకున్నామని పేర్కొంది. సైన్యం ప్రకటనపై స్పందించిన జమ్ముకశ్మీర్ గవర్నర్ కార్యాలయం భక్తులు వెంటనే యాత్రను రద్దు చేసుకొని వీలైనంత త్వరగా వెనక్కి వచ్చేయాలని సూచించింది. ఈ ప్రకటనల నేపథ్యంలో రాష్ట్రంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**పాక్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నదని నిరూపితమైంది: సైన్యం**

సైన్యానికి చెందిన లెఫ్టినెంట్ జనరల్ కేజేఎస్ ధిల్లాన్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ 'ప్రశాంతంగా సాగుతున్న అమర్‌నాథ్ యాత్రను లక్ష్యంగా చేసుకొని దాడులు చేయడానికి పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులు, ఆ దేశ సైన్యం కుట్ర పన్నుతున్నట్లు మూడు, నాలుగు రోజుల కిందట సమాచారం అందింది. దీంతో మంచు శివలింగాన్ని దర్శించుకోవడానికి వెళ్లే రెండు మార్గాలైన బాల్తాల్, పెహల్‌గామ్‌లలో విస్తృతంగా తనిఖీలు జరిపాం. మందుపాతరలు, తుపాకులు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాం. వీటిలో ఒక మందుపాతర పాకిస్థాన్‌లో తయారైనట్లు గుర్తించాం. దీన్ని బట్టి కశ్మీర్‌లో ఉగ్రవాదానికి పాక్ పాల్పడుతున్నదని, ఉగ్రదాడులను ప్రోత్సహిస్తున్నదని మరోమారు స్పష్టమైంది' అని చెప్పారు. ఇలాంటి కుట్రలను సాగనివ్వమని, కశ్మీర్‌లోని ప్రశాంత వాతావరణానికి ఎవరూ విఘాతం కలించలేరన్నారు. ప్రస్తుతం సరిహద్దు వెంట ప్రశాంత వాతావరణం ఉన్నదని, సరిహద్దు దాటి దేశంలోకి ప్రవేశించడానికి పాక్ చొరబాటుదారులు చేస్తున్న కుట్రలను అడ్డుకుంటున్నామని చెప్పారు. జూలై 30వ తేదీన గురేజ్ సెక్టార్ వద్ద ముగ్గురు ఉగ్రవాదులను కాల్చివేశామని తెలిపారు. కశ్మీర్‌లో పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థలను నేలమట్టం చేస్తున్నామని, ఆయా సంస్థల నాయకులను ఏరిపారేస్తున్నామని వెల్లడించారు. ఉగ్రవాదులకు సహకరిస్తున్న వారిని కూడా అరెస్టు చేస్తున్నామని పేర్కొన్నారు. దాదాపు 83% ఉగ్రవాదులకు భద్రతా బలగాలపై రాళ్లు రువ్విన చరిత్ర ఉన్నదని వివరించారు. 'కశ్మీర్‌లోని తల్లులకు ఒక విజ్ఞప్తి చేస్తున్నా. రూ.500 కోసం ఈ రోజు మీ కుమారుడు భద్రతా బలగాలపై రాళ్లు రువ్వి ఉండొచ్చు. కానీ రేపు మీ కుమారుడు ఉగ్రవాదిగా మారే అవకాశం ఉంది. కాబట్టి కుమారుల పట్ల అప్రమత్తంగా ఉండండి' అని ధిల్లాన్ సూచించారు. కశ్మీర్ లోయలో శాంతియుత వాతావరణానికి విఘాతం కలిగించడానికి పాకిస్థాన్, ఆ దేశ సైన్యం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ఉగ్రదాడులను తిప్పికొట్టడానికి అదనపు బలగాలు అవసరం ఉంటుందన్నారు.

> కశ్మీర్‌లో అదనపు బలగాలను మోహరిస్తున్నారని బాగా ప్రచారం జరుగుతున్నది. వాస్తవానికి జరుగుతున్నదేమిటంటే.. గత 9 నెలల నుంచి రాష్ట్రంలో పలు ఎన్నికలు జరిగాయి. లోక్‌సభ, పంచాయతీ ఇలా పలు ఎన్నికలు జరుగడంతో బలగాలకు విశ్రాంతి లేకుండా పోయింది. దీంతో అదనపు బలగాలు రావడం వల్ల ప్రస్తుతం ఉన్న బలగాలకు కొంత విరామం లభిస్తుంది. అదనపు బలగాలు రావడం వల్ల ఏదో జరిగిపోతున్నదని అతిగా ఊహించుకోవడం సరికాదు.
> **– దిల్‌బాగ్ సింగ్, జమ్ముకశ్మీర్ డీజీపీ**



వివరాలు వెల్లడిస్తున్న లెఫ్టినెంట్ జనరల్ కేజేఎస్ ధిల్లాన్




అమర్‌నాథ్ యాత్ర మార్గంలో లభించిన మందుపాతర

### రాష్ట్రంలో భయాందోళన

అమర్‌నాథ్ యాత్రికులు యాత్రను రద్దు చేసుకొని వెనక్కి వెళ్లాలని జమ్ముకశ్మీర్ గవర్నర్ కార్యాలయం ఆదేశాలు జారీ చేయడంతో రాష్ట్రంలో భయాందోళన వాతావరణం నెలకొన్నది. ఇప్పటికే కేంద్రం అదనపు బలగాలను పంపిన నేపథ్యంలో భయంలో ఉన్న ప్రజలు.. తాజా ఆదేశాలతో మరింత ఆందోళన చెందుతున్నారు. నిత్యావసరాలను నిల్వ చేసుకుంటున్నారు. వాహనాల్లో పెట్రోల్, డీజిల్ పోయించుకోవడానికి జనాలు భారీగా పెట్రోల్ బంక్‌ల వద్ద క్యూ కట్టారు. జమ్ముకశ్మీర్ మాజీ సీఎం, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ గవర్నర్ కార్యాలయం ఆదేశాలు ప్రజలను భయాందోళనకు గురిచేసేలా ఉన్నాయని చెప్పారు. పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ స్పందిస్తూ ప్రజల్లో మానసిక ఆందోళన కలిగించడానికి కేంద్రం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. నిత్యావసరాలను నిల్వ చేసుకునేలా ప్రజలను పురిగొల్పుతున్నారని మండిపడ్డారు. రాజకీయ నేతగా మారిన మాజీ యువ ఐఏఎస్ అధికారి షా ఫైజల్ మాట్లాడుతూ 'భద్రతా దృష్ట్యా యాత్రికులు వెనక్కి వెళ్లాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి ఆదేశాలనే స్థానిక ప్రజల కోసం కూడా రూపొందిస్తున్నారా?' అని ఆయన ప్రశ్నించారు.

**భద్రత కోసమే అదనపు బలగాలు: హోంశాఖ**

ప్రస్తుతం జమ్ముకశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో భద్రత కోసమే అదనపు బలగాలను మోహరిస్తున్నామని కేంద్ర హోంశాఖ స్పష్టంచేసింది. కాగా, అమర్‌నాథ్ యాత్ర రద్దు నేపథ్యంలో అవసరమైతే అదనపు సర్వీసులను నడుపడానికి విమానయాన సంస్థలు సిద్ధంగా ఉండాలని డీజీసీఏ శుక్రవారం ఆదేశించింది. యాత్ర రద్దుతో ప్రయాణికుల సంఖ్య పెరుగుతుందని భావిస్తున్నది.

# యూఏపీఏ బిల్లుకు ఆమోదం



### కశ్మీర్ విషయంలో తెర తొలిగిపోయింది

కేంద్రం తీరుపై పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ ధ్వజం

**శ్రీనగర్:** కశ్మీర్ విషయంలో భారత్ తెర (ముసుగు) తొలిగిపోయిందని, ప్రజల భావోద్వేగాల కంటే జమ్ముకశ్మీర్ భూభాగం తమదని ప్రకటించుకోవడానికే భారత్ ప్రయత్నిస్తున్నదని పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ పేర్కొన్నారు. ఇటీవల కేంద్రం కశ్మీర్ లోయకు 38 వేల మంది పారా మిలిటరీ బలగాలను పంపిన నేపథ్యంలో జమ్ముకశ్మీర్‌కు గల ప్రత్యేక హోదాపై కేంద్రం కీలక నిర్ణయాలు తీసుకోనున్నదని ప్రజల్లో వదంతులు వ్యాపిస్తున్నాయని ఆమె శుక్రవారం ట్వీట్ చేశారు. 'కశ్మీరీలకు ఉన్న చిన్నపాటి గుర్తింపును కూడా దోచుకునేందుకు కేంద్రం సిద్ధమైనట్లు కనిపిస్తున్నది. (పీడీపీ వ్యవస్థాపకుడు, రెండుసార్లు సీఎంగా పని చేసిన) ముఫ్తీ (మహమ్మద్ సయీద్) సాహెబ్ మాట్లాడుతూ తమ సొంతదేశం భారత్ నుంచి కశ్మీరీలు ఏది కావాలంటే అది తెచ్చుకుంటారని చెప్పేవారు. కానీ నేడు పరిస్థితి మారిపోయింది' అని పేర్కొన్నారు.

- రాజ్యసభలో గట్టెక్కిన మరో కీలక బిల్లు
- వ్యక్తులనూ ఉగ్రవాదులుగా ప్రకటించేందుకు ఎన్ఐఏకు అధికారాలు
- వేతన కోడ్ బిల్లుకూ పార్లమెంట్ అంగీకారం

**న్యూఢిల్లీ:** ఉగ్రవాదులతో సంబంధాలున్న అనుమానిత వ్యక్తులనూ ఉగ్రవాదులుగా ప్రకటించేందుకు, వారి ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు జాతీయ దర్యాప్తు సంస్థకు (ఎన్ఐఏ) అధికారాలు కల్పించే చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదముద్ర వేసింది. జూలై 24నే లోక్‌సభ ఈ బిల్లును ఆమోదించగా, శుక్రవారం రాజ్యసభ ఆమోదం తెలిపింది. బిల్లుకు అనుకూలంగా 147 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 42 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్, బీఎస్పీ కూడా బిల్లుకు మద్దతు తెలిపాయి. ప్రతిపక్షాల ఆధిక్యత ఉన్న రాజ్యసభలో ఈ సమావేశాల్లో మూడు కీలక బిల్లులు గట్టెక్కడం విశేషం. ఇదివరకే ఆర్టీఐ సవరణ బిల్లు, ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదం పొందిన విషయం తెలిసిందే. పెద్దల సభలో తగినంత సంఖ్యాబలం లేకపోయినప్పటికీ బిల్లుల ఆమోదానికి బీజేపీ తెరవెనుక వ్యూహరచన రచిస్తున్నది. ఎన్డీయేలో భాగస్వామ్యం కాని పలు పార్టీల సభ్యులను ఓటింగ్‌కు గైర్హాజరయ్యేలా చేయడం, మరికొన్ని పార్టీల మద్దతును కూటగట్టడం ద్వారా రాజ్యసభలో గట్టెక్కుతున్నది.

**మీ గతాన్ని చూసుకోండి..**

యూఏపీఏ బిల్లుపై రాజ్యసభలో జరిగిన చర్చకు హోం మంత్రి అమిత్ షా సమాధానమిస్తూ.. చట్టం దుర్వినియోగం గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదన్నారు. 'ఎమర్జెన్సీ సమయంలో ఏమైంది? ప్రతిపక్ష నేతలందరినీ జైలుపాలు చేశారు. మీడియాపై ఉక్కుపాదం మోపారు. చట్టం దుర్వినియోగం గురించి మీరు మమ్మల్ని నిందిస్తున్నారు. దయచేసి ఓసారి మీ గతాన్ని చూసుకోండి' అని మండిపడ్డారు. సంఝౌతా ఎక్స్‌ప్రెస్, మక్కా మసీదు బాంబు పేలుళ్ల ఘటనలను ప్రస్తావిస్తూ.. ఓ మతానికి చెందిన వారిని ఇరికించేందుకు కాంగ్రెస్ హయాంలో ఈ చట్టాన్ని దుర్వినియోగం చేశారని ధ్వజమెత్తారు. ఏదేని సంస్థను ఉగ్రవాద సంస్థగా ప్రకటించినప్పటికీ, ఉగ్రవాదులు మళ్లీ కొత్త సంస్థల పేర్లతో ఉగ్రచర్యలకు పాల్పడుతున్నారని వివరించారు. అంతకుముందు కాంగ్రెస్ నేత చిదంబరం మాట్లాడుతూ.. చట్టాన్ని తమ పార్టీ వ్యతిరేకించడం లేదని, అయితే కొన్ని సవరణలను వ్యతిరేకిస్తున్నదన్నారు. వ్యక్తిగత స్వేచ్ఛ అన్నది ఇక్కడ ముఖ్య విషయమని, బిల్లు ఆమోదం పొందినప్పటికీ, సదరు చట్టాన్ని కోర్టులు కొట్టివేస్తాయన్నారు. ఉగ్రవాదికి చెందిన సంస్థపై నిషేధం ఉన్నప్పుడు, మళ్లీ అతడిని ఉగ్రవాదిగా ప్రకటించడం ఎందుకని ప్రశ్నించారు.



**కార్మికులకు కనీస వేతనం**

దేశంలో ప్రతి కార్మికుడికీ కనీస వేతనం కల్పించేందుకు ఉద్దేశించిన వేతన కోడ్ బిల్లుకు పార్లమెంట్ ఆమోదముద్ర వేసింది. ఈ బిల్లు ద్వారా దేశంలోని 50 కోట్ల మంది కార్మికులకు ప్రయోజనం కలుగుతుందని కార్మిక శాఖ మంత్రి సంతోష్ గంగ్వార్ తెలిపారు. కనీస వేతనం చట్టం, వేతన చెల్లింపుల చట్టం, బోనస్ చెల్లింపుల చట్టం, సమాన పారితోషిక చట్టాలను విలీనం చేసి కేంద్రం ఈ బిల్లును తీసుకువచ్చింది.

**డ్యామ్ భద్రత బిల్లుకు లోక్‌సభ ఆమోదం**

దేశవ్యాప్తంగా డ్యామ్‌ల పర్యవేక్షణ, తనిఖీ, నిర్వహణకు సంబంధించిన డ్యామ్ భద్రత బిల్లును లోక్‌సభ ఆమోదించింది. 15 మీటర్ల కంటే ఎత్తైన లేదా 10 నుంచి 15 మీటర్ల ఎత్తున్న అన్ని డ్యామ్‌లకు ఈ బిల్లు వర్తిస్తుంది.

### 58 పాత చట్టాలకు చెల్లు

కాలం చెల్లిన 58 కేంద్ర చట్టాలను రద్దు చేసేందుకు ఉద్దేశించిన బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. బీజేపీ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుపయోగమైన చట్టాలను రద్దు చేయాలని నిర్ణయించిందని, ఇందుకోసం ఏర్పాటైన కమిటీ 1,824 చట్టాలను గుర్తించిందని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. ఇప్పటిదాకా, 1,428 చట్టాలను రద్దు చేసినట్లు చెప్పారు. అసంబద్ధమైన 58 చట్టాలను రద్దుచేసేందుకు తాజా బిల్లును తెచ్చామన్నారు.

> 'కార్మికులు, ప్రైవేటు ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయడంలో ప్రపంచ దేశాల్లో భారత్ దిగువ నుంచి నాలుగో స్థానంలో ఉంది. కోడ్ ఆన్ వేజెస్ బిల్లును గతంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి పంపారు. ఆ కమిటీ చేసిన సిఫార్సులను అమలు చేయాలి. వేతనాల విషయంలో మహిళల పట్ల వివక్ష చూపకూడదు. 8 గంటల పని నిబంధనను ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చకూడదు. కోల్, సింగరేణి కార్మికులపై విధిస్తున్న ప్రొఫెషనల్ ట్యాక్స్‌ని ఎత్తివేయాలి.
> **– రాజ్యసభలో టీఆర్ఎస్ ఎంపీ బండ ప్రకాశ్**

> 'డ్యాం సేఫ్టీ బిల్లులో మూడు అంశాలపై కేంద్రం స్పష్టత ఇవ్వలేదు. గతానికీ ఇప్పటికీ డ్యామ్‌ల నిర్మాణ శైలి మారింది. కోడింగ్ తేడా ఉంటుంది. ఈ సమాచారం ప్రభుత్వం వద్ద లేకపోతే ఏ విధంగా తనిఖీ చేస్తారు? దేశ సరిహద్దుల్లో చాలా డ్యాంలున్నాయి. వాటికి సమస్యలు తలెత్తితే ఏ విధంగా పరిష్కరిస్తారు? నీటిపారుదల ప్రాజెక్టుల విషయంలో ఎన్‌రోల్‌మెంట్ క్లియరెన్స్ అవసరం లేదు. ఈ ప్రాజెక్టులతో వ్యవసాయపరంగా రైతులకు లాభసాటిగా ఉంటుంది. పచ్చదనం కూడా పెరుగుతుంది'
> **– లోక్‌సభలో టీఆర్ఎస్ పక్ష నేత నామా నాగేశ్వర్‌రావు**



రాష్ట్ర విభజన చట్టంలోని అంశాలపై తీసుకున్న చర్యలేమిటో కేంద్రం చెప్పాలి. చట్టంలో దాదాపు 30 అంశాలు వరకు పెండింగ్‌లో ఉన్నాయి. షెడ్యూల్ 4 కింద పొందుపర్చిన అంశాలు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. వాటిపై వివరణ ఇవ్వాలి.
**– చట్ట మార్పుల సవరణ బిల్లుపై టీఆర్ఎస్ రాజ్యసభ పక్ష నేత కేకే**



తెలంగాణలోని 29 పాత డ్యామ్‌ల పునరుద్ధరణ, పటిష్టానికి రూ.645 కోట్లు ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం 2017 సెప్టెంబర్‌లో జాతీయ జలమండలికి ప్రతిపాదనలు పంపింది. వాటికి ఇప్పటికీ ఆమోదం రాలేదు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వాలి. అదేవిధంగా రాష్ట్రంలోని 20 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లకు అదనపు నిధులను మంజూరు చేయాలి. పూడిక కారణంగా అనేక డ్యామ్‌ల సామర్థ్యం 25 శాతం తగ్గింది. దీనికి అనుగుణంగాజాగ్రత్తలు తీసుకోవాలి.
**డ్యామ్‌ల భద్రతపై –మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి**

# కార్పొరేట్ కాంగ్రెస్!

- కార్పొరేట్ కంపెనీ స్టైల్‌లో పార్టీని పునరుద్ధరించాలి
- 'మిషన్ 2020' నివేదిక రూపొందించిన పిట్రోడా



**న్యూఢిల్లీ:** దేశంలో కాంగ్రెస్ పార్టీ పునరుద్ధరణకు గాంధీ కుటుంబానికి నమ్మిన బంటు శ్యామ్ పిట్రోడా 20 సూచనలతో కూడిన నివేదికను సమర్పించారు. జాతీయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని కార్పొరేటీకరించాలని ప్రతిపాదించారు. పార్టీ పునరుద్ధరణకు 'మిషన్ 2020' పేరిట పిట్రోడా నివేదిక రూపొందించారు. ముఖ్యాంశాలివి:

- జాతీయ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు హెచ్‌ఆర్ విభాగాలను ఏర్పాటుచేయాలి. ముఖ్య టెక్నాలజీ అధికారి (సీటీవో)లను నియమించాలి.
- ప్రతి ఆఫీస్ బేరర్‌కు కచ్చితమైన లక్ష్యాలు నిర్దేశించాలి. కార్యక్రమాల అమలు ఆధారంగా నేతలకు రేటింగ్ ఇవ్వాలి
- పార్టీ కార్యకలాపాల నిర్వహణతోపాటు పర్యవేక్షణకు టెక్నాలజీని ఉపయోగించుకోవాలి. ప్రజల్లోకి వెళ్లేందుకు సోషల్ మీడియా వేదికలను వాడాలి.
- సీడబ్ల్యూసీకి తోడుగా 10 మంది సభ్యులతో నూతన బోర్డును ఏర్పాటు చేయాలి. అందులో వివిధ రంగాల నిపుణులకు చోటివ్వాలి.

**పిట్రోడా ప్రతిపాదనలు పనికిరానివి**

కార్పొరేటీకరణ ప్రతిపాదన కాంగ్రెస్ పార్టీకి సరిపడదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో సంబంధాలను పెనవేసుకోవడంతోనే కాంగ్రెస్ పునరుద్ధరణ సాధ్యమన్నారు. శామ్ పిట్రోడా మంచి టెక్నోక్రాటైనా.. ఆయనకు భారత రాజకీయాలతో సంబంధాలు తెగిపోయాయని చెప్పారు. సేవాదళ్ తరహాలో కార్యక్రమాలతోనే కాంగ్రెస్ పునరుద్ధరణ సాధ్యమని తేల్చేశారు.

# జర్నలిస్టు రవీశ్‌కుమార్‌కు మెగసెసె

- నిర్భీతిగా నిజాలను చూపిస్తూ 'ప్రైమ్ టైమ్ షో' నిర్వహణ
- అత్యంత ప్రభావవంతమైన జర్నలిస్టుల్లో ఒకరని ప్రశంసించిన ఫౌండేషన్
- ఆయనతో పాటు మరో నలుగురిని వరించిన అవార్డు



రవీశ్‌కుమార్

**మనీలా:** ఆసియా నోబెల్‌గా అభివర్ణించే ప్రతిష్ఠాత్మక రామన్ మెగసెసె అవార్డు 2019 సంవత్సరానికి గానూ భారత్‌కు చెందిన ప్రముఖ జర్నలిస్టు రవీశ్‌కుమార్(44)ను వరించింది. ఈ సంవత్సరం ఈ అవార్డు మొత్తం ఐదుగురికి లభించింది. అందులో రవీశ్‌కుమార్ ఒకరు. బీహార్‌లోని జిత్వార్‌పుర గ్రామంలో జన్మించిన రవీశ్‌కుమార్, 1996లో ఫీల్డ్ రిపోర్టర్‌గా ఎన్డీటీవీలో చేరారు. ప్రస్తుతం ఆయన ఆ ఛానల్‌కి సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆ ఛానల్‌లో ప్రసారమయ్యే రవీశ్‌కుమార్ కార్యక్రమం 'ప్రైమ్ టైమ్ షో' ఎంతో ప్రజాదరణ పొందింది. ప్రజాసమస్యలు, వారి నిజమైన జీవన పరిస్థితులను నిర్భీతిగా ఈ కార్యక్రమంలో ఆయన చర్చిస్తుంటారు. నైతికత, నిబద్ధతతో తన వృత్తిని నిర్వహించడం, నిజాలను చూపించడం, ప్రజాసమస్యలను వెలుగులోకి తీసుకురావడం, తన జర్నలిజం విలువలతో ఎందరినో ప్రభావితం చేయడం లాంటి లక్షణాలకు గుర్తింపుగా ఈ రామన్ మెగసెసె అవార్డుకు రవీశ్‌కుమార్‌ను ఎంపిక చేసినట్టుగా అవార్డు ఫౌండేషన్ పేర్కొంది. ప్రజాగళాన్ని వినిపించడమే నిజమైన జర్నలిజమని అభిప్రాయపడింది. ఇండియాలోని అత్యంత ప్రభావవంతమైన జర్నలిస్టులలో రవీశ్ ఒకరని ప్రశంసించింది. రవీశ్‌తో పాటు మయన్మార్ జర్నలిస్టు కో స్వీ విన్, థాయిలాండ్‌కు చెందిన సామాజిక కార్యకర్త ఆంగ్‌ఖానా నీలపజిత్, దక్షిణ కొరియాకు చెందిన సామాజిక కార్యకర్త కిమ్ జోంగ్-కి, ఫిలిప్పీన్స్‌కు చెందిన రేముండో పూజంతే కయబ్యాబ్‌కు కూడా ఈ అవార్డు లభించింది. రామన్ మెగసెసె అవార్డును ఫిలిప్పీన్స్ మాజీ అధ్యక్షుడు రామన్ మెగసెసె జ్ఞాపకార్థం 1957లో ఏర్పాటు చేశారు. ఆగస్టు 31న ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు.

**భయపడకుండా నిజాల్ని వెల్లడించారు: రాహుల్**

రవీశ్ రామన్ మెగసెసె అవార్డుకు ఎంపిక కావడంపై పలువురు రాజకీయ ప్రముఖులు ఆయనకు అభినందనలు తెలిపారు. దేశంలో ఉన్న ప్రస్తుత పరిస్థితులను భయం లేకుండా అధికారంలో ఉన్న వాళ్లకు రవీశ్ చూపెట్టగలిగారని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఫేస్‌బుక్ వేదికగా ప్రశంసించారు. .

### ఇక స్వేచ్ఛగా సౌదీ మహిళ విదేశీయానం!

సౌదీ ప్రభుత్వం కీలక నిర్ణయం

**రియాద్, ఆగస్టు 2:** సౌదీ అరేబియా మహిళలు ఇక తమ పురుష సంరక్షకుల ఆమోదంతో నిమిత్తం లేకుండా విదేశాలకు ప్రయాణం చేసేందుకు ఆ దేశ ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ మేరకు శుక్రవారం తన అధికారిక గెజిట్ ఉమ్ అల్ ఖురాలో నోటిఫికేషన్ జారీచేసింది. అంతర్జాతీయ సమాజం నుంచి వస్తున్న ఆంక్షలు ఒకవైపు, దేశం నుంచి విదేశాలకు మహిళలు పారిపోతున్న నేపథ్యంలో ఇప్పటివరకు అమలులో ఉన్న ఆంక్షలను ఎత్తివేస్తూ సౌదీ నిర్ణయం తీసుకున్నది. ఇంతకుముందు ఒంటరిగా మహిళలు విదేశీయానం చేయకుండా సౌదీ అమలు చేసిన ఆంక్షలపై ఏండ్ల తరబడి హక్కుల కార్యకర్తలు పోరాడారు. సుదీర్ఘకాలంగా అమలు చేస్తున్న 'గార్డియన్‌షిప్' విధానానికి స్వస్తి పలుకుతూ సౌదీ అరేబియా ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకున్నది. దీని ప్రకారం సౌదీ మహిళలు తమ భర్తలు, తండ్రులు, ఇతర పురుష బంధువులు తోడు లేకుండా విదేశాలకు స్వేచ్ఛగా వెళ్లొచ్చు.

### చారిత్రక గురుద్వారాను తెరిచిన పాక్

**లాహోర్:** పాకిస్థాన్‌లోని పంజాబ్ రాష్ట్రంలో చారిత్రక గురుద్వారాను శుక్రవారం తెరిచారు. భారత్ నుంచి విడివడిన 72 ఏండ్ల తర్వాత పాక్ దీనిని పునరుద్ధరించడం విశేషం. 1947లో దేశ విభజన సందర్భంగా అక్కడి సిక్కు కుటుంబాలు భారత్‌కు తరలివచ్చాయి. జీలం జిల్లాలోని చారిత్రక గురుద్వారా చోవా సాహిబ్ నిర్లక్ష్యానికి గురైంది. నవంబర్‌లో జరుగనున్న గురునానక్ దేవ్ 550వ జయంతి వేడుకల్లో భాగంగా ఇటీవల ఈ గురుద్వారా పునరుద్ధరణ పనులు చేపట్టారు. యూనెస్కో వారసత్వ ప్రాంతమైన రోహ్తాస్ కోటకు సమీపంలో ఉన్న దీన్ని శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు.

## జాదవ్‌తో స్వేచ్ఛగా మాట్లాడనివ్వాలి!

### నిబంధనలతో కూడిన పాకిస్థాన్ అనుమతిని తిరస్కరించిన భారత్

**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** నౌకాదళ మాజీ అధికారి కుల్‌భూషణ్ జాదవ్‌ను భారత దౌత్యాధికారులు కలవడానికి పాకిస్థాన్ ఇచ్చిన నిబంధనలతో కూడిన అనుమతిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ భారత్ దాన్ని తిరస్కరించింది. ఆయన్ను కలుసుకోడానికి ఎటువంటి ఆటంకం, బెదిరింపుల భయం, ప్రతీకార చర్య, పర్యవేక్షణలేని వాతావరణాన్ని పాకిస్థాన్ కల్పించాలని కోరినట్టు అధికారిక వర్గాలు శుక్రవారం పేర్కొన్నాయి. దీనిపై పాకిస్థాన్ స్పందన కోసం ఎదురు చూస్తున్నట్టు కూడా తెలిపాయి. ఇటీవల ఐసీజే ఇచ్చిన ఆదేశాల మేరకు శుక్రవారంనాడు జాదవ్‌ను కలవడానికి పాక్ అనుమతించిన సంగతి తెలిసిందే. భారత దౌత్యాధికారులు జాదవ్‌ను కలుసుకోవడానికి అంగీకరిస్తూనే.. పాకిస్థాన్ కొన్ని నిబంధనలు పెడుతున్నట్టు తెలిపింది. అయితే, ఐసీజే ఆదేశాల ప్రకారం.. పర్యవేక్షణలేని వాతావరణంలో జాదవ్‌తో భేటీ అయ్యే అవకాశాన్ని కల్పించాలని పేర్కొంటూ.. పాక్ నిబంధనలతో కూడిన అనుమతిని భారత్ తిరస్కరించింది.

## ట్రిపుల్ తలాక్‌పై తొలి కేసు నమోదు

- రూ.లక్ష కట్నం ఇవ్వనందుకు భార్యకు తలాక్ చెప్పిన భర్త
- పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు.. యూపీలో ఘటన



**మధుర:** ట్రిపుల్ తలాక్ చట్టం కింద తొలి కేసు ఉత్తర్‌ప్రదేశ్‌లో నమోదైంది. మధుర జిల్లా కోసికలాన్ పట్టణం కృష్ణనగర్ ప్రాంత వాసి అయిన జుమిరాత్‌కు హర్యానా రాష్ట్రం నూహ్ జిల్లా వాసి ఇక్రాంతో రెండేండ్ల క్రితం పెండ్లయింది. నాటి నుంచి రూ. లక్ష కట్నం కావాలని ఇక్రాం డిమాండ్ చేస్తున్నాడు. దంపతులిద్దరికి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. చివరిగా గత నెల 30న పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చినప్పుడు భార్యాభర్తల మధ్య సుహృద్భావ సంబంధాలు ఉన్నట్లు కనిపించిందని మధుర ఎస్‌ఐ రుచి త్యాగి చెప్పారు. అయితే కట్నం ఇచ్చుకోలేమని అత్త తేల్చేయడంతో పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు వెళ్లగానే ఇక్రాం.. జుమిరాత్‌కు మూడుసార్లు తలాక్ చెప్పాడు. దీనిపై జుమిరాత్ ఫిర్యాదు మేరకు ఇక్రాంపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ షలబ్ మాథూర్ తెలిపారు. ట్రిపుల్ తలాక్‌కు స్వస్తి పలికేందుకు ముస్లిం మహిళ (వివాహ హక్కుల పరిరక్షణ) బిల్లు-2019కి పార్లమెంట్ మంగళవారం ఆమోదం తెలిపింది. గురువారం రాష్ట్రపతి కోవింద్ ఆమోదం తెలుపడంతో చట్టంగా మారింది. ఈ చట్టం ప్రకారం ముస్లిం మహిళకు భర్త ట్రిపుల్ తలాక్ చెప్పడం నేరం. మూడేండ్ల జైలుశిక్ష పడే అవకాశం ఉంది.

## ఇండోనేషియాలో భారీ భూకంపం

### సునామీ హెచ్చరికలు జారీ

**జకార్తా, ఆగస్టు 2:** ఇండోనేషియాలో శుక్రవారం భారీ భూకంపం సంభవించింది. ఆ దేశ దక్షిణ తీర ప్రాంతమైన జావా ద్వీపంలో 52.8 కిలోమీటర్ల లోతులో, రాజధాని జకార్తాకు 150 కి.మీ దూరంలో సంభవించిన భూకంపం తీవ్రత 6.9గా నమోదైనట్లు అమెరికా జియాలాజికల్ సర్వే వెల్లడించింది. కాగా రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 7.4గా నమోదైనట్లు ఇండోనేషియా డిజాస్టర్ ఏజెన్సీ తొలుత ప్రకటించింది. ఇది సునామీకి దారి తీయవచ్చని, సముద్ర అలలు పది అడుగుల మేర ఎగసిపడవచ్చని ఆ సంస్థ హెచ్చరించింది. జావా, సుమత్ర ద్వీపాల మధ్యనున్న సుండా జలసంధిలో సునామీ రావచ్చని, తీర ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని పేర్కొంది. ఆ దేశ కాలమానం ప్రకారం రాత్రి 9.30కి సునామీ ప్రభావంపై సమీక్షించనున్నట్లు తెలిసింది. మరోవైపు భారీ భూప్రకంపనలకు జకార్తలోని అపార్ట్‌మెంట్ వాసులు భయాందోళన చెందారు. ఇండ్లను వీడి బయటకు పరుగులు తీశారు.

# కశ్మీర్.. ద్వైపాక్షిక అంశమే!

- భారత్-పాక్ కోరితే మధ్యవర్తిత్వం వహిస్తా: ట్రంప్ పునరుద్ఘాటన
- కశ్మీర్‌పై ఎలాంటి చర్చలైనా పాక్‌తోనే: విదేశాంగ మంత్రి జైశంకర్

**వాషింగ్టన్, ఆగస్టు 2:** కశ్మీర్ అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్ సమస్య భారత్-పాక్ మధ్యనున్న ద్వైపాక్షిక అంశమని అంటూనే, సదరు అంశంపై తనను మధ్యవర్తిత్వం వహించాలని కోరితే, ఆనందంగా అంగీకరిస్తానని అన్నారు. కశ్మీరు అంశంపై తనను మధ్యవర్తిత్వం చేయాల్సిందిగా మోదీ కోరారని పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ అమెరికాలో పర్యటించిన సందర్భంగా ట్రంప్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. అయితే, ట్రంప్ వ్యాఖ్యల్ని భారత్ తీవ్రంగా ఖండించింది. కశ్మీర్.. భారత్-పాక్ మధ్య ద్వైపాక్షిక అంశమని.. ఈ విషయంలో మూడో పక్షం జోక్యం అవసరం లేదని సుస్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో కశ్మీర్ విషయంలో మధ్యవర్తిత్వంపై భారత్ స్పందనను ప్రస్తావిస్తూ శ్వేతసౌధంలో ఓ విలేకరి లేవనెత్తిన ప్రశ్నకు ట్రంప్ బదులిస్తూ.. 'ఆ విషయాన్ని ప్రధాని మోదీకే విడిచిపెడుతున్నాను' అని వ్యాఖ్యానించారు. తన మధ్యవర్తిత్వానికి భారత్ అంగీకరించిందా? లేదా? అని విలేకరులను ఎదురు ప్రశ్న వేశారు. 'నాకు తెలిసినంత వరకు ఇమ్రాన్‌ఖాన్, మోదీ అద్భుతమైన వ్యక్తులు. ఇరు దేశాల మధ్య సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఆశిస్తున్నాను. ఒకవేళ వారు ఎవరి జోక్యాన్నైనా ఆశిస్తే దానికి నేను సిద్ధం. ఈ అంశంపై నేను పాకిస్థాన్‌తో చర్చించాను. భారత్‌తో కూడా స్పష్టంగా నా అభిప్రాయాన్ని వ్యక్తం చేశాను' అని ట్రంప్ చెప్పారు. మరోవైపు, కశ్మీర్‌పై ఎలాంటి చర్చలైనా కేవలం భారత్, పాకిస్థాన్‌ల మధ్యనే జరుగుతాయని, ఇది ఇరు దేశాలకు సంబంధించిన ద్వైపాక్షిక అంశం మాత్రమేనని భారత్ పునరుద్ఘాటించింది. థాయిలాండ్‌లో జరుగుతున్న 9వ తూర్పు ఆసియా విదేశాంగ మంత్రుల సమావేశాల సందర్భంగా శుక్రవారం అమెరికా విదేశాంగ మంత్రి మైకేల్ పాంపియోతో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య కశ్మీర్ మధ్యవర్తిత్వం అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. కశ్మీర్‌పై ఎలాంటి చర్చలైనా కేవలం భారత్, పాకిస్థాన్‌ల మధ్యే ద్వైపాక్షికంగా జరుగుతాయని పాంపియోకి స్పష్టం చేసినట్టు జైశంకర్ ట్విట్టర్ వేదికగా తెలిపారు.



జైశంకర్‌తో పాంపియో కరచాలనం

# మధ్యవర్తిత్వం విఫలం

- అయోధ్య కేసుపై ఇక సుప్రీంకోర్టులో రోజువారీ విచారణ
- ఈ నెల 6 నుంచి ప్రారంభం.. ముగిసేవరకూ కొనసాగింపు
- పిటిషనర్లు సిద్ధంగా ఉండాలని ధర్మాసనం ఆదేశం



**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** అయోధ్యలోని రామ జన్మ భూమి స్థలం విషయంలో నెలకొన్న వివాదాన్ని కోర్టు బయట పరిష్కరించేందుకు సుప్రీంకోర్టు ఏర్పాటుచేసిన మధ్యవర్తిత్వ కమిటీ విఫలమైంది. దీంతో కేసును త్వరగా ముగించేందుకు ఈ నెల 6 నుంచి రోజువారీ విచారణ చేపడుతామని సుప్రీంకోర్టు ప్రకటించింది. వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకునేందుకు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఎఫ్ఎంఐ కైపుల్లా నేతృత్వంలో ముగ్గురు సభ్యులతో మధ్యవర్తిత్వ కమిటీని కోర్టు నియమించిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ గురువారం నివేదిక సమర్పించింది. దీనిపై శుక్రవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. 'కైపుల్లా కమిటీ ఇచ్చిన నివేదిక మాకు అందింది. పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. పరిష్కారం కనుగొనేందుకు హిందూ, ముస్లిం సంస్థలు సిద్ధంగా లేవని కమిటీ పేర్కొన్నది. మధ్యవర్తిత్వం ద్వారా వివాదం పరిష్కారం కాలేదు కాబట్టి.. మేమే తేలుస్తాం. అయోధ్య భూవివాదానికి సంబంధించి దాఖలైన కేసులు, వ్యాజ్యాలపై ఈ నెల 6 నుంచి రోజువారీ విచారణ జరుపుతాం' అని ధర్మాసనం పేర్కొన్నది. వాదనలు ముగిసేవరకు విచారణ కొనసాగుతుందని స్పష్టంచేసింది. ఈ మేరకు పిటిషనర్లు సిద్ధంగా ఉండాలని, ఆధారాలను కోర్టుకు సమర్పించాలని సూచించింది. ఈ సందర్భంగా సున్నీ వక్ఫ్‌బోర్డ్ తరఫున వాదనలు వినిపిస్తున్న న్యాయవాది రాజీవ్ ధావన్.. ఈ కేసులోని అనేక సాంకేతిక అంశాలను వివరిస్తూ తమకు 20 రోజుల సమయం కావాలని ధర్మాసనాన్ని కోరారు. ఆయన విన్నపాన్ని ధర్మాసనం కొట్టివేసింది 'మేము ఏం చేయాలో మీరు గుర్తుచేయాల్సిన అవసరం లేదు' అని ఘాటుగా వ్యాఖ్యానించింది. వివాదాస్పదంగా మారిన 2.77 ఎకరాల భూమిని పిటిషనర్లు సున్నీ వక్ఫ్ బోర్డు, నిర్మోహీ అఖారా, రామ్‌లల్లాలకు సమంగా పంచాలని 2010లో అలహాబాద్ హైకోర్టు తీర్పునిచ్చింది. దీనిపై సుప్రీంకోర్టులో 14 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటన్నింటిపైనా గురువారం నుంచి వాదనలు ప్రారంభం కానున్నాయి.

### నాలుగు నెలలు ప్రయత్నించినా..

అయోధ్యలోని 2.77 ఎకరాల భూమి వివాదాన్ని మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు ఈ ఏడాది మార్చి 8న సూచించింది. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఎఫ్ఎంఐ కైపుల్లా నేతృత్వంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్, సీనియర్ న్యాయవాది శ్రీరామ్ పంచు సభ్యులుగా మధ్యవర్తిత్వ కమిటీని నియమించింది. ఈ కమిటీ దాదాపు నాలుగు నెలలపాటు హిందూ, ముస్లిం సంస్థలతో చర్చలు జరిపింది. పరిష్కారానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో ఇదే విషయాన్ని కమిటీ సుప్రీంకోర్టుకు వివరించింది.

**స్వాగతించిన ఆరెస్సెస్**

అయోధ్య వివాదంపై రోజువారీ విచారణ జరుపాలని సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని ఆరెస్సెస్ శుక్రవారం స్వాగతించింది. తద్వారా అయోధ్యలో రామాలయం నిర్మాణానికి గల న్యాయపరమైన అడ్డంకులు తొలిగిపోతాయని ఆశాభావం వ్యక్తం చేసింది.

## హమ్జా బిన్ లాడెన్‌తో అమెరికాకు ముప్పు

### అతడి మరణ వార్తపై స్పందించను: ట్రంప్



**వాషింగ్టన్, ఆగస్టు 2:** అల్‌ఖైదాకు చెందిన హమ్జా బిన్ లాడెన్ అమెరికాకు పెద్ద ముప్పుగా మారాడని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. గురువారం వైట్‌హౌస్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. హమ్జాను మట్టుబెట్టినట్లు వస్తున్న వార్తల్లో అమెరికా ప్రమేయం గురించి విలేకరులు ట్రంప్‌ను ప్రశ్నించగా.. 'దీనిపై నేను వ్యాఖ్యానించబోను. కానీ అతడు మన దేశానికి పెద్ద ముప్పుగా పరిణమించాడు. మన దేశం గురించి చాలా చెడుగా మాట్లాడాడు. అంతకు మించి నేను వ్యాఖ్యానించలేను' అని అన్నారు. ఉగ్రదాడులతో అమెరికాను గడగడలాడించిన ఒసామా బిన్ లాడెన్‌ను హతమార్చినట్లే ఆయన కుమారుడు హమ్జా బిన్ లాడెన్‌ను ట్రంప్ అధికారంలోకి వచ్చిన రెండేండ్లలోనే అమెరికా సైన్యం మట్టుబెట్టినట్లుగా కొందరు అధికారులు చెప్పినట్లు ఆ దేశ మీడియా వర్గాలు బుధవారం వెల్లడించాయి. అయితే అమెరికా దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. హమ్జా మృతిపై వస్తున్న వార్తలు ఒకవేళ నిజమైతే అల్‌ఖైదాకు పెద్ద దెబ్బేనని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది.

### చంద్రయాన్ -2 కక్ష్య పెంపు ప్రక్రియ విజయవంతం

**బెంగళూరు:** చంద్రయాన్-2 మిషన్ సవ్యంగా సాగుతున్నదని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రకటించింది. అంతరిక్ష నౌక కక్ష్యను పెంచే నాలుగో ప్రక్రియను శుక్రవారం విజయవంతంగా నిర్వహించినట్లు వెల్లడించింది. తదుపరి కక్ష్య పెంపు ప్రక్రియను ఆగస్టు 6న చేపట్టనున్నట్లు తెలిపింది. జూలై 22న చంద్రయాన్-2ను విజయవంతంగా ప్రయోగించిన సంగతి తెలిసిందే.

## అసెంబ్లీ ఎన్నికల్ని బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించాలి

### ఈసీకి మహారాష్ట్ర ప్రతిపక్షాల డిమాండ్



**ముంబై:** మహారాష్ట్రలో మరో రెండు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈవీఎంల వినియోగంపై ఆ రాష్ట్ర విపక్షాలు తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నాయి. బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ నిర్వహించాలన్న డిమాండ్‌తో ఆగస్టు 21న భారీ ర్యాలీ నిర్వహించనున్నాయి. శుక్రవారం సమావేశమైన కాంగ్రెస్, ఎన్సీపీ, ఎంఎన్ఎస్‌తో పాటు ఇతర పార్టీల నేతలు సంయుక్త మీడియా సమావేశంలో ఈ మేరకు ప్రకటించారు. ఈవీఎంల వినియోగంపై ప్రజల్లో పలు అనుమానాలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బ్యాలెట్ ఓటింగ్ కోసం ప్రజల మద్దతు కూడగడతామని, వారి నుంచి స్వీకరించే అభిప్రాయ పత్రాలను 21న ఎన్నికల సంఘానికి(ఈసీ) సమర్పిస్తామని వెల్లడించారు. 'అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలుపుపై అక్కడి ప్రజలు అనుమానాలు వ్యక్తం చేశారు. మన ఈవీఎంలోని ఎలక్ట్రానిక్ చిప్‌లు అమెరికా నుంచి వచ్చినవే. బ్యాలెట్ పేపర్ ఓటింగ్‌తో ఎన్నికలపై ప్రజల్లో నమ్మకం ఏర్పడుతుంది' అని ఎంఎన్ఎస్ అధ్యక్షుడు రాజ్ ఠాక్రే చెప్పారు.

# వరంగల్‌కు కొత్త మాస్టర్‌ప్లాన్

- భవిష్యత్ అవసరాలపై దూరదృష్టితో రూపకల్పన
- మెరుగైన సేవలు అందించేలా ప్లాన్: మంత్రి ఎర్రబెల్లి



వరంగల్ మాస్టర్‌ప్లాన్‌పై సమీక్ష జరుపుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ కూడా ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వరంగల్ అభివృద్ధి కోసం ప్రభుత్వం అన్నివిధాలుగా కృషి చేస్తున్నదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చెప్పారు. రాష్ట్రంలో రెండో పెద్దనగరంగా ఉన్న వరంగల్ సమగ్ర అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా కొత్త మాస్టర్‌ప్లాన్ ఉంటుందని చెప్పారు. వరంగల్ మాస్టర్‌ప్లాన్-2041 ఆమోదంపై మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం హైదరాబాద్‌లో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత మాస్టర్‌ప్లాన్-1971లో మార్పులుచేసి ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా రూపొందించామని చెప్పారు. మూడు జిల్లాల పరిధిలోని 19 మండలాలు, 181 రెవెన్యూ గ్రామాలు మాస్టర్‌ప్లాన్ కింద ఉన్నాయని, మొత్తం పరిధి 1800 చదరపు కిలోమీటర్లని తెలిపారు. టెక్స్‌టైల్ పార్క్, టూరిజం హబ్‌తో వరంగల్ ఎకనామిక్ హబ్‌గా అభివృద్ధి చెందుతుందన్నారు. కుడా పరిధిలోని రెండువేల చెరువులను పరిరక్షించేలా మాస్టర్‌ప్లాన్ ఉంటుందని, పార్కుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చినట్టు తెలిపారు.. ఇన్నర్ రింగ్‌రోడ్లు, ఔటర్ రింగ్‌రోడ్డు, రీజినల్ రింగ్‌రోడ్డు.. ఇలా ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి ప్రణాళికలు అమలవుతాయని అన్నారు. సమావేశంలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్ మర్రి యాదవరెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, కుడా వైస్ చైర్మన్ ఎన్ రవికుమార్, మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్, పీవో అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎంసీఆర్ హెచ్చార్డీలో ఫౌండేషన్ కోర్సు పూర్తిచేసుకొన్న రాష్ట్ర గ్రూప్-1 అధికారులతో గవర్నర్ నరసింహన్. చిత్రంలో ఎంసీఆర్‌హెచ్చార్డీ డైరెక్టర్ జనరల్ బీపీ ఆచార్య కూడా ఉన్నారు.

## ప్రజల వద్దకు సామాన్యుల్లా వెళ్లండి

- జిల్లాల పునర్విభజనతో ప్రజలతో కలిసి పనిచేసే అవకాశం
- ప్రజలతో మమేకమై సమస్యలు పరిష్కరించండి
- శిక్షణ పూర్తిచేసుకున్న గ్రూప్-1 అధికారులకు గవర్నర్ నరసింహన్ సూచన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'శిక్షణ పూర్తిచేసుకొన్న తరువాత ప్రజల వద్దకు అధికారులుగా కాకుండా సామాన్యుల మాదిరిగా వెళ్లండి. వారితో మమేకం కండి. సమస్యలు తెలుస్తాయి. ఆ తరువాత వాటిని పరిష్కరించండి.' అని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ సూచించారు. జిల్లాల పునర్విభజన ప్రక్రియ.. ప్రజలతో అధికారులు కలిసిపోయి పనిచేసే అరుదైన అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని వినియోగించుకొని ప్రజలతో స్నేహంగా ఉంటూ, సానుకూల దృక్పథంతో పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు. శుక్రవారం ఎంసీఆర్ హెచ్చార్డీలో రాష్ట్ర గ్రూప్-1 అధికారుల ఫౌండేషన్ కోర్సు ముగింపు కార్యక్రమానికి గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నరసింహన్ మాట్లాడుతూ.. ప్రజలకు సేవలందించడంలో నిబంధనల పేరుతో ఫైళ్లను ఒక డెస్క్ నుంచి మరో డెస్క్‌కు పంపడం వరకే పరిమితం కాకూడదని సలహా ఇచ్చారు. ఎంసీఆర్ హెచ్చార్డీ డైరెక్టర్ జనరల్ బీపీ ఆచార్య మాట్లాడుతూ.. గ్రూప్-1 అధికారులు రాష్ట్రాభివృద్ధికి తమను తాము పునరంకితానికి ప్రేరేపించేలా ఫౌండేషన్ కోర్సును నిర్వహించినట్టు తెలిపారు. ప్రతిభ కనబరిచిన నూకల ఉదయ్‌రెడ్డి, పెరిక జయసుధకు గవర్నర్ జ్ఞాపికలు బహూకరించారు. గ్రూప్-1 అధికారుల హౌస్ జర్నల్ 'సవ్వడి'ని నరసింహన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంసీఆర్ హెచ్చార్డీ అదనపు డైరెక్టర్ జనరల్ బూసాని వెంకటేశ్వరరావు, కోర్సు డైరెక్టర్ డాక్టర్ షేక్‌మహ్మద్‌నబీ, కోఆర్డినేటర్ రావుల పాటి మాధవి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో అభివృద్ధికి సహకరించాలి

### మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలి

- కేంద్రమంత్రులను కలిసి వినతిపత్రం అందజేశాను
- ఢిల్లీలో మీడియాతో రాష్ట్రమంత్రి కొప్పుల ఈశ్వర్



శుక్రవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్. చిత్రంలో ఎంపీ వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తదితరులు కూడా ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొత్తగా ఏర్పడిన తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ అనేక శాశ్వత కార్యక్రమాలు అమలుచేస్తున్నారని.. వాటికి కేంద్రం తనవంతు సహకారం అందించాలని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ కోరారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద సమ్మక్క, సారలమ్మ జాతర అని కోటిమంది గిరిజనులను ఒకచోటకు చేసే గిరిజన కుంభమేళను జాతీయ పండుగగా గుర్తించి.. నిధులు కేటాయించాలని కోరినట్టు చెప్పారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో విద్యారంగంలో పెనుమార్పులు వచ్చాయని, దేశంలో ఎక్కడా లేనివిధంగా అధికసంఖ్యలో గురుకుల విద్యాలయాలను ఏర్పాటుచేసినట్టు కేంద్రమంత్రులకు వివరించానని, గురుకుల పాఠశాలల భవనాల నిర్మాణానికి కేంద్రం సహకరించాలని వినతిపత్రం సమర్పించినట్టు వెల్లడించారు. పెద్దపల్లిలో కేంద్రీయ విద్యాలయం, జగిత్యాలలో నవోదయ పాఠశాలను ఏర్పాటుచేయాలని, ఎరువుల ఫ్యాక్టరీ నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించాలని కేంద్రమంత్రులను కోరినట్టు కొప్పుల వివరించారు. మీడియా సమావేశంలో ఎంపీ వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్యే కోరుకంటి చందర్, స్థానిక నేత పొనుగంటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పర్యటన సంతోషకరం

- 15 రోజుల్లో మళ్లీ వస్తా: కర్ణాటక సీఎం యెడియూరప్ప



త్రిదండి చినజీయర్‌స్వామి ఆశీర్వాదం తీసుకొంటున్న కర్ణాటక సీఎం యెడియూరప్ప

**శంషాబాద్:** శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లో త్రిదండి చినజీయర్‌స్వామి ఆశ్రమాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన కర్ణాటక సీఎం యెడియూరప్ప శుక్రవారం తిరిగి బెంగళూరుకు బయలుదేరారు. ఆయనకు చినజీయర్‌స్వామి, 'మైహోం' గ్రూపు సంస్థల అధినేత జూపల్లి రామేశ్వరరావు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా యెడియూరప్ప మాట్లాడుతూ.. తెలంగాణలో పర్యటన సంతోషకరంగా సాగిందని, మళ్లీ 15 రోజుల్లో వచ్చి యాగం చేస్తానన్నారు.

## కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా మమత బాధ్యతల స్వీకరణ

- టీజీవో, టీఎన్జీవో సంఘాల నాయకుల అభినందనలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా నియమితులైన తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షురాలు వీ మమత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. టీజీవో సంఘం ప్రధాన కార్యదర్శి ఏ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పీ రవీందర్‌కుమార్, కార్యదర్శి డీ అరుణ్‌కుమార్, బీ వెంకటయ్య, టీజీవో హైదరాబాద్ అధ్యక్షుడు ఎంబీ కృష్ణయాదవ్, టీ హరికృష్ణ, రంజిత్, తదితరులు ఆమెను కలిసి అభినందనలు తెలిపారు. భాగ్యనగర్ టీఎన్జీవో అసోసియేషన్, గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ కార్యదర్శి పీ బలరాం ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## 5న ఆబ్కారీ ఎస్సై అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆబ్కారీ ఎస్సై అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 5న చేపట్టనున్నట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లోని రూమ్ నంబరు 507లో ఉదయం 9 గంటలకు చేపట్టే ఈ ప్రక్రియకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఒరిజినల్ ధ్రువీకరణపత్రం, రూ.600 ఫీజు వెంటతెచ్చుకోవాలని తెలిపింది. పూర్తి వివరాలకు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించింది.

## ఎర్రమంజిల్‌పై కొనసాగిన వాదనలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అసెంబ్లీ భవనాన్ని కూల్చి ఎర్రమంజిల్‌లో కొత్త భవనాన్ని నిర్మించే అంశంపై శుక్రవారం హైకోర్టులో వాదనలు కొనసాగాయి. 'హైదరాబాద్ జిందాబాద్' ఎన్జీవో తరఫున న్యాయవాది నిరూప్‌రెడ్డి, సామాజిక కార్యకర్త లుబ్నా సార్వత్ తరఫున న్యాయవాది రచనారెడ్డి వాదనలు కొనసాగించారు. హెరిటేజ్ చట్టంలో పేర్కొన్నట్టుగా రాష్ట్రంలో ఇప్పటివరకు హెరిటేజ్ పరిరక్షణ కమిటీలను ఏర్పాటుచేయలేదని, కనుక ఆ చట్టం అమలులో లేనట్టేనని నిరూప్‌రెడ్డి పేర్కొన్నారు. బెంగళూరు హైకోర్టు భవనం అటారా కచేరీ కేసు ప్రస్తుత ఎర్రమంజిల్ కేసుకు సరిగ్గా సరిపోలుతుందని తెలిపారు. వాదనలను విన్న ధర్మాసనం.. తదుపరి విచారణను 5కు వాయిదా వేసింది.


BEFORE RECOVERY OFFICER- 2
DEBTS RECOVERY TRIBUNAL- 2
AT HYDERABAD
1sr Floor, Triveni Complex, Abids, Hyderabad- 500001
R.P. No. 732/2018
IN
O.A. No. 1250/2017
(Old OA. No. 930/2016)

Between
M/s. ICICI Bank Limited, Khairatbad Branch, Hyderabad.
...Certificate Holder
And
Sri. Rahul Simarapur, & ORS,
...Certificate Debtor

NOTICE OF DEMAND TO CERTIFICATE DEBTORS

To,
1. Sri. Rahul Simarapu, S/o Satyanarayana, R/o H.No. 5-6-32, Kapuvada Bazar, Karimnagar, Telangana-505001.
And also at:
Flat No. 201, Second Floor, Prime Residency, Plot No. 8, Survey No. 782, KalyanPuri, Uppal, Hyderabad- 39.
.....Certificate Debtor No 1
2. Sri. Satyanarayana Simarapu, S/o Rajaram, R/o H.No. 5-6-32, Kapuvada Bazar, Karimnagar, Telangana-505001.
.....Certificate Debtor No 2
3. Smt. Anusha Simarapu, W/o Rahul Simarapu, R/o H.No. 5-6-32, Kapuvada Bazar, Karimnagar, Telangana-505001.
.....Certificate Debtor No 3

Take notice that R.P. No. 732/2018 IN O.A. No. 1250/2017(Old OA. No. 930/2016) been forwarded by the Honourable Presiding Officer, Debts Recovery Tribunal, Hyderbad for recovery of an amount of Rs. 64,19,882/- (Rupees Sixty Four Lakhs Nineteen Thousand Eight Hundred And Eighty Two only) interest and costs from you. You, the Defendants are hereby required to pay the amount of this notice by way of Demand Draft to be drawn in favour of "Debts Recovery Tribunal- 2, Hyderbad" within 15 day from the date of publication of this notice. In case of default, steps will be taken under Rules 4 and 5 of the second schedule of Income Tax Act, 1961 and section 25 to 29 of Recovery of Debts Due to Banks & Financial Institutions Act, 1993.
Date : 21/06/2019
Place: Karimnagar

(J. Srinivasa Rao)
Recovery Officer- 2,
DRT- II, Hyderabad



తెలంగాణ ప్రభుత్వం
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
NIT నం. 14 to 17/SE/TUFIDC/Unit-III/ WNPY/ NRPT/ IEEJA/CC Drain & BT Roads/Police Station/PHC/2019 తేది:9&26-07-2019
పని పేరు: 1) వనపర్తి మునిసిపాలిటీలోని వివిధ వార్డులలో అంతర్గత & బహిర్గత రోడ్లలో CC కాలువలు వేయుట. 2) TUFIDC సహాయం క్రింద నారాయణపేట మునిసిపాలిటీలో ప్రధాన CC కాలువలు, CC రోడ్ల నిర్మాణం 3) అయిజ మునిసిపాలిటీలో TUFIDC పథకం క్రింద పోలీస్ స్టేషన్ నుండి ఉప్పల్ దొడ్డి సంప్ మీదుగా కర్నూలు రోడ్డు వరకు BT రోడ్డు వేయుట మరియు LEDతో రోడ్డు వే లైట్లు కల్పించుటతో ఉప్పల్‌దొడ్డి సంప్ వద్ద వంతెన నిర్మాణం. 4) అయిజ మునిసిపాలిటీలో TUFIDC పథకం క్రింద PHC నుండి కత్తిమణ్యం మీదుగా తూంకుంట రోడ్డు వరకు BT రోడ్డు వేయుట మరియు LEDతో రోడ్డు వే లైట్లు కల్పించుటతో కురువపేట వద్ద వంతెన నిర్మాణం. మొత్తం పని విలువ: రూ. 1612.5 లక్షలు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ https://tender.telangana.gov.in వద్ద చూడవచ్చును. తదుపరి ఏవైన స్పష్టీకరణలకు SE (PH), యూనిట్-III, TUFIDC, మహబూబ్‌నగర్ కార్యాలయం వారిని కార్యాలయ వేళల్లో సంప్రదించండి. సంబంధిత పేరు & చిరునామా: బి. రమణమూర్తి, O/o సూపరింటెండింగ్ ఇంజినీర్ (PH) యూనిట్-III, TUFIDC, మహబూబ్‌నగర్. మెయిల్ ID : se.unit3.tufidc@gmail.com. సంప్ర: 7416421348 సం/-సూపరింటెండింగ్ ఇంజినీర్ (PH) యూనిట్-III, TUFIDC, మహబూబ్‌నగర్
DIPR RO.No.792 - DP/CL/Advt/1/2019-20 Dt:02.08.2019



తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, ఇరిగేషన్ సర్కిల్, వరంగల్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
No. 11/2019-20, తేది: 09-07-2019, 12/2019-20, తేది: 18-07-2019, 13&14/2019-20, తేది: 26-07-2019
జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ మరియు జనగాం జిల్లాలు-ములుగు, మహబూబాబాద్ మరియు జనగాం డివిజన్ల వద్ద చెక్ డ్యామ్‌ల నిర్మాణాల పనులు (04) కొరకు 01-08-2019 నుండి 08-08-2019 వరకు బిడ్లు కోరబడుచున్నవి మరియు అవి వెబ్‌సైట్‌లో ప్రచురింపబడినవి. తదుపరి వివరాల కొరకు http://tender.telangana.gov.in దర్శించండి.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, I&CADD,
DIPR RO.No. 283-PP/CL/ADVT/1/2019-20, Dt: 02-08-2019
ఇరిగేషన్ సర్కిల్, వరంగల్



THE TELANGANA STATE DAIRY DEVELOPMENT CO-OPERATIVE FEDERATION LIMITED
Milk Products Factory, Hyderabad - 500 017. Email ID: gmmpfhyd.tsddcf@gmail.com
e-Procurement
Tender Notice No: 615 /G.M / MPF / HYD /2019 Date: 22.07.2019
Technical cum Commercial Tenders are invited from the experienced and reputed Manufacturers / Suppliers / Authorized Dealers / Agencies for the following work at Milk Products Factory, Hyderabad in Telangana State through e-procurement platform @ www.tender.telangana.gov.in

| Tender No. | Tender Description |
|---|---|
| 615 | Supply, Installation, Testing & Commissioning of SS Conveyor 304 Grade for Water Bottling Plant at MPF, Hyderabad |

Start of downloading bid documents will commence from 03.08.2019. For further details please contact Mobile No. 9032369758 Sd/- Managing Director

నమస్తే తెలంగాణ

# ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE



# పట్టా భూములపై మాఫియా పంజా

## అధికారుల అండతో రెచ్చిపోతున్న భూ బకాసురులు • ఫోర్జరీ సంతకాలతో తప్పుడు రిజిస్ట్రేషన్

- తప్పుడు డాక్యుమెంట్లతో దర్జాగా కబ్జా
- పట్టాదారు లక్ష్మీకాంతరెడ్డి ఫిర్యాదుతో పాస్‌పుస్తకాలు నిలిపివేత
- న్యాయం కోసం వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్, సీపీని ఆశ్రయించిన బాధితుడు




లక్ష్మీకాంతరెడ్డి, సంకెపల్లి రవీందర్‌రెడ్డి

**హసన్‌పర్తి:** వరంగల్ అర్బన్ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేట గ్రామంలో సూరం వెంకటరెడ్డి, లింగారెడ్డి, మల్లారెడ్డి అనే ముగ్గురు రైతులకు సంబంధించిన సర్వే నంబర్ 360/ఏలోని 4.08 ఎకరాల పట్టా భూమిని.. హన్మకొండకు చెందిన సంకెపల్లి రవీందర్‌రెడ్డి, ఖమ్మం జిల్లా సుబ్లెడ్ గ్రామానికి చెందిన సంగబత్తుల రంగారెడ్డి అనే ఇద్దరు రైతులు 1983లో కొన్నారు. వీరిలో రవీందర్‌రెడ్డి 2.04 ఎకరాలు, రంగారెడ్డి కుమారుడు లక్ష్మీకాంతరెడ్డి పేరిట 2.04 ఎకరాలను రిజిస్ట్రేషన్ చేసుకొన్నారు. 2011లో వీరికి పట్టాదారు పాస్‌పుస్తకాలు కూడా వచ్చాయి. రవీందర్‌రెడ్డి లక్ష్మీకాంతరెడ్డికి బావమరిది. ఇంత వరకు బాగానే ఉన్నది. రవీందర్‌రెడ్డి హన్మకొండలోనే ఉంటూ తరచూ భూమిని చూసుకొంటూ ఉండటంతో ఆయన భూమి జోలికి ఎవరూ రాలేదు. లక్ష్మీకాంతరెడ్డి ఖమ్మంలో ఉంటుండటంతో మోఖా మీదకు ఏడాదికి ఒక సారైనా రాలేదు. దీంతో భూ మాఫియా లక్ష్మీకాంతరెడ్డి భూమికి స్కెచ్‌వేసింది. మాఫియా ముఠాకు చెందిన సభ్యులు లక్ష్మీకాంతరెడ్డి స్వగ్రామమైన ఖమ్మం జిల్లా సుబ్లెడ్‌కు వెళ్లి వారి వివరాలను సేకరించారు. లక్ష్మీకాంతరెడ్డి తండ్రి రంగారెడ్డి.. స్వాతంత్య్ర సమరయోధుడే కాకుండా.. ఆ గ్రామానికి తొలి సర్పంచ్‌గా కూడా పనిచేశారు. 1988లో చనిపోయారు. తాము ఎల్‌ఐసీ నుంచి వచ్చినట్టు చెప్పి రంగారెడ్డికి సంబంధించిన వివరాలన్నీ తెలుసుకొన్నారు. ఆయన సమీపబంధువు సుమన్‌రెడ్డిని కలిసి వారి భూ వివరాలు సేకరించారు. ఆ తర్వాత భూ మాఫియా దొంగ డాక్యుమెంట్లు సృష్టించింది. 1986లోనే.. రంగారెడ్డి (చనిపోవడానికి రెండేండ్ల ముందుగానే), ఆయన కుమారుడు లక్ష్మీకాంతరెడ్డి భూమిని అమ్మినట్టు పత్రాలు రాశారు. రంగారెడ్డి గొలుసుకట్టు రాత రాసేవారు. అచ్చంగా అలాగే రంగారెడ్డి సంతకాన్ని ఫోర్జరీచేశారు. లక్ష్మీకాంతరెడ్డి గ్రాడ్యుయేట్. ఆయన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు చదువు రానట్టు భావించి ఆయన సంతకాన్ని తెలుగులో తప్పుగా రాస్తూ సంతకంచేశారు. ఈ డాక్యుమెంట్లతో లక్ష్మీకాంతరెడ్డికి చెందిన 2.04 ఎకరాల భూమిని జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం ఉప్పుగల్ గ్రామానికి చెందిన కర్ర రంగారెడ్డికి అమ్మినట్టు రికార్డులు సృష్టించారు. సదరు భూమిని కర్ర రంగారెడ్డి తన వారసుడు కర్ర తిరుపతిరెడ్డికి 2018లో గిఫ్ట్ డీడ్‌చేశారు. తిరుపతిరెడ్డి తన పేరిట భూమి రిజిస్ట్రేషన్ అయిన తర్వాత దాన్ని అమ్మేయాలని ప్రయత్నించారు. ఈ క్రమంలో భూమికి సంబంధించిన పత్రాలు లక్ష్మీకాంతరెడ్డి బావమరిది సంకెపల్లి రవీందర్‌రెడ్డి వద్దకు వచ్చాయి. ఆ పత్రాలను చూసి అవాక్కయిన రవీందర్‌రెడ్డి తన బావకు సమాచారం ఇవ్వడంతో లక్ష్మీకాంతరెడ్డి హసన్‌పర్తి తాసిల్ కార్యాలయంలో ఫిర్యాదుచేశారు. హసన్‌పర్తి మండలం దేవన్నపేటలోని సర్వే నంబర్ 360/ఏ/3 పేరుతో 2011 ఆగస్టు 20న తనకు పట్టాదారు పాస్‌పుస్తకం ఇచ్చారని చూపించారు. ఫోర్జరీ సంతకాలతో తప్పుడు పత్రాలను తీసుకొచ్చిన కర్ర తిరుపతిరెడ్డికి పట్టా చేయవద్దని ఫిర్యాదుచేశారు. దీంతో హసన్‌పర్తి తాసిల్దార్ కర్ర తిరుపతిరెడ్డికి పట్టాచేయకుండా నిలిపేశారు.

### కలెక్టర్, సీపీలకు ఫిర్యాదు

హసన్‌పర్తి మండలం దేవన్నపేటలో సర్వే నంబర్ 360/ఏ/3లోని 2.04 ఎకరాల భూమిని జనగామ జఫర్‌గఢ్ మండలం ఉప్పుగల్ గ్రామానికి చెందిన కర్ర తిరుపతిరెడ్డి ఫోర్జరీ సంతకాలతో తమ పట్టా భూమిని కబ్జా చేశారంటూ వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్‌కు, అదే విధంగా వరంగల్ పోలీస్ కమిషనర్ డాక్టర్ రవీందర్‌కు ఫిర్యాదుచేశారు. వెంటనే పోలీస్ కమిషనర్ కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ సీఐకి సమాచారం ఇచ్చి కేసును దర్యాప్తుచేసి బాధితుడికి న్యాయంచేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఫోర్జరీ పత్రాలు సృష్టించి వాటిద్వారా అక్రమంగా జరిగిన రిజిస్ట్రేషన్‌ను రద్దుచేసి తనకు న్యాయం చేయాల్సిందిగా లక్ష్మీకాంతరెడ్డి కోరుతున్నారు.



శుక్రవారం వరంగల్ రూరల్ జిల్లా ఆత్మకూరు మండలం కామారం గ్రామంలో రైతులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

# కామారంలో 'భూసమస్యల పరిష్కార వేదిక'

- గ్రామంలో 95 శాతం భూరికార్డుల ప్రక్షాళన పూర్తి
- పాస్‌పుస్తకాలు అందజేసిన ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

**ఆత్మకూరు:** వరంగల్ రూరల్ జిల్లా ఆత్మకూరు మండలం కామారం గ్రామంలో రెవెన్యూ అధికారులు శుక్రవారం 'భూసమస్యల పరిష్కార వేదిక'ను ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హాజరై అర్హులైన రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్నదాతల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రైతులకు బంధువు అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా తెలంగాణలో భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని చేపట్టి, రైతులందరికీ పట్టాదారు పాస్‌పుస్తకాలను అందించారని చెప్పారు. రైతులకు పెట్టుబడి సాయం కింద ఎకరానికి రూ.5 వేల చొప్పున రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. రైతులకు భూముల విషయంలో ఎలాంటి తగాదాలు లేకుండా గ్రామాల్లోనే సదస్సులను ఏర్పాటుచేసి, అర్హులైన ప్రతి రైతుకు పాస్‌పుస్తకాలను అందించారని వివరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే పరకాల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో 90 శాతం భూరికార్డుల ప్రక్షాళన పూర్తి చేశారని అన్నారు. ఇప్పటివరకు కామారం గ్రామంలో 95 శాతం భూరికార్డుల ప్రక్షాళన పూర్తి చేశారని, మిగతా 5 శాతం రికార్డుల ప్రక్షాళన మరో రెండు రోజుల్లో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎల్ కిషన్, తాసిల్దార్ సత్యానారాయణరావు పాల్గొన్నారు.

## మా మాట!

### రైతుల పాలిట వరం



ఎన్నో ఏండ్ల నుంచి రైతుల భూసమస్యలు పరిష్కారం కాకుండా ఉండటంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగి పోయారు. ఈ నేపథ్యంలో ధర్మగంట ద్వారా రైతుల భూసమస్యలు వెలుగులోకి తేవడంతో ఉన్నతాధికారులు స్పందించి వాటిని వెంటనే పరిష్కరిస్తున్నారు. రైతుల సమస్యలు పరిష్కారం అవుతుండటంతో ఎంతో సంతోషంగా ఉన్నారు. 'ధర్మగంట' రైతుల పాలిట వరం.

- గోగిరెడ్డి వెంకట్‌రెడ్డి, సోలిపేట, సూర్యాపేట

### అవినీతిని అంతం చేయాలి



రెవెన్యూశాఖలో పేరుకుపోయిన అవినీతిని అంతమొందించేందుకు ఆ శాఖను ప్రక్షాలన చేయాలి. ఈ ప్రక్షాలన ద్వారా ఎండ్లతరబడి పేరుకుపోయిన సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే చట్టాలను మారుస్తూ ప్రజలకు మేలు చేస్తున్న సీఎం కేసీఆర్, రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టడం శుభపరిణామం. దీంతోపాటు 'నమస్తే తెలంగాణ' ధర్మగంట ద్వారా రైతుల భూసమస్యలు వెలుగులోకి తెచ్చి వాటి పరిష్కారానికి చేస్తున్న కృషి అభినందనీయం. 'ధర్మగంట'ను నిర్వహిస్తున్న పత్రిక యాజమాన్యానికి, రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన చేపడుతున్న సీఎం కేసీఆర్‌కు రైతులు రుణపడి ఉంటారు.

-కొడిదెల శ్రీనివాస్‌రెడ్డి, కేటీఅన్నారం, సూర్యాపేట

# తల్లి భూమి.. పాలోళ్ల పాలు

- పహాణీలో పేరు ఉన్నా పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన భువనగిరి జిల్లా రేణికుంట బాధితురాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం రేణికుంట గ్రామంలోని సర్వే నంబర్ 347/ అలో, ఖాతా నంబర్ 112తో బర్ల కాశమ్మకు 1.14 ఎకరాల భూమి ఉన్నది. 2013లో ఆమె చనిపోయారు. చట్టప్రకారం ఆ భూమి కాశమ్మ ఏకైక సంతానం శివకుమారికి చెందాలి. కానీ కాశమ్మ మరణానంతరం భూరికార్డుల్లో మార్పులు జరిగాయి. కాశమ్మ పేరుతో 2013-14 దాకా పహాణీలు ఉండగా, అనంతరం పహాణీ మారిపోయింది. కాశమ్మ కుమార్తెకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే సర్వే నంబర్ 347/అను నాలుగు సర్వే నంబర్లుగా విభజించి.. నలుగురు పాలోళ్లకు పంచిపెట్టారు. ఈ విషయం ఆలస్యంగా గ్రహించిన శివకుమారి.. రెవెన్యూ అధికారులను ప్రశ్నిస్తే ఎవరూ జవాబివ్వలేదు. తాసిల్ కార్యాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న శివాజీకి కొంత డబ్బు ముట్టజెప్పి 2000-2014 వరకు పహాణీలను సంపాదించారు. ఈ పహాణీలను చూపించి వీఆర్వో నర్సింహను కలిసి న్యాయంచేయమని అభ్యర్థించగా, తనకు సంబంధం లేదని చెప్పారు. తాసిల్దార్‌కు చెప్పినా ఫలితంలేకపోవడంతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. అయినా న్యాయం జరుగకపోవడంతో చివరకు 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

### నాకు సంబంధం లేదు

నేను ఉన్నప్పుడు ఈ భూమికి సంబంధించిన రికార్డుల్లో మార్పులు జరుగలేదు. అంతకుముందు నుంచి ఈ సమస్య ఉన్నది. పహాణీలు కావాలని అడిగితే సెక్షన్ ఆఫీసర్ శివాజీని కలువమని చెప్పాను. డబ్బులు తీసుకున్న విషయం నాకు తెలియదు.

- నర్సింహ, వీఆర్వో



### భూమి లేకుండా చేశారు

మా అమ్మ పేరిట ఉన్న 1.14 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారుల ప్రమేయంతో దూరపు చుట్టాలు సొంతంచేసుకొన్నారు. పహాణీలు పరిశీలించకుండా రికార్డుల్లో పేర్లు మారిపోయాయి. మా అమ్మకు నేనొక్కదాన్నే వారసురాలిని. అలాంటిది భూమి నాకు కాకుండా వేరే వారికి ఎలా చెందుతుంది. వీఆర్వో చేసిన నిర్వాకం వల్ల నష్టపోతున్నా. నాకు ఎలాంటి ఆధారం లేదు. తాసిల్ కార్యాలయంలోని అధికారి శివాజీకి విడుతలుగా రూ.5,000 దాకా ఇచ్చాను. దయచేసి నా భూమి ఇప్పించండి.

- బిజ్జా శివకుమారి, బాధితురాలు

# భూమిని సాగుచేసుకోనివ్వడంలేదు

- పెద్దపల్లి కలెక్టర్ కార్యాలయం ఎదుట పురుగులమందు డబ్బాతో బాధితుల నిరసన
- న్యాయంచేయాలని కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేత



శుక్రవారం పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట పురుగులమందు డబ్బాతో నిరసన తెలుపుతున్న షేక్ అహ్మద్ కుటుంబం



పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన ఇందిర

**పెద్దపల్లి కలెక్టరేట్:** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కన్నాల శివారులో ఉన్న తమ భూమిని సాగు చేసుకోనివ్వకుండా వీఆర్‌ఏ అడ్డుకుంటూ ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన షేక్ అహ్మద్, షెబియా దంపతులు శుక్రవారం పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట పురుగులమందు డబ్బాతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 395/3/1లోని రెండెకరాలను 40 ఏండ్లుగా సాగుచేసుకొంటూ జీవిస్తున్నామని చెప్పారు. ఆ భూమికి సంబంధించి తమకు పట్టాదారు పాస్‌పుస్తకం కూడా ఉన్నదని, రైతుబంధు సాయం అందుతున్నదని పేర్కొన్నారు. అయినప్పటికీ తమ భూమిని కబ్జాచేయాలన్న కుట్రతో వీఆర్‌ఏ.. వీఆర్వోతో కలిసి తమను బెదిరింపులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. అలాగే, కన్నాల గ్రామానికే చెందిన ఇందిర అనే దివ్యాంగురాలు సైతం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం ఎదుట నిరసనకు దిగారు. తనకు ప్రభుత్వం వికలాంగుల కోటాలో సర్వే నంబర్ 561లో ఎకరం భూమిని కేటాయించిందని చెప్పారు. సదరు భూమిని తాను సాగుచేసుకొంటుండగా, గ్రామానికే చెందిన కొంత మంది కబ్జాచేసేందుకు ప్రయత్నిస్తూ బెదిరింపులకు దిగుతున్నారని వాపోయారు. అనంతరం బాధితులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వేర్వేరుగా కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్‌కు వినతిపత్రాలు అందజేశారు.

## 23 గుంటల భూమి మాయం

- 'ధర్మగంట'ను ఆశ్రయించిన ఖమ్మం జిల్లావాసి



**నేలకొండపల్లి:** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని రాజేశ్వరపురం గ్రామానికి చెందిన వడ్లమూడి వీరయ్యకు గతంలో బలవతా ఇనాం ద్వారా 20 గుంటల భూమి వచ్చింది. దానికితోడు మరో 20 గుంటల భూమిని కొన్నారు. వీరయ్య చనిపోవడంతో ఆయన కుమారుడు రాములు ఆ భూమిని సాగుచేసేవారు. మూడేండ్ల కింద రాములు చనిపోవడంతో అప్పటినుంచి అతని భార్య పున్నమ్మ ఆ భూమిని సాగుచేసుకొంటూ జీవిస్తున్నారు. భూరికార్డుల ప్రక్షాళన సమయంలో సాదాబైనామా కింద పాస్‌పుస్తకం కోసం దరఖాస్తుచేసుకొన్నారు. అయితే ఆమెకు ఉన్న ఎకరా భూమికిగాను పాస్‌పుస్తకంలో 17 గుంటలు మాత్రమే నమోదైంది. దీంతో మొదటి విడుత రైతుబంధు సాయం రూ.1,700 మాత్రమే వచ్చింది. బాధితురాలు మిగిలిన 23 గుంటల భూమిని పాస్‌పుస్తకంలో ఎక్కించాలని ఏడాదిగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. వీఆర్వో మాత్రం అంతే భూమి ఉన్నదని, మిగిలిన భూమి కోసం సర్వే చేయాలని చెప్తున్నారని బాధితురాలు పున్నమ్మ పేర్కొన్నారు. ఇటీవల ఆమె ఆన్‌లైన్ పహాణీని తీసుకోగా అందులో 17 గుంటల భూమికి మరో రెండు గుంటలు మాత్రమే చేరినట్టు చూపిస్తున్నది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేసేలా చూడాలని బాధితురాలు 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

# పహాణీ మార్చేశారు

కబ్జాదారుడికి రెవెన్యూ వత్తాసు ■ రైతును తిప్పలు పెడుతున్న అధికారులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సూర్యాపేట జిల్లా ఫణిగిరి శివారు చెన్నపురం గ్రామంలో ఇంద్రమ్మ అనే మహిళా రైతు దుమ్మాల విద్యాసాగర్ వద్ద సర్వే నంబర్ 12లో 2.12 ఎకరాల భూమిని 1997లో కొన్నారు. అప్పటి నుంచి ఇంద్రమ్మే కాస్తులో ఉన్నారు. కొన్నేండ్ల తర్వాత పస్తాల గ్రామానికి చెందిన కడారి వీరాస్వామి.. ఇంద్రమ్మ భూమిని కౌలుకు తీసుకొన్నాడు. 2013లో ఆ భూమిని కొన్నట్టు వీరాస్వామి సాదాబైనామాను సృష్టించాడు. వీఆర్వోతోపాటు ఇతర రెవెన్యూ అధికారులకు డబ్బులిచ్చి పహాణీలో పేరు మార్పించుకొన్నాడు. రెవెన్యూ అధికారులు కూడా రికార్డులను పరిశీలించకుండా కాసులకు కక్కుర్తిపడి పహాణీలో వీరాస్వామి పేరు ఎక్కించి, కబ్జా కాలమ్‌లో అతని పేరు రాశారు. ఇదేమని ప్రశ్నిస్తే పొజిషన్‌లో ఎవరుంటే వారిదే భూమి అంటూ డిప్యూటీ తాసిల్దార్ బాధితురాలిని బెదిరిస్తున్నారు. తన భూమిని ఎవరికీ అమ్మలేదని అధికారులకు చెప్తే.. పొజిషన్ తీసుకోవాలని చెప్తున్నారని బాధిత రైతు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు వీఆర్వో మాత్రం వీరాస్వామికి చెందిన ప్రొసీడింగ్‌ను 11 బీ స్థాయిలోనే రద్దుచేశామని చెప్తున్నారు. కానీ పహాణీ అనుభవదారు కాలమ్‌లో కబ్జాదారుడి పేరు కనిపించడం అనుమానాలకు తావిస్తున్నది. ఈ పరిస్థితిని ఆసరా చేసుకొని కబ్జాదారుడు మహిళారైతును బెదిరిస్తున్నాడు. భూమిపైకి రాకుండా అడ్డుకొంటున్నాడు. ఉన్నతాధికారులు చొరవతీసుకొని కబ్జాదారుడి పేరిట ఉన్న అక్రమ ప్రొసీడింగ్ రద్దుచేసి, తనకు పట్టాదారు పాస్‌పుస్తకాన్ని జారీచేయాలని బాధితురాలు ఇంద్రమ్మ కోరుతున్నారు.



బాధిత మహిళారైతు ఇంద్రమ్మ

# మాజీ సైనికుల కోటా లేదా?

- మహిళా జవానుకు తప్పని తిప్పలు
- భూమి చూపించి ప్రొసీడింగ్ ఆపిన రెవెన్యూ సిబ్బంది
- ఏడేండ్లుగా తిరుగుతున్నా పట్టించుకోని మహబూబాబాద్ అధికారులు
- సీఆర్పీఎఫ్ జవానుగా 23 ఏండ్లు సేవచేసిన మహిళారైతు చిన్న

**మహబూబాబాద్, నమస్తే తెలంగాణ:** సీఆర్పీఎఫ్ జవానుగా 23 ఏండ్లపాటు దేశానికి సేవలందించిన తనకు ప్రభుత్వ భూమి ఇవ్వాలని వేడుకొన్నా అధికారులు పట్టించుకోవడంలేదని మాజీ మహిళా జవాను బానోతు చిన్న వాపోతున్నారు. సీఆర్పీఎఫ్‌లో జవానుగా విధులు నిర్వహిస్తున్న సమయంలోనే (2010) తనకు ప్రభుత్వ భూమి కేటాయించి ఆదుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్ వాకాటి కరుణకు దరఖాస్తు చేసుకొన్నానని.. కలెక్టర్ ఆదేశాలతో అదే ఏడాది మహబూబాబాద్ మండలం అనంతారం గ్రామ శివారులోని సర్వే నంబర్ 163లో ఐదెకరాల భూమిని సర్వే చేశారని.. కానీ ప్రొసీడింగ్ ఇవ్వకుండా నిలిపివేశారని బానోతు చిన్న తెలిపారు. కొన్నాళ్ల తర్వాత 2013లో అప్పటివరకు సర్వే చేసిన భూమిని ఇవ్వడంలేదని, మరోచోట చూపిస్తామంటూ మహబూబాబాద్ శివారు జంగిలిగొండ క్రాస్ రోడ్డు వద్ద 82/1 సర్వే నంబర్‌లో రెండెకరాల స్థలాన్ని నిర్ణయించారన్నారు. కానీ అప్పటి తాసిల్దార్ ప్రొసీడింగ్ ఇవ్వకుండా నిలిపివేసినట్టు చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని బాధితురాలు ఆవేదన వ్యక్తంచేశారు. ఒక ఎక్స్‌సర్వీస్ ఉమెన్‌గా ప్రభుత్వం ఆదుకుంటుందని ఏడేండ్లుగా తాసిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నానన్నారు. 2016లో సర్వీసు పూర్తిచేసి రిటైర్ అయ్యానని, తనను ఆదుకోవాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌కు విన్నవించగా 'గతంలో ఉన్న జీవో ప్రకారం పనిచేయడం లేదు. ఇప్పుడు అలాంటి జీవోలు లేవు' అంటూ తాసిల్ కార్యాలయానికి, తనకు మెమో ఇచ్చారని పేర్కొన్నారు. దేశ రక్షణ కోసం 23 ఏండ్లు సీఆర్పీఎఫ్‌లో పనిచేసిన మహిళకు జీవించడానికి ఉపాధి అవకాశమైనా ఇవ్వరా అని చిన్న ఆవేదన వ్యక్తంచేశారు.



సీఆర్పీఎఫ్ ఎక్స్ సర్వీస్ ఉమెన్ బానోతు చిన్న

### మాకు ఎలాంటి జీవోలు లేవు



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు 1962లో ఇండియా- చైనా యుద్ధంలో మరణించిన వారి పిల్లలను, కుటుంబసభ్యులను ఆదుకొనే అవకాశం ఉన్నది. తెలంగాణ ప్రభుత్వంలో ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద ఇవ్వడానికి వీలులేదు కాబట్టి ఇవ్వలేం. గత అధికారులు చూపించారు. కానీ ఎవరూ ప్రొసీడింగ్ వరకు వెళ్లలేదు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఎలాంటి ఆధారాలు లేకుండా ఇవ్వలేమని మెమో జారీచేశారు.

- రంజిత్‌కుమార్, మహబూబాబాద్ తాసిల్దార్

# పట్టాకు నాలుగేండ్లు చాలవా!

- వారసత్వ భూమికి పాస్‌పుస్తకం ఇవ్వట్లేదు
- తొమ్మిదిసార్లు అర్జీలిచ్చినా పట్టించుకోని అధికారులు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన భూపాలపల్లి జిల్లా బాధితుడు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'నా పేరు దాస్యం వెంకటనర్సింగయ్య. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగు ఘన్‌పూర్ మండలం మైలారంలోని సర్వే నంబర్ 133/అలో మా నాయనమ్మ ధాస్యం కుముదమ్మకు 2.20 ఎకరాల భూమి ఉండేది. ఇందులో ఎకరం భూమిని తన అవసరాలకు అమ్ముకొన్నారు. మిగతా 1.20 ఎకరాల భూమిని నాకు బహుమతిగా రెవెన్యూ స్టాంప్ పేపర్ మీద రాసి ఇచ్చారు. ఇందులో మా నాయనమ్మతోపాటు ఊరి పెద్దలు సంతకాలుచేశారు. 2015లో ఆమె చనిపోయారు. భూమి రాసిచ్చినప్పటి నుంచి రెవెన్యూ రికార్డుల్లో నా పేరిట ఆస్తి మార్పుచేయాలని కోరుతున్నాను. ఆర్‌ఐ, వీఆర్వో గ్రామానికి వచ్చి పూర్తి విచారణచేసి భూమి నాకే చెందుతుందని నిర్ణయించారు. నాలుగేండ్ల కిందటే పహాణీలో నా పేరు ఎక్కించారు. కానీ 1-బీ, కొత్త పాస్‌పుస్తకం మాత్రం ఇవ్వటం లేదు. భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా నాకు కొత్త పాస్‌పుస్తకం ఇవ్వాలని కోరినా స్పందించలేదు. ఈ నాలుగేండ్లలో ముగ్గురు తాసిల్దార్లు మారారు. వారందరికీ భూమి పత్రాలను సమర్పించి, నా పేరిట పాస్‌పుస్తకం ఇవ్వాలని విన్నవించాను. చూస్తాం.. చేస్తాం అంటున్నారే తప్ప ఏ ఒక్కరూ పనిచేయడం లేదు. భూమి సాగు చేసుకొంటున్నా పట్టా ఇవ్వకపోవడంతో రైతుబంధు కోల్పోయాను. బ్యాంకు నుంచి రుణం కూడా పొందలేకపోతున్నాను. కాస్తులో ఉన్నా.. రెవెన్యూ అధికారులు విచారణ జరిపి పహాణీలో పేరు ఎక్కించినా.. పాస్‌పుస్తకం ఇవ్వడానికి నాలుగేండ్లుగా తిప్పించుకొంటున్నారు. ప్రతినెలా రెవెన్యూ అధికారులను కలుస్తున్నాను. తాసిల్దార్లకు అన్ని పత్రాలు సమర్పించి, తొమ్మిదిసార్లు వినతి పత్రాలు ఇచ్చి వేడుకొన్నాను. 'ఆర్డీవో ఆఫీసుకు పంపాను.. అక్కడి నుంచి వచ్చాక పాస్‌పుస్తకం ఇస్తాను' అని చెప్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి నాకు న్యాయం చేయాలని కోరుతున్నాను.'



దాస్యం వెంకటనర్సింగయ్య

### సమస్యను పరిష్కరిస్తా

బాధితుడు దాస్యం వెంకటనర్సింగయ్య నన్ను రెండుమూడు సార్లు కలిశారు. ప్రస్తుతం గ్రామంలో కొత్త వీఆర్వో వచ్చారు. విషయం పూర్తిగా తెలుసుకొని సమస్యను త్వరగా పరిష్కరిస్తాను.

- దేవులపల్లి సమ్మయ్య, ములుగు ఘన్‌పూర్ తాసిల్దార్

నమస్తే తెలంగాణ
# ఆట
10
[ కరీంనగర్ ]
శనివారం 3 ఆగస్టు 2019
WWW.NTNEWS.COM

**పీకేఎల్‌లో నేడు**
పాట్నా X జైపూర్ -7.30గం.
బెంగాల్ X బెంగళూరు -8.30గం.
స్టార్ స్పోర్ట్స్‌లో

## సెమీస్‌లో రాంకీరెడ్డి, చిరాగ్ జోడీ



**బ్యాంకాక్:** థాయ్‌లాండ్ బ్యాడ్మింటన్ ఓపెన్‌లో భారత ద్వయం సాత్విక్ సాయిరాజ్ రాంకీరెడ్డి, చిరాగ్ శెట్టి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో సాత్విక్, శెట్టి జోడీ 21-17, 17-21, 21-19 తేడాతో చోయి సోల్గ్యు, సియో సెంగ్ జైపై విజయం సాధించింది. సరిగ్గా గంటపాటు జరిగిన పోరులో సాత్విక్, చిరాగ్ అద్భుత పోరాటపటిమ ప్రదర్శించారు. ఈ కొరియా జోడీపై గెలువడం భారత ద్వయానికి ఇదే తొలిసారి. శనివారం జరిగే సెమీస్‌లో మరో కొరియా జంట కోసంగ్ హ్యున్, షిన్‌బాయిక్ చోయిల్‌తో సాత్విక్, చిరాగ్ తలపడుతారు. మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్స్‌లో భారత జోడీ రాంకీ రెడ్డి, అశ్విని పొన్నప్ప 13-21, 15-21తో మూడోసీడ్ జపాన్ జంట వతానబె, అరిసా హిగాషినో చేతిలో ఓడింది. మరోవైపు పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో యువ షట్లర్ సాయి ప్రణీత్ 18-21, 12-21తో కాంటా త్సునేయమా(జపాన్) చేతిలో ఓటమి పాలవ్వడంతో సింగిల్స్‌లో భారత్ పోరాటం ముగిసింది.

**సాయి ప్రణీత్ నిష్క్రమణ**
**థాయ్‌లాండ్ ఓపెన్**

## రేపటి నుంచి తెలంగాణ షూటింగ్ టోర్నీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** హైదరాబాద్ వేదికగా ఈనెల 4నుంచి తెలంగాణ షూటింగ్ టోర్నీ ప్రారంభం కాబోతున్నది. ఎయిర్, స్మాల్ బోర్, షాట్‌గన్ విభాగాలుగా జరిగే పోటీల్లో దాదాపు 1000 మంది షూటర్లు పాల్గొనే అవకాశముందని తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు అమిత్ సంఘీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో రాష్ట్రం నుంచి ఆర్మీ, పోలీస్, ఫారెస్ట్, ప్రభుత్వ మైనారిటీ పాఠశాలలు, ప్రైవేట్ స్కూళ్ల నుంచి షూటర్లు పోటీపడనున్నారు. ఈసారి 10మీటర్ల ఎయిర్ రైఫిల్/పిస్టల్, 25మీటర్ల పిస్టల్, 50మీటర్ల రైఫిల్/పిస్టల్, షాట్‌గన్ యూత్, జూనియర్, సీనియర్, వెటరన్ మహిళల, పురుషుల కేటగిరీల్లో పోటీలు జరుగుతాయి. అయితే జోనల్, ప్రి నేషనల్స్ అర్హతగా జరిగే ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే వారు ఈనెల 4వరకు తమ పేర్లను రిజిష్టర్ చేసుకోవాలని సంఘీ తెలిపారు. షూటింగ్ చాంపియన్‌షిప్ ద్వారా ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ కల్గిన యువ షూటర్లను వెలికితీయడమే తమ ముఖ్య ఉద్దేశమని ఈ సందర్భంగా సంఘీ పేర్కొన్నారు.

## నీరజ్ సంచలనం

### ప్రపంచ చాంపియన్‌ను ఓడించిన భారత బాక్సర్



**న్యూఢిల్లీ:** భారత వర్ధమాన బాక్సర్ నీరజ్.. ప్రపంచ చాంపియన్‌పై సంచలన విజయం నమోదు చేసింది. రష్యా వేదికగా జరుగుతున్న మగోమెడ్ సాలమ్ ఉమఖనోవ్ స్మారక అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో నీరజ్ అదిరిపోయే పంచ్‌లతో 2016 ప్రపంచ చాంపియన్ అలెసియా మెసినావో (ఇటాలియన్)పై గెలిచి ఫైనల్ చేరింది. మహిళల 57 కేజీల కేటగిరీ సెమీఫైనల్లో శుక్రవారం నీరజ్ 3-2తో మెసినావోను చిత్తు చేసింది. తుదిపోరుకు దూసుకెళ్లిన భారత బాక్సర్ కనీసం రజత పతకం ఖాయం చేసుకుంది. హోరాహోరీగా సాగిన పోరులో ఇరువురు బాక్సర్లు పంచ్‌ల వర్షం కురిపించుకున్నా.. కీలక సమయాల్లో పైచేయి సాధించిన నీరజ్‌నే విజయం వరించింది. ఇతర విభాగాల్లో గౌరవ్ సోలంకి (56 కేజీలు), గోవింద్ సహానీ (49 కేజీలు) సెమీఫైనల్స్ చేరి పతకాలు ఖాయం చేసుకున్నారు.

## ఏదో ఒక రోజు భారత కోచ్ అవుతా


గంగూలీ

**కోల్‌కతా:** భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ తన మనస్సులోని మాట బయటపెట్టాడు. ఏదో ఒక రోజు టీమ్‌ఇండియాకు కచ్చితంగా కోచ్ అవుతానని అన్నాడు. ప్రపంచకప్‌తో చీఫ్ కోచ్ రవిశాస్త్రితో పాటు సహాయక సిబ్బంది పదవికాలం ముగియడంతో బీసీసీఐ తాజాగా దరఖాస్తులకు ఆహ్వానించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో దాదా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. శుక్రవారం ఒక కార్యక్రమంలో పాల్గొన్న గంగూలీ మీడియాతో పలు అంశాలపై మాట్లాడాడు. 'కచ్చితంగా ఏదో ఒక రోజు భారత చీఫ్ కోచ్ పదవి కోసం పోటీపడుతా. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో మాత్రం కాదు. ఒక ఫేజ్ ముగిసిన తర్వాత కోచ్ రేసులో నేను ఉంటా. ప్రస్తుతం నేను ఐపీఎల్, క్యాబ్, టీవీ కామెంటరీ లాంటి వాటితో చాలా బిజీగా ఉన్నాను. ఇవన్నీ పూర్తి చేసిన తర్వాత కోచ్ పదవి కోసం ప్రయత్నిస్తా. ఇప్పుడు కాకపోయినా సమీప భవిష్యత్తులో పోటీకి వస్తా. రవిశాస్త్రి కొనసాగాలా వద్దా అన్నదాని గురించి నేను ఇప్పుడు మాట్లాడను. అయినా ఇది సరైన సమయం కాదు. ప్రస్తుతం కోచ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అంత ప్రముఖ క్రికెటర్లు ఎవరూ లేరు. క్రికెట్ సలహాదారుల కమిటీ(సీఏసీ) కోచ్ ఎంపికపై తుది నిర్ణయం తీసుకుంటుంది. పదవీ కాలం ఎంత ఇస్తారన్నది ఇంకా తెలియాల్సి ఉంది. రానున్న వెస్టిండీస్ సిరీస్ చాలా కీలకమైంది. సొంతగడ్డపై వారిని ఎదుర్కొవడం ఒకింత కష్టమే' అని గంగూలీ అన్నాడు.

## ఏడేండ్ల తర్వాత దక్కిన కాంస్యం



**న్యూఢిల్లీ:** ఏడేండ్ల తర్వాత భారత్‌కు అదృష్టం తలుపు తట్టింది. రష్యా వేదికగా 2012లో జరిగిన ఐఏఏఎఫ్ ప్రపంచ రేస్ వాకింగ్ కప్‌లో రెండో స్థానంలో నిలిచిన ఉక్రెయిన్ జట్టు డోపింగ్‌లో దొరికింది. బయోలాజికల్ పాస్‌పోర్ట్ అనాలసిస్ ద్వారా రేస్ వాకర్ రుస్లాన్ డిమిత్రెంకో డోపింగ్‌లో దోషిగా తేలడంతో ఉక్రెయిన్ జట్టును తప్పించారు. దీంతో నాలుగో స్థానానికి పరిమితమైన కేటీ ఇర్ఫాన్, బాహుబాయి పనుచా, సురిందర్ సింగ్‌తో కూడిన భారత జట్టును శుక్రవారం కాంస్య పతకానికి అప్‌గ్రేడ్ చేశారు. ఏడేండ్ల క్రితం జరిగిన రేసులో చైనా, ఉక్రెయిన్, ఆస్ట్రేలియా తొలి మూడు స్థానాల్లో నిలువగా, భారత్‌కు నాలుగో స్థానం దక్కింది. కాంస్యం లభించిన విషయాన్ని భారత అథ్లెటిక్స్ సమాఖ్య శుక్రవారం తమ అధికారిక ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది.

# భారత్ X వెస్టిండీస్
# @అమెరికా

**నేడు భారత్, వెస్టిండీస్ మధ్య తొలి టీ20**
**అందరి దృష్టి కోహ్లీ, రోహిత్‌పైనే**
**రాత్రి 8 నుంచి సోనీ టెన్ - 1, 3ల్లో**





వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌కు ముందు భారత జట్టు చుట్టూ మూగుతున్న వార్తలివి. క్రికెట్ గురించి కాకుండా ఆటేతర అంశాలే ఎక్కువగా చర్చకు వస్తున్న ప్రస్తుత తరుణంలో.. వీటన్నింటికీ ఫుల్‌స్టాప్ పడాలంటే.. టీమ్‌ఇండియా గ్రౌండ్‌లో సత్తా చాటాలి. ఆటగాళ్ల ప్రదర్శనపై అందరి దృష్టి నిలువాలంటే అసమాన రీతిలో పోరాడాలి. వచ్చే ఏడాది జరుగనున్న టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని సీనియర్ ప్లేయర్లను పక్కన పెడుతూ.. కొత్త బృందాన్ని తీర్చిదిద్దాలనుకుంటున్న టీమ్ మేనేజ్‌మెంట్‌కు ఇదే తొలి పరీక్ష. పొట్టి క్రికెట్‌లో అరవీర భయంకరులుగా పేరున్న కరీబియన్లను అమెరికా వేదికగా కోహ్లీ అండ్ కో ఢీకొట్టేందుకు రెడీ అయింది.

**ఎన్నో అంచనాల మధ్య బరిలో దిగిన వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లో ఓటమి..**
**కెప్టెన్ కోహ్లీ, వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ మధ్య విభేదాలు..!**
**వీడ్కోలు పలుకుతాడని భావించిన ధోనీ ఆటకు బ్రేక్ ఇచ్చి సైన్యంలో సేవలు..**
**కొత్త కోచ్‌గా ఎవరు ఎంపికవుతారనే ఉత్కంఠ..**
**ప్రస్తుత కోచ్ రవిశాస్త్రికి బాహాటంగానే మద్దతిచ్చిన విరాట్..**
**సెలక్షన్ ప్రక్రియలో సారథి ఆడిందే ఆట పాడిందె పాటగా మారిందన్న గవాస్కర్..**
**మాపై ఎలాంటి ఒత్తిడి లేదంటున్న క్రికెట్ సలహాదారుల కమిటీ..**
**మా ఘనతలు అనేకం అని డప్పేస్తున్న సెలక్షన్ కమిటీ..**


బ్రాత్‌వైట్

**లౌడెర్‌హిల్ (అమెరికా):** వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్ ఓటమి అనంతరం టీమ్ ఇండియా తొలిసారి మైదానంలో అడుగు పెట్టనుంది. గత నెల 9న మెగా టోర్నీ సెమీస్‌లో న్యూజిలాండ్ చేతిలో ఓడిన విరాట్ సేన శనివారం వెస్టిండీస్‌తో తొలి టీ20 మ్యాచ్ ఆడనుంది. ఈ 25 రోజుల్లో అనేక క్రికెటేతర అంశాలతో వార్తల్లో నిలిచిన ఆటగాళ్లు ఇక అవన్నీ పక్కన పెట్టి తమ పవర్ చాటేందుకు రెడీ అయ్యారు. మిడిలార్డర్ వైఫల్యం కారణంగానే వరల్డ్‌కప్ దూరమైందని భావిస్తున్న టీమ్ మేనేజ్‌మెంట్ దిద్దుబాటు చర్యలకు పూనుకున్నది. యువ ఆటగాళ్లకు ఎక్కువ అవకాశాలు కల్పించి ప్రత్యామ్నాయాలను సిద్ధం చేసుకునేందుకు రెడీ అవుతున్నది. పర్యటనకు బయలుదేరేముందు కెప్టెన్ విరాట్ కూడా ఇదే అంశాన్ని స్పష్టం చేశాడు. మరి అవకాశం దక్కించుకునే కుర్రాళ్లు ఏ మేరకు రాణిస్తారనేది వారి ప్రదర్శనపైనే ఆధారపడి ఉంది. వైస్ కెప్టెన్ రోహిత్ శర్మతో విభేదాల అంశంపై కోహ్లీ వివరణ ఇచ్చుకున్నా.. పరిస్థితి అంత సవ్యంగా ఉన్నట్లు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో వీరిద్దరి మధ్య సఖ్యత ఎలా ఉందనే అంశం కూడా ఈ సిరీస్‌తో స్పష్టం కానుంది. గాయం కారణంగా వన్డే ప్రపంచకప్ నుంచి అర్ధాంతరంగా తప్పుకున్న ఓపెనర్ శిఖర్ ధవన్ తిరిగి జట్టులో చేరడం బలాన్నిచ్చే అంశమైతే.. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా విశ్రాంతి జట్టు సమతుల్యాన్ని దెబ్బతీసే చాన్స్ ఉంది. వచ్చే ఏడాది జరుగనున్న టీ20 ప్రపంచకప్‌నకు ఇప్పటి నుంచి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలనుకుంటున్న కోహ్లీ సేన ఈ సిరీస్‌ను ప్రయోగాలు చేసేందుకు వాడుకోవాలని అనుకుంటుంటే.. వెస్టిండీస్ మాత్రం పొట్టి క్రికెట్‌లో తమ జోరేంటే 'మెన్ ఇన్ బ్లూ'కు రుచి చూపించాలనుకుంటున్నది.

### యువ సత్తాకు పరీక్ష

వన్డే ప్రపంచకప్‌లో రికార్డు స్థాయిలో ఐదు శతకాలతో అదరగొట్టిన రోహిత్ శర్మ అదే జోరు కొనసాగించాలని భావిస్తుంటే.. గాయం నుంచి కోలుకున్న శిఖర్ ధవన్ కరీబియన్లకు గబ్బర్ దెబ్బేంటో చూపెట్టాలని తహతహలాడుతున్నాడు. మూడో స్థానంలో విరాట్ బ్యాటింగ్‌కు దిగనుండగా.. నాలుగులో రాహుల్‌కే ఓటు పడే అవకాశాలున్నాయి. ఆ తర్వాత శ్రేయస్ అయ్యర్, మనీశ్ పాండే రూపంలో ఇద్దరు యువ ఆటగాళ్లు మిడిలార్డర్ బాధ్యత మోయనున్నారు. వీరిద్దరిని ఒకే మ్యాచ్‌లో బరిలో దించుతారా లేక ఒక్కొక్కరని పరీక్షిస్తారా చూడాల్సిఉంది. ధోనీ గైర్హాజరీలో మూడు ఫార్మాట్లకు ఎంపికైన యువ కెరటం రిషబ్ పంత్‌పై అదనపు బాధ్యతలు పడనున్నాయి. పర్యటన మొత్తానికి తొలి ప్రాధాన్య కీపర్‌గా ఎంపికైన పంత్ మరి ఏమేరకు రాణిస్తాడో? బౌలింగ్‌లో సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌తో కలిసి నవదీప్ సైనీ, దీపక్ చాహర్, ఖలీల్ అహ్మద్‌లో ఎవరు చాన్స్ దక్కించుకుంటారో చూడాలి. ఆల్‌రౌండర్ల విభాగంలో రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, కృనాల్ పాండ్యాల్లో జడేజా వైపే మొగ్గుచూపొచ్చు. మణికట్టు ద్వయం గైర్హాజరీలో రాహుల్ చాహర్ అరంగేట్రం చేసే చాన్స్ ఉంది.

### పొలార్డ్, నరైన్ రాక

పొట్టి ఫార్మాట్‌లో గట్టి ప్రత్యర్థులైన కరీబియన్లను చిత్తు చేయాలంటే యువ భారత్ శక్తి మేర పోరాడాల్సిందే. సీనియర్ ప్లేయర్లు కీరన్ పొలార్డ్, సునీల్ నరైన్ రాకతో మరింత పటిష్ఠంగా మారిన విండీస్‌ను మనవాళ్లు ఎలా అడ్డుకుంటారనేది ఆసక్తికరం. దాదాపు రెండేళ్ల తర్వాత జాతీయ జట్టు తరఫున బరిలో దిగనున్న నరైన్‌పై అందరి దృష్టి ఉండనుంది. ఇటీవల వన్డే వరల్డ్‌కప్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన విండీస్ తమకు అచ్చొచ్చిన ఫార్మాట్‌లోనైనా దుమ్మురేపాలని ఆశపడుతున్నది. టీమ్‌ఇండియాకు గట్టి పోటీ తప్పదని ఇప్పటికే ఆ జట్టు కోచ్ రైఫర్ హెచ్చరించిన నేపథ్యంలో భారత్ ఎలాంటి వ్యూహాలు అనుసరిస్తుందనేది ప్రాధాన్యం సంతరించుకుంది.

### కోహ్లీ.. రోహిత్ ఎక్కడా..?

ఇప్పుడిప్పుడే మానుతున్న పుండు మీద విరాట్ కోహ్లీ మరోసారి కారం చల్లే ప్రయత్నం చేశాడు. విండీస్ పర్యటనకు బయలుదేరే ముందు వైస్ కెప్టెన్ రోహిత్ శర్మతో ఎలాంటి విభేదాలు లేవని తేల్చేసిన కెప్టెన్.. తాజాగా సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసిన ఫొటో మళ్లీ అగ్నికి ఆజ్యం పోసింది. టీ20 సిరీస్ ప్రారంభానికి ముందు జట్టు సభ్యులతో కలిసి దిగిన రెండు ఫొటోలను కోహ్లీ సోషల్ మీడియాలో షేర్ చేశాడు. అయితే ఆ రెండింట్లోనూ రోహిత్ శర్మ లేకపోవడం అనేక సందేహాలకు తావిస్తున్నది. జడేజా, సైనీ, ఖలీల్, అయ్యర్, కృనాల్, భువనేశ్వర్, రాహుల్‌తో కలిసి దిగిన ఫొటోను పంచుకున్న కోహ్లీ దానికి 'స్క్వాడ్ 100'అనే క్యాప్షన్ జతచేశాడు. ఇప్పటికే ప్రపంచకప్ సెమీఫైనల్లో ఓటమిని జీర్ణించుకోలేకపోతున్న అభిమానులు దొరికిందే సందని.. కెప్టెన్‌పై విమర్శలు గుప్పిస్తున్నారు. 'రోహిత్ శర్మ లేకుండా టీమ్ ఎలా పరిపూర్ణమవుతుందంటూ' ట్రోలింగ్ మొదలెట్టారు. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో విరాట్, అనుష్కలను రోహిత్ అనుసరించడం మానేయడంతో పాటు.. మైదానంలోకి వస్తున్న ఫొటోను షేర్ చేస్తూ 'నేను జట్టు కోసం బరిలోకి దిగను.. దేశం కోసం ఆడతాను'అని పేర్కొన్నాడు. ఈ వ్యాఖ్యలకు బదులుగానే రోహిత్ లేకుండా కోహ్లీ టీమ్ ఫొటోను పెట్టడాన్ని అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మీడియా సమావేశంలో పైపైన అంతా బాగుందని చెప్పిన కోహ్లీ ఉద్దేశపూర్వకంగానే రోహిత్ శర్మను పక్కన పెడుతున్నాడని ఆరోపిస్తున్నారు.

### వెస్టిండీస్ టూర్ షెడ్యూల్

| మ్యాచ్ | వేదిక | తేదీ |
|---|---|---|
| తొలి టీ20 | ఆగస్టు 3 | ఫ్లోరిడా |
| రెండో టీ20 | ఆగస్టు 4 | ఫ్లోరిడా |
| మూడో టీ20 | ఆగస్టు6 | గయానా |
| మొదటి వన్డే | ఆగస్టు 8 | గయానా |
| రెండో వన్డే | ఆగస్టు 11 | ట్రినిడాడ్ |
| మూడో వన్డే | ఆగస్టు 14 | ట్రినిడాడ్ |
| తొలి టెస్టు | ఆగస్టు 22-26 | అంటిగ్వా |
| రెండో టెస్టు | ఆగస్టు 30- సెప్టెంబర్ 3 | జమైకా |

### మరో నాలుగు సిక్సర్లే..

టీమ్‌ఇండియా ఓపెనర్ రోహిత్ శర్మ అరుదైన రికార్డుకు అడుగుదూరంలో నిలిచాడు. వెస్టిండీస్‌తో నేటి నుంచి ప్రారంభం కానున్న మూడు టీ20ల సిరీస్‌లో రోహిత్ నాలుగు సిక్సర్లు బాదితే అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాడిగా రికార్డుల్లోకెక్కనున్నాడు. హిట్‌మ్యాన్ ప్రస్తుతం 102 సిక్సర్లతో మూడోస్థానంలో ఉండగా.. విండీస్ విధ్వంసక వీరుడు క్రిస్‌గేల్ (105), న్యూజిలాండ్ ఓపెనర్ మార్టిన్ గప్టిల్ (103) తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నారు. ప్రస్తుత సిరీస్‌కు గేల్ అందుబాటులో లేకపోవడంతో రోహిత్ ఈ రికార్డును అలవోకగా అధిగమించే అవకాశాలు ఉన్నాయి.

**2** పొట్టి ఫార్మాట్‌లో ఎవిన్ లూయిస్ బాదిన రెండు సెంచరీలు భారత్‌పైనే కావడం విశేషం.

### తుది జట్లు (అంచనా)

**భారత్:** రోహిత్, ధవన్, కోహ్లీ (కెప్టెన్), రాహుల్, పాండే/అయ్యర్, పంత్ (వికెట్ కీపర్), జడేజా, దీపక్/సైనీ, భువనేశ్వర్, ఖలీల్, రాహుల్ చహర్.

**వెస్టిండీస్:** క్యాంప్‌బెల్, లూయిస్, పూరన్, హెట్‌మైర్, పొలార్డ్, పావెల్, బ్రాత్‌వైట్ (కెప్టెన్), నరైన్, ఖారీ, కాట్రెల్, థామస్/పాల్.

## బర్న్స్ సెంచరీ


బర్న్స్ (125*)

**ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 267 / 4**

**బర్మింగ్‌హామ్:** ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్ రసవత్తరంగా సాగుతున్నది. స్మిత్ సూపర్ సెంచరీతో పోరాడే స్కోరు అందుకున్న ఆసీస్..ఇంగ్లండ్‌ను కట్టడి చేయడంలో సఫలం కాలేకపోయింది. ఓవర్‌నైట్ స్కోరు 10/0తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ ఆట ముగిసే సరికి 4 వికెట్ల నష్టానికి 267 పరుగులు చేసింది. ఓవర్ నైట్ బ్యాట్స్‌మెన్ రోరీ బర్న్స్(281 బంతుల్లో 125 నాటౌట్, 16 ఫోర్లు) అజేయ సెంచరీతో అదరగొట్టగా, కెప్టెన్ జోరూట్(57) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. రాయ్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన బర్న్స్ ఆసీస్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొన్నాడు. అయితే 22 పరుగుల స్కోరు వద్ద రాయ్(10)ను ప్యాటిన్సన్ తొలి వికెట్‌గా పెవిలియన్ పంపాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన రూట్..బర్న్స్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను గాడిలో పడేశాడు. ఈ క్రమంలో 110 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న బర్న్స్‌కు రూట్ చక్కని సహకారమందించాడు. ఇన్నింగ్స్ కుదురుకుంటున్న తరుణంలో రూట్‌ను సిడిల్ రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్ పంపడంతో రెండో వికెట్‌కు 132 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన జో డేన్లీ(18), బట్లర్(5) బ్యాట్లు ఝులిపించడంలో విఫలమయ్యారు. వీరిద్దరు ఐదు పరుగుల తేడాతో ఔటయ్యారు. కెరీర్‌లో ఎనిమిదో టెస్ట్ ఆడుతున్న ఈ 28 ఏండ్ల ఓపెనర్ 224 బంతుల్లో తొలి సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. గత 100 టెస్ట్ ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ ఓపెనర్లు చేసిన ఐదో సెంచరీ ఇది కావడం విశేషం. చేతిలో 6 వికెట్లు ఉన్న ఇంగ్లండ్ 17 పరుగుల స్వల్ప వెనుకంజలో కొనసాగుతున్నది.

### సంక్షిప్త స్కోర్లు

**ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** 284 ఆలౌట్, **ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 267/4** (బర్న్స్ 125 నాటౌట్, రూట్ 57 నాటౌట్, ప్యాటిన్సన్ 2/54, సిడిల్ 1/43)

### జెర్సీలపై నంబర్లు హాస్యాస్పదం: బ్రెట్‌లీ



సంప్రదాయ క్రికెట్‌కు కొత్త హంగులు అద్దే క్రమంలో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) నూతనంగా ప్రవేశ పెట్టిన జెర్సీ నంబర్లపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్ తొలి టెస్టులో భాగంగా ఇంగ్లండ్, ఆస్ట్రేలియా జట్లు నంబర్లతో కూడిన జెర్సీలతో బరిలో దిగాయి. ఇవి చెత్తగా ఉన్నాయని ఇప్పటికే ఆసీస్ మాజీ వికెట్ కీపర్ గిల్‌క్రిస్ట్ అభిప్రాయపడగా.. తాజాగా ఆ దేశ మాజీ పేసర్ బ్రెట్‌లీ కూడా గిల్లీ అభిప్రాయంతో ఏకీభవించాడు. 'ఆటగాళ్ల పేర్లు, నంబర్లు జెర్సీలపై దర్శనమిస్తున్న విధానానికి నేను పూర్తి వ్యతిరేకిని. ఈ నిర్ణయం పూర్తి హాస్యాస్పదంగా ఉంది. మార్పులను ఆహ్వానించడంలో ముందుంటాం కానీ ఈ నిర్ణయం మాత్రం కచ్చితంగా సరైందైతే కాదు'అని బ్రెట్‌లీ ట్విట్టర్ ద్వారా పేర్కొన్నాడు.



గత నెలలో ఇటలీ వేదికగా జరిగిన యూరోపియన్ మాస్టర్స్ గేమ్స్ 800మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో స్వర్ణ పతకం సాధించిన రాష్ట్ర స్విమ్మర్ బండి నరేందర్. అంతర్జాతీయ మాస్టర్స్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ టోర్నీలో వెన్ పీటర్(అమెరికా), బుచర్ రాబర్ట్(రష్యా) వరుసగా రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు.

## నాటకీయ 'టై'టాన్స్

- టెక్నికల్ పాయింట్‌తో విజయానికి దూరమైన తెలుగు జట్టు
- యూపీ యోధాతో మ్యాచ్ 'డ్రా'
- ప్రొ కబడ్డీ లీగ్



**ముంబై:** ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో వరుస పరాజయాలతో సతమతమవుతున్న తెలుగు టైటాన్స్ ఎట్టకేలకు తొలిసారి ఓటమిని తప్పించుకుంది. శుక్రవారం తెలుగు టైటాన్స్, యూపీ యోధా మధ్య జరిగిన మ్యాచ్ నాటకీయ పరిణామాల మధ్య 20-20 పాయింట్లతో 'డ్రా'గా ముగిసింది. మరో 30 సెకండ్లలో మ్యాచ్ ముగుస్తుందనగా.. ఇరు జట్ల స్కోరు 19-19తో సమంగా ఉన్న సమయంలో చివరి రైడ్‌కు వెళ్లిన టైటాన్స్ స్టార్ రైడర్ సిద్ధార్థ్ దేశాయ్.. యూపీ ప్లేయర్ సుమిత్‌ను ఔట్ చేశాడు. దీంతో ఒక పాయింట్ లభించి టైటాన్స్ విజయం సాధించిందని సంబురపడే లోపే.. అంపైర్లు ఊహించని షాక్ ఇచ్చారు. నిర్ణీత సమయం ముగిసినట్లు ప్రకటించకముందే తెలుగు టైటాన్స్ ఆటగాళ్లు మ్యాట్‌పైకి రావడంతో టెక్నికల్ తప్పిదంగా పరిగణించి ప్రత్యర్థికి ఓ పాయింట్ ఇచ్చారు. దీంతో చిక్కినట్టే చిక్కిన తొలి విజయం టైటాన్స్‌కు అందకుండా పోయింది. సీజన్ మొత్తంలో గెలుపు రుచి చూడని జట్టు సభ్యుల అత్యుత్సాహం 'డ్రా'కు కారణమైంది. పీకేఎల్ తాజా సీజన్‌లో ఇదే తొలి 'టై' కావడం మరో విశేషం. టైటాన్స్ తరఫున సిద్ధార్థ్ దేశాయ్ 16 రైడ్‌లు చేసి 5 పాయింట్లు సాధించగా.. ఫర్హద్, అబోజర్ మిఘాని చెరో 4 పాయింట్లు సాధించారు. యూపీ తరఫున అమిత్, శ్రీకాంత్, నితీశ్ కుమార్ తలా 4 పాయింట్లు నమోదు చేశారు. మరోమ్యాచ్‌లో యూ ముంబా 32-20తో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్‌పై విజయం సాధించింది.

## 50 వేల హోండా వాహనాల రీకాల్

**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా(హెచ్‌ఎంఎస్‌ఐ)..50 వేల యూనిట్ల వాహనాలను రీకాల్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 4 నుంచి జూలై 3 వరకు తయారైన ఏవియేటర్(డిస్క్), యాక్టివా 125(డిస్క్), గ్రాజియా(డిస్క్), సీబీ షైన్(సెల్ఫ్ డిస్క్) సీబీఎస్ మోడళ్లకు చెందిన వాహనాల్లో ముందటి బ్రేక్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో రీకాల్ చేయాలని నిర్ణయించినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.



# లాభాల్లో మెరిసిన ఎస్బీఐ

### తొలి త్రైమాసికంలో రూ.2,312 కోట్లు.. వడ్డీ ఆదాయం, తక్కువ కేటాయింపులతో జోష్

**ముంబై, ఆగస్టు 2:** దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) ఆశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి నిధుల కేటాయింపులు తగ్గుముఖం పట్టడం, వడ్డీల నుంచి అధిక ఆదాయం సమకూరడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.2,312.02 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఏడాది క్రితం ఇదే సమయంలో రూ.4,875.85 కోట్ల నష్టాన్ని చవిచూసింది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ నిధుల కేటాయింపులు 35 శాతం తగ్గి రూ.10,934 కోట్లకు తగ్గడం బ్యాంక్‌కు భారీ ఊరటనిచ్చింది. గతేడాది ఇది రూ.16,849 కోట్లుగా ఉన్నది. వీటికితోడు వడ్డీల ద్వారా వచ్చే ఆదాయంలో 5.23 శాతం పెరిగి రూ.22,939 కోట్లకు చేరుకోవడం కూడా బ్యాంక్‌కు కలిసొచ్చింది. సమీక్షకాలంలో బ్యాంక్ సమీకృత ఆదాయం రూ.65,492.67 కోట్ల నుంచి రూ.70,653.23 కోట్లకు ఎగబాకినట్లు బీఎస్‌ఈకి సమాచారం అందించింది. దేశీయ నికర వడ్డీ మార్జిన్ 2.95 శాతం నుంచి 3.01 శాతానికి పెరిగినట్లు తెలిపింది.

#### తగ్గుముఖం పట్టిన నిరర్థక ఆస్తులు

మొండి బకాయిలను తగ్గించుకోవడానికి బ్యాంక్ తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. గత త్రైమాసికానికిగాను బ్యాంక్ నిరర్థక ఆస్తుల విలువ అడ్వాన్స్‌లో 9.95 శాతం నుంచి 7.53 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏ కూడా 4.84 శాతం నుంచి 3.07 శాతానికి జారుకున్నాయి. ప్రొవిజనింగ్ కవరేజ్ రేషియో 79.34 శాతంగా ఉన్నది. ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించినప్పటికీ మొండి బకాయిల బెడద మాత్రం బ్యాంకును వీడటం లేదు. గత త్రైమాసికంలో కొత్తగా రూ.16,212 కోట్లు మొండి బకాయిల జాబితాలోకి వచ్చాయి. మహారత్న హోదా కలిగిన ప్రభుత్వరంగ సంస్థకు ఇచ్చిన రూ.2 వేల కోట్ల రుణం వసూలు కాలేదని, దీనిపై చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. ఫిబ్రవరి 21న ఆర్బీఐ జారీ చేసిన మార్గదర్శకాలకు లోబడి ఈ సంస్థపై చర్యలు తీసుకోలేదన్నారు. వీటితోపాటు మహారాష్ట్ర ప్రభుత్వం రైతుల రుణ మాఫీని చేస్తున్నట్లు ప్రకటించడంతో వ్యవసాయ రంగానికి ఇచ్చిన రూ.2 వేల కోట్ల రుణాలు వసూలు కాకుండా పోయాయని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఇచ్చిన పలు రుణాలు కూడా మొండి బకాయిల జాబితాలోకి చేరుకున్నాయి.

#### రూ.5,769 కోట్ల రుణాల రికవరీ

గత త్రైమాసికంలో రూ.5,769 కోట్ల రుణాలను రికవరీ చేసినట్లు బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. వీటిలో ఎస్సార్, భూషణ్ స్టీల్, పవర్ అండ్ అలోక్ ఇండస్ట్రీస్‌కు ఇచ్చిన రుణాలను వసూలు చేయడానికి ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించింది బ్యాంక్. ఈ మూడు ఖాతాల విలువ రూ.16 వేల కోట్లు. ఆపరేటింగ్ ప్రాఫిట్ 10.60 శాతం పెరిగి రూ.13,246 కోట్లకు చేరుకున్నది. ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఆటోమొబైల్ రంగానికి ఇచ్చిన రుణాలు పెద్దగా లేవని బ్యాంక్ ఎండీ పీకే గుప్తా తెలిపారు. ఈ ఏడాది మొదట్లోనే కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం సత్ఫలితాలను ఇచ్చిందన్నారు. ఎస్‌ఎంఏ ఖాతాలు ఆమోదయోగ్య స్థాయిలోనే ఉన్నాయి. వాహన డీలర్లకు రూ.11,500 కోట్ల స్థాయిలో రుణాలు ఇచ్చిన బ్యాంక్..మొత్తంగా వాహన రుణాలు రూ.71 వేల కోట్లుగా ఉన్నాయి. మరోవైపు, టైర్-2 బాండ్లను జారీ చేయడం ద్వారా బ్యాంక్ రూ.7 వేల కోట్ల నిధులను సేకరించాలని సంకల్పించింది. దేశీయంగా బ్యాంక్ వృద్ధిరేటు 11.89 శాతంగా ఉండగా, వీటిలో రిటైల్, వ్యక్తిగత రుణాలు 18.68 శాతం చొప్పున పెరిగాయి. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి బ్యాంక్ షేరు ధర 3 శాతం తగ్గి రూ.308.45 వద్ద ముగిసింది.



వరుసగా నాలుగో త్రైమాసికంలోనూ లాభాల్లోకి వచ్చాం. క్రమంగా ఇది పెరుగుతున్నది. సిబ్బందిపై పెట్టే ఖర్చు అధీనంలోకి రావడం బ్యాంక్‌కు కలిసొచ్చింది. ఆదాయంపై పెట్టే ఖర్చు వాటా 52బేసిస్ పాయింట్లు తగ్గి 2.03 శాతానికి చేరుకున్నది. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే వృద్ధిరేటు మందగించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఆమోదయోగ్యస్థాయిలో ఉన్న నిమ్.. భవిష్యత్తులో పెరిగే అవకాశాలు కనిపించడం లేదు. ప్రతి త్రైమాసికంలో ఆకాశాన్ని చూడటం అలవాటుగా మారిపోయింది.. దేవున్ని ఒక్కటే కోరుకుంటా ఈ మొండి బకాయిలను వసూలు చేయడానికి ఏయే చర్యలు తీసుకోవాలో చెప్పమని ప్రతిరోజు ఆ భగవంతుడిని కోరుతా..

- రజ్నీష్ కుమార్, ఎస్బీఐ చైర్మన్

## ఎట్టకేలకు లాభాల్లోకి ఆంధ్రాబ్యాంక్

■ క్యూ1లో రూ.52 కోట్లుగా నమోదు

**హైదరాబాద్:** ప్రభుత్వరంగ సంస్థ ఆంధ్రాబ్యాంక్ ఎట్టకేలకు లాభాల్లోకి వచ్చింది. నిరర్థక ఆస్తుల దెబ్బకు గడిచిన కొన్ని సంవత్సరాలుగా నష్టాలతో కాలంవెల్లదీసిన బ్యాంక్..గడిచిన త్రైమాసికానికిగాను రూ.52 కోట్ల లాభాన్ని ప్రకటించింది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి నిధుల కేటాయింపులు తగ్గుముఖం పట్టడం వల్లనే లాభాల్లోకి వచ్చినట్లు పేర్కొంది. క్రితం ఏడాది ఇదేకాలానికి బ్యాంక్ రూ.539.83 కోట్ల నష్టాన్ని చవిచూసింది. మార్చి 31తో ముగిసిన త్రైమాసికానికి కూడా రూ.1,233.61 కోట్ల నష్టాన్ని నమోదు చేసుకున్నది. ఏడాది క్రితం రూ.5,092.08 కోట్లుగా ఉన్న బ్యాంక్ ఆదాయం ఈసారి తొలి త్రైమాసికానికిగాను రూ.5,437.03 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్‌ఈకి సమాచారం అందించింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 16.69 శాతం నుంచి 16.44 శాతానికి తగ్గగా, నికర ఎన్‌పీఏ 7.96 శాతం నుంచి 5.67 శాతానికి తగ్గాయి. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి రూ.922.96 కోట్ల నిధులను వెచ్చించింది. గతేడాది కేటాయించిన రూ.1,387.87 కోట్లతో పోలిస్తే సగానికి సగం తగ్గడం బ్యాంక్‌కు భారీ ఊరటనిచ్చింది. మొత్తంమీద ప్రొవిజనింగ్‌లు రూ.1707.50 కోట్ల నుంచి రూ.1,041.04 కోట్లకు తగ్గాయి. జూన్ 30నాటికి ప్రొవిజనింగ్ కవరేజ్ రేషియో 74.45 శాతంగా ఉన్నట్లు బ్యాంక్ పేర్కొంది. రూ.5,723.60 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.39.49 కోట్ల లాభాన్ని ఆర్జించింది. గతేడాది నాలుగు త్రైమాసికాలు నష్టాలనే ప్రకటించింది. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి బ్యాంక్ షేరు ధర 1.30 శాతం బలపడి రూ.19.55 వద్ద ముగిసింది.

## బ్యాంక్‌లకు ఆర్బీఐ షాక్

### ఏడు పీఎస్‌బీలపై రూ.11 కోట్ల జరిమానా

**ముంబై, ఆగస్టు 2:** ప్రభుత్వ బ్యాంకులకు రిజర్వు బ్యాంక్ గట్టి షాకిచ్చింది. కరెంట్ ఖాతా ప్రారంభానికి సంబంధించి నిబంధనలను ఉల్లంఘించడంతో ఏడు ప్రభుత్వరంగ బ్యాంకులపై ఆర్బీఐ రూ.11 కోట్ల జరిమానా విధించింది. వీటిలో అలహాబాద్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలపై చెరో రూ.2 కోట్ల జరిమానా విధించిన సెంట్రల్ బ్యాంక్.. బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలపై చెరో రూ.1.5 కోట్ల చొప్పున, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్‌పై కోటి రూపాయల జరిమానా విధించింది. కరెంట్ ఖాతాకు సంబంధించి ఆర్బీఐ జారీ చేసిన మార్గదర్శకాలను పట్టించుకోకుండా ఇష్టం వచ్చినట్లు వ్యవహరించినందుకుగాను ఈ జరిమానా విధించినట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. పలు కంపెనీలకు



చెందిన గ్రూపు ఖాతాలు ఇచ్చే సమయంలో వారి నుంచి ఎలాంటి పత్రాలు లేకుండానే ఖాతాను ఇవ్వడంపై సెంట్రల్ బ్యాంక్ కన్నెర్ర చేసింది. బ్యాంకులు తీసుకున్న చర్యలకుగాను ఎందుకు షోకాజ్ నోటీసును జారీ చేయకూడదో వివరణ ఇవ్వాలని ఆయా బ్యాంకులకు సూచించింది. వీటితోపాటు సైబర్ సెక్యూరిటీకి సంబంధించి ఉన్న నియమనిబంధనలను పట్టించుకోకపోవడంతో కార్పొరేషన్ బ్యాంక్‌పై కోటి రూపాయల జరిమానా విధించింది.

## అంచనాలు మించిన హెచ్‌డీఎఫ్‌సీ

■ క్యూ1లో 46 శాతం పెరిగిన లాభం

**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** దేశీయంగా మార్ట్‌గేజ్ రుణాలు ఇచ్చే అతిపెద్ద సంస్థయైన హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ విశ్లేషకుల అంచనాలకుమించి ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. జూన్ 30తో ముగిసిన మూడు నెలలకాలానికిగాను సంస్థ రూ.3,203 కోట్ల ఏకీకృత లాభాన్ని గడించింది. 2018-19 ఏడాది ఇదే సమయంలో ఆర్జించిన రూ.2,190 కోట్లతో పోలిస్తే 46 శాతం వృద్ధిని కనబరిచింది. గత త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ.9,951.98 కోట్ల నుంచి రూ.12,996.11 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్‌ఈకి సమాచారం అందించింది. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి కంపెనీ షేరు ధర 1.80 శాతం బలపడి రూ.2125.20 వద్ద ముగిసింది.

## ఆకట్టుకున్న ఐటీసీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను రూ.3,436.51 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించినట్లు దేశంలో అతిపెద్ద ఎఫ్‌ఎంసీజీ రంగ సంస్థ ఐటీసీ ప్రకటించింది. అంతక్రితం ఏడాది ఇదే కాలానికి నమోదైన రూ.3,049.38 కోట్ల లాభంతో పోలిస్తే 13.69 శాతం ఇది అధికం. అమ్మకాలు రూ. 11,745.68 కోట్లతో పోలిస్తే 6.69 శాతం అధికమై రూ.12,532.31 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది. నిర్వహణ ఖర్చులు రూ.8,113.67 కోట్లకు చేరుకోవడం కొంత మేర ప్రభావాన్ని చూపాయని పేర్కొంది. గతేడాది ఇది రూ.7,667.62 కోట్లుగా ఉన్నది. ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించినప్పటికీ స్టాక్ మార్కెట్లో కంపెనీ షేరు ధర పతనం చెందింది. 1.12 శాతం నష్టంతో రూ.264.60 వద్ద ముగిసింది.



## హైదరాబాద్ విమానాశ్రయం నుంచి స్పైస్‌జెట్ కార్గో సేవలు

**శంషాబాద్, ఆగస్టు 2:** జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టు కార్గో సేవల్లోకి మరో కొత్త దేశీయ సంస్థ స్పైస్ ఎక్స్‌ప్రెస్ చేరింది. ఈ కార్గో విమానం గురువారం అర్ధరాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో దిగింది. హైదరాబాద్- ఢిల్లీ నూతనంగా స్పైస్ జెట్ ఫైటర్ సర్వీసు ప్రారంభం కార్యక్రమంలో పాల్గొన్న స్పైస్‌జెట్ జనరల్ మేనేజర్ రాజేశ్‌సింగ్, జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టు డిప్యూటి సీఈఓ ప్రదీప్ పనిఖర్ పాల్గొన్నట్లు శుక్రవారం కంపెనీ అధికార ప్రతినిధి వర్గాలు తెలిపారు. దీనితో ఎయిర్‌పోర్టు నుంచి షెడ్యూల్డ్ ఫైటర్ల సంఖ్య 6కు చేరింది. స్పైస్ ఎక్స్‌ప్రెస్ వినియోగిస్తున్న 737-700 ఎఫ్ రకం ఫైటర్ విమానం వారానికి 6 రోజులు నడువనున్నది. చెన్నై నుంచి రాత్రి 9.45కు హైదరాబాద్‌కు చేరుకోనున్న ఈ విమానం..ఇక్కడి నుంచి 10.45 గంటలకు బయలుదేరి ఢిల్లీ చేరుకోనున్నది. దీని సామర్థ్యం 20 మెట్రిక్ టన్నులు. కామన్వెల్త్ స్టేట్స్, ఇతర మార్కెట్లకు ఢిల్లీ మీదుగా సరుకులు చేరవేసే అవకాశం కలుగుతుంది. ఈ సందర్భంగా సీఈఓ ఎస్‌జీకే కిశోర్ మాట్లాడుతూ.. కార్గో వ్యాపారాన్ని విస్తరించేందుకుగాను ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా జాతీయ, అంతర్జాతీయ సరుకుల ఎగుమతి, దిగుమతులకు చాలా సదుపాయంగా ఉంటుందన్నారు. కార్గో, లాజిస్టిక్ రంగాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో టాటా చార్జింగ్ స్టేషన్లు

### మరో నాలుగు నగరాల్లో ఏర్పాటు చేయబోతున్న సంస్థ

**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** భవిష్యత్తు విద్యుత్‌తో నడిచే వాహనాలకు డిమాండ్ ఉంటుందన్న అంచనాతో టాటా మోటర్స్, టాటా పవర్ సంయుక్తంగా దేశవ్యాప్తంగా ఐదు ప్రధాన నగరాల్లో 300 వేగవంతమైన చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. ఈ నగరాల్లో హైదరాబాద్‌తోపాటు ముంబై, ఢిల్లీ, బెంగళూరు, పుణెలు ఉన్నాయి. దీంట్లోభాగంగా శుక్రవారం ఒకేరోజు పుణెలో సంస్థ ఏడు చార్జింగ్ స్టేషన్లను ప్రారంభించింది. వచ్చే రెండు నెలల్లో ఈ నాలుగు నగరాల్లో 45 చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు టాటా పవర్ ఎండీ, సీఈవో ప్రవీర్ సిన్హా తెలిపారు. ఈ స్టేషన్లు టాటా మోటర్ డీలర్ల వద్ద, టాటా గ్రూపునకు చెందిన ఇతర రిటైల్ అవుట్‌లెట్ల వద్ద ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. విద్యుత్‌తో నడిచే వాహనాలకు వేగవంతంగా, సులభంగా చార్జింగ్ చేయడమే లక్ష్యంగా వీటిని నెలకొల్పుతున్నట్లు తెలిపారు.

## కాఫీ డే ఉద్యోగులపై ఐటీ శాఖ నజర్

**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** కేఫ్ కాఫీ డేకు చెందిన పలువురు ఉద్యోగులు, ఉన్నతాధికారుల్లో కొందరు బోగస్ పత్రాలు సమర్పించి తమిళనాడు కేంద్రస్థానంగా పనిచేస్తున్న ఓ ప్రైవేట్ బ్యాంకులో రూ.145 కోట్ల మేర అడ్డదారిలో రుణాలు పొందినట్లు తాజాగా ఆదాయ పన్ను శాఖ అధికారులు గుర్తించారు. వీజీ సిద్దార్థ మరణానంతరం సీసీడీకి చెందిన ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి ఐటీ శాఖ అధికారులు విచారణను ముమ్మరం చేశారు. ఈక్రమంలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. సీసీడీకి చెందిన ఉద్యోగులు, ఉన్నతాధికారులు అన్నదాతల పేరుతో నకిలీ పత్రాలు సమర్పించి కోట్ల రూపాయల రుణాలు పొంది సిద్దార్థకు చెందిన ఇతర కంపెనీలకు అక్రమంగా తరలించినట్లు తెలుస్తున్నది. కాగా, కంపెనీ బోర్డులో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఓ ఉన్నతాధికారి కూడా సైతం ఇదే విధంగా రుణం తీసుకున్నట్లు ఐటీ వర్గాలు వెల్లడించాయి. కర్ణాటకలోని చిక్‌మగళూరులో కాఫీ సాగు చేస్తున్న రైతులుగా పేర్కొంటూ సీసీడీ గ్రూపు అందించినట్లుగా నకిలీ విక్రయ పత్రాలను బ్యాంకులో సమర్పించారు. సీసీడీ అందించినట్లుగా ఉండటంతో బ్యాంక్ వర్గాలు ఏ మాత్రం ఆలోచించకుండా రుణాలు మంజూరు చేశారు. మరోవైపు సిద్దార్థకు చెందిన ఒక కంపెనీకి హవాలా మార్గంలో నిధుల మళ్లింపులు జరిపినట్లు కూడా ఐటీ అధికారులు గుర్తించారు.

# దిగజారిన భారత్ ర్యాంక్

### ప్రపంచ దేశాల జీడీపీలో ఏడోస్థానానికి.. గతేడాదికిగాను ప్రపంచ బ్యాంక్ వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 2:** నరేంద్ర మోదీ సర్కార్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వచ్చే ఐదేండ్లలో దేశ ఆర్థిక వ్యవస్థను 5 ట్రిలియన్ డాలర్లతో నాలుగో స్థానంపై గురిపెట్టిన కేంద్ర ప్రభుత్వానికి వరల్డ్ బ్యాంక్ తాజాగా విడుదల చేసిన గణాంకాలు షాక్‌కి గురిచేస్తున్నవి. గడిచిన సంవత్సరానికిగాను ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థ కలిగిన జాబితాలో భారత్ ప్రస్తుతం ఉన్నస్థానం నుంచి రెండు స్థానాలు కిందకు పడిపోయింది. 2017లో ఐదో స్థానంలో ఉన్న భారత్..ఆ మరుసటి ఏడాదికిగాను ఏడో స్థానానికి పడిపోయింది. ఇదే సమయంలో బ్రిటన్ ఐదోస్థానానికి ఎగబాకగా, ఏడో స్థానంలో ఉన్న ఫ్రాన్స్ మరో మెట్టుపైకి ఎక్కి ఆరోస్థానానికి చేరుకున్నది. అగ్రరాజ్యం అమెరికా యథావిధిగా 20.5 ట్రిలియన్ డాలర్లతో తన తొలి స్థానాన్ని నిలబెట్టుకున్నది. భారత్ పొరుగు దేశమైన చైనా 13.6 ట్రిలియన్ డాలర్లతో రెండో స్థానంలో నిలువగా, జపాన్ 5 ట్రిలియన్ డాలర్లతో ఆ తర్వాతి స్థానంలో నిలిచాయి. గతేడాదికిగాను భారత జీడీపీ 2.7 ట్రిలియన్ డాలర్లుగా నమోదైంది. ఇదే సమయంలో బ్రిటన్, ఫ్రాన్స్ దేశాల ఆర్థిక వ్యవస్థ 2.8 ట్రిలియన్ డాలర్లతో భారత్‌ను అధిగమించాయి. 2017లో దేశ జీడీపీ 2.65 ట్రిలియన్ డాలర్లుగా ఉండగా..బ్రిటన్ 2.64 ట్రిలియన్ డాలర్లు, ఫ్రాన్స్ 2.5 ట్రిలియన్ డాలర్లుగా ఉన్నాయి. భారత ఆర్థిక వ్యవస్థ కంటే బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్నాయనడానికి ఈ గణాంకాలే నిదర్శనం. గతేడాది ఆసియాలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండగా, అలాగే ప్రపంచ దేశాల్లో ఐదోస్థానంలో ఉన్నది. దేశీయ కరెన్సీ విలువ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొనడం, వృద్ధిరేటు మందగించడం వల్లనే ర్యాంక్ పడిపోయిందని ఇండియా రేటింగ్ అండ్ రీసర్చ్ ప్రధాన ఆర్థికవేత్త దేవేంద్ర పంత్ తెలిపారు. 2017లో డాలర్‌తో పోలిస్తే రూపాయి బలపడగా, ఆ మరుసటి ఏడాదిలో భారీగా పతనం చెందింది. అయినప్పటికీ భారత్..అత్యంత వేగవంతమైన వృద్ధిరేటును సాధిస్తున్న దేశంగా కొనసాగుతుందన్నారు. ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో నికరంగా 7 శాతం వృద్ధిని సాధించనున్నదని అన్ని సర్వే సంస్థలు అంచనావేస్తున్నాయి. అమెరికాతో వాణిజ్య యుద్ధమేఘాలు కొనసాగుతుండటంతో చైనా ఆర్థిక వ్యవస్థ బలహీన పడనున్నదని సర్వే అంచనావేస్తున్నది. 2019లో భారత్..బ్రిటన్‌ను దాటేసి ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనున్నదని ఇటీవల ఐహెచ్‌ఎస్ మార్కిట్ వెల్లడించిన విషయం తెలిసిందే. 2025 నాటికి జపాన్‌ను అధిగమించి మూడో స్థానానికి చేరుకోనున్నదని పేర్కొంది. 2024-25 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రోడ్‌మ్యాప్‌ను ప్రకటించింది. ఏడు శాతం వృద్ధితో ఈ లక్ష్యానికి చేరుకోవడం చాలా కష్టమని, ఎనిమిది శాతం వృద్ధితో సాధించవచ్చని పలువురు ఆర్థికవేత్తలు అభిప్రాయపడిన విషయం తెలిసిందే.

**ప్రపంచ దేశాల ఆర్థిక ముఖ చిత్రం**

| ర్యాంక్ | దేశం | 2018లో జీడీపీ (ట్రిలియన్ డాలర్లలో) |
|---|---|---|
| 1 | అమెరికా | 20.8 |
| 2 | చైనా | 13.6 |
| 3 | జపాన్ | 5.0 |
| 4 | జర్మనీ | 4.0 |
| 5 | బ్రిటన్ | 2.8 |
| 6 | ఫ్రాన్స్ | 2.8 |
| 7 | భారత్ | 2.7 |
| 8 | ఇటలీ | 2.1 |
| 9 | బ్రెజిల్ | 1.9 |
| 10 | కెనడా | 1.7 |




## 1.85 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిచేయాలి

■ కొత్త ఓసీల్లో ఈ ఏడాదే ఉత్పత్తి ప్రారంభించాలి
■ వార్షిక లక్ష్యాలపై సమీక్షలో సింగరేణి సీఎండీ శ్రీధర్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సింగరేణి వార్షిక లక్ష్యాల సాధన కోసం ఆగస్టు నుంచి రోజుకు 1.85 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తిచేయడంతోపాటు అంతే పరిమాణంలో బొగ్గు రవాణా జరుపాలని, ఓసీ గనుల నుంచి రోజుకు 11.28 లక్షల క్యూబిక్‌మీటర్ల ఓబీ (ఓవర్ బర్డెన్)ని తొలిగించాలని సంస్థ చైర్మన్, సీఎండీ శ్రీధర్ స్పష్టంచేశారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శుక్రవారం ఆయన సంస్థ డైరెక్టర్లు, ఏరియా జీఎంలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కొత్త ఓపెన్‌కాస్ట్ (ఓసీ) గనుల్లో ఈ ఏడాది బొగ్గు ఉత్పత్తి ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కిష్టారం ఓపెన్‌కాస్ట్, కేటీకే, ఓసీ-3, జీడీకే-5 ఓసీ, కోయగూడెం-3 ఓసీ, ఇందారంఖని ఓసీలను ప్రారంభించి సకాలంలో బొగ్గు ఉత్పత్తి జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే నైనీ బొగ్గు బ్లాకు (ఒడిషా)లో జరుగుతున్న ఎక్స్‌ప్లొరేషన్ పనులు, ప్రభుత్వ అనుమతులపై కూడా సీఎండీ శ్రీధర్ సమీక్ష నిర్వహించారు. అక్కడ వచ్చే ఏడాది నుంచి బొగ్గు ఉత్పత్తి జరిపేందుకు సన్నాహాలు చేయాలని ఆదేశించారు. జూలై వరకు సాధించిన వృద్ధిపై ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ.. ఏరియాల వారీగా సాధించాల్సిన లక్ష్యాలపై సమీక్ష నిర్వహించారు. గత ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలలతో పోల్చితే ఈ నాలుగు నెలల్లో ఉత్పత్తిలో 17 శాతం, రవాణాలో 3 శాతం, ఓబీ తొలిగింపులో 6 శాతం వృద్ధి నమోదయిందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో జూలై వరకు 190 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగగా.. ఈ ఏడాది జూలై వరకు 222 లక్షల టన్నుల ఉత్పత్తి జరిగిందని, బొగ్గు రవాణా 3 శాతం పెరిగి 220 లక్షల టన్నులకు, ఓబీ తొలిగింపు 6 శాతం (117.7 మిలియన్ క్యూబిక్ మీటర్ల నుంచి 124 మిలియన్ క్యూబిక్ మీటర్లకు) పెరిగిందని, ఈ ఏడాది తొలి 4 నెలల్లో నిర్దేశిత లక్ష్యాలను అధిగమించి ముందుకు సాగుతున్నామని తెలిపారు. సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు ఎస్ శంకర్, చంద్రశేఖర్, ఈడీ బలరాం, మైనింగ్ అడ్వైజర్ అల్విన్, అన్ని ఏరియాల జీఎంలు పాల్గొన్నారు.




## చెన్నయ్ షాపింగ్ మాల్‌లో శ్రావణం ఆఫర్లు

**హైదరాబాద్, ఆగస్టు 2:** అధునాతన వస్త్రాలు, బంగారు ఆభరణాల విక్రయ సంస్థ ది చెన్నయ్ షాపింగ్ మాల్ వినియోగదారులకు బంపర్ ఆఫర్‌ను ప్రకటించింది. ఆషాఢం సందర్భంగా ప్రకటించిన కేజీ సేల్ ఆఫర్‌ను శ్రావణ మాసంలోనూ కొనసాగిస్తున్నట్లు తెలిపింది. కాంబో ఆఫర్లతోపాటు గత నెలలో ప్రకటించిన అన్ని రకాల ఆఫర్లు ఈ మాసంలోనూ కొనసాగనున్నాయని సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇలాంటి ప్రత్యేక ఆఫర్లు ఏడాదికి ఒక్కసారి మాత్రమే ప్రకటిస్తామని యాజమాన్యం తెలిపింది. శ్రావణమాసంలో మహిళలు ఎంతో పవిత్రంగా జరుపుకొనే వరలక్ష్మీ వ్రతానికి కావాల్సిన పట్టుచీరలు, హ్యాండ్లూం చీరలు, పెట్టుబడి చీరలు అత్యాధునిక డిజైన్లతో అతి తక్కువ ధరకే అందిస్తున్నది సంస్థ. వీటితోపాటు రాఖీ పౌర్ణమికి కావాల్సిన సంప్రదాయ పట్టు పరికిణీలు, చుడిదార్లు, గాగ్రాలు, మగవారికి అన్ని ప్రముఖ బ్రాండ్లలో రెడిమేడ్ వస్త్రాలు కాంబో ఆఫర్లు ఉన్నాయని తెలిపింది.

## నిరాశపరిచిన లారస్ ల్యాబ్

**హైదరాబాద్, ఆగస్టు 2:** హైదరాబాద్ కేంద్రస్థానంగా ఔషధ సంస్థ లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. జూన్ 30తో ముగిసిన త్రైమాసికానికిగాను సంస్థ రూ.15.1 కోట్ల లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.16.6 కోట్లతో పోలిస్తే 9 శాతం క్షీణించింది. కంపెనీ ఆదాయం మాత్రం రూ.539 కోట్ల నుంచి రూ.550 కోట్లకు ఎగబాకింది. ఆదాయం ఆశించిన స్థాయిలో పెరుగకపోవడం, నిర్వహణ ఖర్చులు అధికమవడం, ముఖ్యంగా బీమాకోసం అధికంగా నిధులు వెచ్చించడంతో లాభాలపై ప్రభావం చూపిందని కంపెనీ సీఈవో సత్యనారాయణ చావా తెలిపారు. జనరిక్ ఔషధాల మార్కెట్ మందకొడిగా ఉండటం, ముఖ్యంగా ఏఆర్‌వీ(యాంటీరిట్రోవిరల్), హెపటైటిస్ ఏపీఐ సేల్స్ తక్కువగా ఉండటం కూడా ప్రభావం చూపాయన్నారు. ప్రస్తుత త్రైమాసికంలో ఏపీఐ వ్యాపారం వృద్ధిని నమోదు చేసుకునేదానిపై ఆయన గట్టి నమ్మకాన్ని వ్యక్తంచేశారు.

## ఆరోగ్యరంగంలో ఆవిష్కరణలకు అండగా టీహబ్

■ హెల్త్ టెక్ ఆర్కేడ్‌తో స్టార్టప్‌లకు పరిష్కారం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వైద్య, ఆరోగ్యరంగంలో ఎదురయ్యే సవాళ్లను మరింత కచ్చితత్వంతో పరిష్కరించేందుకు ముందుకొచ్చిన ఆవిష్కర్తలకు టీహబ్ అండగా నిలిచింది. టీహబ్ కార్యాలయంలో శుక్రవారం సీఈవో రవి నారాయణ్ మాట్లాడుతూ.. హెల్త్ టెక్ ఆర్కేడ్ పేరుతో పాలీ క్రానిక్ మేనేజ్‌మెంట్, డిజిటల్ హెల్త్, మెడికల్ డివైజ్ డయగ్నోస్టిక్, డీప్‌టెక్ అనలైటిక్స్ అంశాల్లో తమ సంస్థ కృషి చేస్తున్నదని చెప్పారు. నేషనల్ హెల్త్‌అథారిటీ, శ్రీక్యాపిటల్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, జూబిలియంట్ లైఫ్‌సైన్సెస్ లిమిటెడ్, యూఎస్టీ గ్లోబల్, ఎల్వీప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, క్లింటన్ హెల్త్ యాక్సెస్, నోవార్టిస్, పరంపర కాపిటల్, వెంచర్ ఈస్ట్, ఎండియా సంస్థలను భాగస్వామిగా చేసుకొని కార్యాచరణను ప్రారంభించిందని చెప్పారు. ఈ సంస్థలతో కలిసి టీహబ్ పనిచేసి వైద్యరంగంలోని సవాళ్లకు నూతన పరిష్కారమార్గాలను చూపేందుకు కృషిచేస్తున్నదని చెప్పారు.



హెల్త్‌చెకప్ శిబిరం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్

## న్యాయవాదులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

### హైకోర్టు చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** న్యాయవాదులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్ పిలుపునిచ్చారు. శుక్రవారం తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్, అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్త్‌చెకప్ శిబిరాన్ని చీఫ్ జస్టిస్ ప్రారంభించి ఆయన మాట్లాడుతూ.. ఏటా ఆరోగ్య శిబిరాలను నిర్వహించాలని బార్ అసోసియేషన్‌కు సూచించారు. కార్యక్రమంలో హైకోర్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మలుగారి సుదర్శన్, ఏజీ బీఎస్ ప్రసాద్, రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యకరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.










# ఐటీ టూర్‌కు విద్యార్థులు!

- రోబోటిక్స్ ప్రాథమిక అంశాలపై శిక్షణ
- తమ విద్యావిధానాన్ని వివరించిన కొరియా ప్రతినిధులు
- టూర్‌లో గద్వాలకు చెందిన 45 స్కూళ్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు
- త్వరలో అన్ని జిల్లాల్లో విస్తరిస్తాం: సందీప్ మక్తాల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/కొండాపూర్:** జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రత్యేక పర్యటన చేపట్టారు. 'టీటా'ఐటీ ఇండస్ట్రీ టూర్ పేరుతో చేపట్టిన కార్యక్రమంలో గద్వాలకు చెందిన 45 ప్రభుత్వ పాఠశాలల్లోని 8,9 తరగతులకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులను బృందాలుగా ఎంపికచేసి, హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీలు, ఐటీ పార్కుల్లో ఇండస్ట్రీ టూర్ ఏర్పాటు చేయడంతోపాటు రోబోటిక్స్ అంశాలపై శిక్షణ ఇచ్చింది. సైబర్ టవర్స్, టీ-హబ్‌ను కూడా వారు సందర్శించారు. రెండు సెషన్లుగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉదయం ఐటీ పార్కుల్లో పర్యటన, ఐటీ ఉద్యోగులతో కలిసి వివిధ కార్యక్రమాలను ఏర్పాటుచేసింది. అనంతరం పలు సామాజిక సమస్యలకు రోబోటిక్స్ ద్వారా పరిష్కారం చూపినవారికి బహుమతులు అందించింది. ఈ సందర్భంగా విద్యార్థులకు డిజిథాన్ పుస్తకాలు, రోబోటిక్స్ బేసిక్ లెవెల్ కిట్లు అందించారు. తమ దేశంలోని విద్యావిధానాలను కొరియాకు చెందిన ఏసెస్ బృందం ప్రతినిధి లీ వివరించారు. ప్రాథమిక విద్యాభ్యాసం సమయంలోనే పాఠ్యాంశాలపై పట్టుసాధించాలని తెలిపారు.



### రోబోటిక్స్ నేర్చుకుంటా

ఇండస్ట్రీ టూర్‌లో నేర్పిస్తున్న రోబోటిక్స్ కొత్తగా, చాలా బాగుంది. పెద్దయ్యాక రోబోటిక్స్ నేర్చుకుంటాను. ఇన్ని ఐటీ కంపెనీలను చూస్తానని కలలో కూడా అనుకోలేదు. మాకు అవకాశాన్ని అందించిన టీటాకు ధన్యవాదాలు.

- మహేందర్, విద్యార్థి, గద్వాల

### ప్రమాదాల నివారణ పరికరం రూపొందిస్తా



ఒంటిచేతితో వాహనాలు నడపడం వల్ల చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. అలా నడిపినప్పుడు అలారం వచ్చేలా రోబోటిక్స్‌తో పరికరాన్ని రూపొందిస్తా. ఒంటి చేతితో బైక్ నడిపినప్పుడు అలారం వచ్చి వాళ్ళను అప్రమత్తం చేసి ప్రమాదాలు నివారించేలా చేయాలనుకొంటున్నాను. - శ్రీజ (9వ తరగతి), జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల, గద్వాల



### విద్యార్థులను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దేందుకే..

విద్యార్థులను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో డిజీథాన్ డిజిటల్ యాత్రను ప్రారంభించాం. ఇండస్ట్రీ టూర్‌లో వివిధ పరిజ్ఞానాలను కూడా నేర్చుకోవడమనే భావనతో రోబోటిక్స్ శిక్షణ అందించాం. త్వరలో మిగతా జిల్లాలవారికీ శిక్షణ ఇస్తాం. - సందీప్ మక్తాల, టీటా గ్లోబల్ వర్కింగ్ ప్రెసిడెంట్

## స్వాతంత్ర్య సమరయోధుడు శేఖరాచారి మృతి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు కట్టా రాజశేఖరాచారి (99) శుక్రవారం మృతి చెందారు. ఆయన మృతికి రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు సంతాపం ప్రకటించారు. శనివారం ఉదయం సికింద్రాబాద్ తిలక్‌రోడ్డులోని హిందూ ముక్తి స్థల్‌లోని శ్మశానవాటికలో శేఖరాచారి అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

## 600 స్కూళ్లలో మాట్లాడే పుస్తకాలు

### యునిసెఫ్ సహకారంతో అమలు: విజయ్‌కుమార్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని దాదాపు 600 పాఠశాలల్లో సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన మాట్లాడే పుస్తకాల ద్వారా అదనపు తరగతులు బోధించనున్నట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టీ విజయ్‌కుమార్ తెలిపారు. యునిసెఫ్ ఆధ్వర్యంలోనే పాఠశాలల్లో దీనిని అమలుపరుస్తున్నామన్నారు. పిల్లల్లో మార్పుకోసం, వారి జీవన నైపుణ్యాలను మెరుగుపరచడంకోసం తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో 100 కథల పుస్తకాలను యునిసెఫ్ రూపొందించిందన్నారు. పర్యావరణం, పారిశుధ్యం, నీటి సంరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, బాలికల సమస్యలు, ఆరోగ్యం, పౌష్టికాహారం తదితర అంశాలతో పుస్తకాలను రూపొందించినట్టు పేర్కొన్నారు. గత ఏడాది 200 పాఠశాలల్లో అమలుచేయగా, అదే స్ఫూర్తితో మరో 600 స్కూళ్లలో అమలు చేసేందుకు నిర్ణయించామని తెలిపారు. వీటిలో 417 కేజీబీవీలు, 35 జెడ్పీ పాఠశాలలు, 37 గిరిజన సంక్షేమ పాఠశాలలు, ఉట్నూర్ ఐటీడీఏతో పాటు 111 ఆశ్రమ పాఠశాలల్లో వీటిని అమలుపరుస్తున్నట్టు చెప్పారు.

## ఇంజినీరింగ్ కళాశాలల్లో రిపోర్టింగ్‌కు నేడు అవకాశం

### వర్షాల కారణంగా గడువు పొడిగింపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రం లో తుదివిడుత ఎంసెట్ కౌన్సెలింగ్ ద్వారా ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్లు పొందిన విద్యార్థులు రిపోర్ట్ చేయడానికి మరోరోజు గడువు పొడిగించినట్టు శుక్రవారం అడ్మిషన్ కమిటీ కన్వీనర్ నవీన్‌మిట్టల్ తెలిపారు. వాస్తవానికి ఇంజినీరింగ్ కళాశాలల్లో రిపోర్టింగ్ గడువు శుక్రవారంతో ముగిసింది. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు, ఇతర కారణాలతో ఇంజినీరింగ్ కళాశాలల్లో సకాలంలో రిపోర్ట్ చేయలేకపోయామని విద్యార్థులు చేసిన విజ్ఞప్తుల మేరకు గడువును శనివారం వరకు పొడిగించినట్టు తెలిపారు.









నమస్తే తెలంగాణ
WWW. NTNEWS.COM
# జిందగీ
శనివారం 3 ఆగస్టు 2019
/nt.zindagi

## సాహసమే శ్వాసగా సాగుతూ..



**అరవై ఎనిమిదేండ్లు.. ఆరు భారతీయ పాస్‌పోర్టులు.. అరవై ఐదు దేశాలు చుట్టొచ్చిందీవిడ. అది కూడా సోలో ట్రిప్. ఏదైనా చేయాలనిపిస్తే చేసేయాలి. లేదంటే కలగానే మిగిలిపోతుందన్న అమ్మ చెప్పిన మాటల్ని వేదంగా అనుసరిస్తున్న ఈమె గురించి తెలుసుకోవాల్సిందే!**

చెన్నైకు చెందిన సుధ మహాలింగం చిన్న వయసులో తల్లి చెప్పిన మాటలు గుర్తుంచుకుంది. 'నీకు సముద్రంలో స్నానం చేయాలనిపిస్తే అలలు ఎప్పుడు ఆగుతాయని ఎదురు చూడకు, ఎందుకంటే అవి ఎప్పటికీ ఆగవు. అలానే నీకు ప్రపంచంలోని ప్రదేశాలను చుట్టాలనుకుంటే బాధ్యతలకు కట్టుబడి ఆగిపోకు. అన్నింటినీ సవరించుకుంటూ ముందుకు నడవాలి' అన్న తల్లి మాటలు ఆమె చెవిలో ఎప్పుడూ వినిపిస్తూనే ఉంటాయి. సుధా జర్నలిస్ట్‌గా పనిచేస్తున్న రోజుల్లో కొత్త ప్రదేశాలు చూడడానికి కుదిరేది కాదు. అందుకే ఉద్యోగ విరమణ తీసుకున్నది. సింధూ భర్త ఉద్యోగం రీత్యా ఇతర ప్రదేశాలకు ట్రాన్స్‌ఫర్ అవుతూ ఉంటారు. దీన్నే ఆసరాగా తీసుకొని యూరప్ చుట్టొచ్చింది. సుధ ముందుగా ఎక్కడికెళ్లాలో ముందుగా ప్లాన్ చేసుకుంటుంది. ప్రయాణానికి కావాల్సిన కెమెరా, డైరీ, పెన్ అన్నీ బ్యాగ్‌లో పెట్టుకొని చేతికి తగిలించుకుంటుంది. అడ్వాన్స్‌గా రూం బుక్ చేసుకోవడం, ముందు జాగ్రత్తలు ఏవీ తీసుకోదు. ప్రదేశానికి వెళ్లాక అక్కడి పరిస్థితుల్ని బట్టి నిర్ణయం తీసుకుంటుంది. రాత్రి సమయంలో తక్కువ బడ్జెట్‌లో దొరికే యువతుల హాస్టల్స్‌ని ఎంచుకుంటుంది. సుధా 1996లో సోలో ట్రిప్‌గా కైలాష్ మానససరోవర్‌కు 32 రోజులు ప్రయాణించింది. ఆ ప్రయాణంలో ఆమె ఎన్నో విషయాలు తెలుసుకున్నది. కోల్‌కతా నుంచి కుమింగ్ వరకు కారు ర్యాలీతో నాలుగు దేశాలు, మూడు వారాలు (బంగ్లాదేశ్, చైనా, ఇండియా, మయన్మార్) చుట్టొచ్చింది. ఆయా ప్రదేశాల చిత్రాలను కెమెరాలో బంధించి భారత్‌కు పంపిస్తుంది. ఈ వయసులో కూడా 65 దేశాలు చుట్టిరావడం మామూలు విషయం కాదు. ఆమె సాహసాలను అందరు అభినందిస్తున్నారు.

## చర్మ వ్యాధుల్ని తగ్గించుకోండిలా..!



**మన శరీరంలో అత్యంత పెద్ద అవయవం చర్మం. శరీరంలో ఏ భాగానికి వ్యాధులు ఏర్పడినా తగ్గుతాయి కానీ చర్మానికి వ్యాధులొస్తే తగ్గడం కష్టం. చర్మ వ్యాధుల్ని తగ్గించుకునే దిశగా కొన్ని సహజసిద్ధమైన నివారణ మార్గాలున్నాయి.**

- మినుములు చర్మానికి మంచి ఔషధంగా పనిచేస్తాయి. మినుములను నీటితో నూరి పట్టిస్తుంటే క్రమంగా తెల్లబొల్లి మచ్చలు పోతాయి. చర్మంపై కిరసనాయిలును మాటిమాటికీ రాస్తే గజ్జి, తామర వంటి చర్మ రోగాలు హరించుకుపోతాయి.
- తులసి ఆకు సహజసిద్ధమైన ఔషధం. ఈ ఆకు రసంలో హారతి కర్పూరం కలిపి మెత్తగా నూరి శోభిమచ్చలపై రుద్ది ఆరిన తర్వాత స్నానం చేస్తే శోభి త్వరగా తగ్గుతుంది. నీళ్లలో కొద్దిగా ఉప్పు, నిమ్మరసం కలిపి స్నానం చేస్తే దురద, దద్దుర్లు పోయి శరీరం కాంతివంతంగా మారుతుంది.
- తులసి నిమ్మరసం కలిపి నూరి గజ్జి, తామర, దురద, దద్దుర్లపై రాస్తే త్వరగా ఉపశమనం కలుగుతుంది. తెల్లగన్నేరు ఆకులు నూరి తెల్లమచ్చల మీద లేపనం చేయాలి. అతి త్వరగా మచ్చలు పోతాయి. జిల్లేడు పాలు, ఆముదం సమంగా కలిపి రుద్దుతూ ఉంటే కాలి ఆనెకాయలు హరించిపోతాయి. తేనె 5 గ్రాములు. నెయ్యి 8 గ్రాములు కలిపి పూస్తున్నా తీవ్రమైన వ్రణాలు కూడా తొలగిపోతాయి.
- వామును నిప్పులపై వేసి ఆ పొగను ఒంటికి తగిలేట్లు చేస్తే దురదలు, దద్దుర్లు తగ్గుతాయి. పసుపు పొడి 3 గ్రాములు, ఉసిరిక పొడి 6 గ్రాములు కలిపి మంచి నీటితో సేవిస్తుంటే రక్తశుద్ధి, చర్మశుద్ధి కలుగుతాయి. మారేడు ఆకు ముద్దగా నూరి కడుతుంటే శరీరంలో ఇరుక్కున్న ముళ్లు, మేకులు బయటకొస్తాయి.
- తెల్లని మచ్చలతోబాధపడే వారు తులసి ఆకులు, హారతి కర్పూరం కలిపి మెత్తగా నూరి నిద్రించే ముందు మచ్చలపై పట్టించాలి. ఉదయం స్నానం చేసినప్పుడు కడగాలి. రోజూ క్రమం తప్పకుండా రెండు మూడు వారాలు ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

## అడవుల సంరక్షణ కోసం..



**ప్రకృతి విపత్తుల నుంచి రక్షించడానికి మడ అడవులు రక్షణగా నిలుస్తాయి. అటువంటి వాటిని సంరక్షించేందుకు ఓ అటవీశాఖ అధికారిణి శ్రీకారం చుట్టింది. ప్రత్యేక ప్రచారంతో ప్రజలను చైతన్య పరుస్తున్నది.**

మడ అడవులను మరింతగా విస్తరింప చేసేందుకు ముంబైకి చెందిన రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ సీమ అడ్గన్కర్ నడుం బిగించింది. ముంబై సముద్రతీర ప్రాంతాల్లో 36మంది సభ్యులతో ప్రత్యేక బృందంతో మడ అడవులను పెంచేందుకు కృషి చేస్తున్నది. వాటి వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నది. 56 ఏండ్ల సీమ ఆరేండ్లుగా మడ మొక్కలను నాటుతూ సముద్ర తీర ప్రాంతవాసుల్లో అవగాహన కల్పిస్తున్నది. ఇంటింటికీ తిరిగి గృహిణులకు మడ మొక్కల పెంపకం గురించి వివరిస్తున్నది. మడ జాతి మొక్కలను పెంచడంలో అందరూ సహకరించాలని కోరుతున్నది. 2005లో ముంబై హైకోర్టు మడ అడవుల పరిధిలో 50 మీటర్లలోపు ఎటువంటి నిర్మాణాలు చేపట్టొద్దని నిషేధించింది. కోర్టు ఉత్తర్వుల ఫలితంగా మహారాష్ట్ర అటవీశాఖ మడ అడవుల పరిరక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని రూపొందించింది. సర్కారు వాటి సంరక్షణ బాధ్యతను సీమ అడ్గన్కర్‌కు అప్పగించింది. మహారాష్ట్రలోనే మొట్టమొదటి అటవీశాఖ క్షేత్రస్థాయి అధికారిణి అయిన ఆమె1984లో ఉద్యోగంలో చేరింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ సీమ అడ్గన్కర్ పలు ప్రాంతాల్లో పనిచేసి అందరితో శభాష్ అనిపించుకున్నది. సముద్ర తీరంలోని మత్స్యకారులకు, నగరవాసులకు మడ అడవుల అందాలను గురించి వివరిస్తూ వాటిని నాశనం చేయకుండా కాపాడే ప్రయత్నం చేస్తున్నది. 2005లో 42 కిలోమీటర్ల మేర ఉన్న మడ అడవులను 2017 నాటికి 66 కిలో మీటర్లకు పెంచగలిగింది. ముంబై మహానగరాన్ని సంరక్షించే సైనికులుగా మడ అడవులను అభివర్ణిస్తున్నది సీమ అడ్గన్కర్.

**కొన్ని ఆనంద క్షణాలు ఏడాదికోసారి వస్తాయి. మరికొన్ని.. జీవితంలో ఒకసారి మాత్రమే వస్తాయి. అలాంటి ఆనంద క్షణాలను కూడా డైటింగ్, ఆరోగ్యం అంటూ ఆస్వాదించరు కొందరు. అలా మూడీగా ఉన్నవారు.. ఒకసారి తమ కేక్‌ను రుచి చూడమని అంటున్నది హిమబిందు. ఎందుకంటే ఒకసారి 'కేక్స్ ఎన్ క్రంబ్స్' బేకరీలో దీనిని రుచి చూస్తే.. మళ్లీ ఆర్డర్‌కు అక్కడికి వెళ్లాల్సిందే. సాధారణ గృహిణి నుంచి బేకరీ యజమానిగా.. న్యాయనిర్ణేతగా.. అంతర్జాతీయ స్థాయి అవార్డు విన్నర్‌గా ఎదిగిన హిమబిందు ఘనత ఇది.**





# హిమబిందు కేకుల విందు



**పుట్టినరోజు, న్యూఇయర్, వివాహ వార్షికోత్సవం.. ఇలా సందర్భమేదైనా కేక్ కట్ చేయడం ఆనవాయితీ. మరి మధ్యతరగతి, పేదల సంగతి? అలాంటి వారికి కూడా చాలా తక్కువ ధరలో కేకులు అందుబాటులో ఉంచింది హిమబిందు. గృహిణులు, యువతులకు కేక్ తయారీలో శిక్షణ కూడా ఇస్తున్నది ఆమె. అంత రుచికరమైన కేక్‌లు ప్రస్తుతం బెంగళూరులోనే అందుబాటులో ఉన్నాయి. వాటి కమ్మదనాన్ని త్వరలోనే మన హైదరాబాద్‌కూ పరిచయం చేయనున్నది ఈ తెలుగింటి ఆడబిడ్డ హిమబిందు.**



**గుంటూరు** జిల్లాకు చెందిన హిమబిందు తల్లిదండ్రులు బెంగళూరులో స్థిరపడ్డారు. తండ్రి బిజినెస్ మ్యాన్, తల్లి గృహిణి. చదువుతో పాటు అన్ని యాక్టివిటీస్‌లోనూ ముందుండే బిందుకు.. కేక్స్ తయారీ అంటే ఇష్టం. డిగ్రీ వరకు బెంగళూరులోనే చదివింది. ఆస్ట్రేలియాలో ఎంబీఏ చేసింది. రెండేండ్ల తర్వాత తిరిగి బెంగళూరుకి వచ్చింది. ఆ తర్వాత పెండ్లి, పిల్లలు. చిన్నప్పటి నుంచి బిందుకు ఏదైనా క్రియేటివ్‌గా చేయడం అంటే ఇష్టం. పిల్లల కోసం అప్పుడప్పుడు వెరైటీగా కేకులు తయారు చేస్తుండేది. ఒకరోజు తన స్నేహితురాలి కొడుకు పుట్టినరోజుకు కేకు తయారు చేసిచ్చింది హిమబిందు. ఆ వేడుకలో అంతా కేక్ గురించే మాట్లాడుకున్నారు. అంత రుచికరంగా ఉన్నది ఆ కేక్. దీంతో హిమబిందుకు చెప్పలేని ఆనందం. ఇలా మరిన్ని వెరైటీలు చేస్తే ఇంకెంత బాగుంటుందో అనుకున్నది. భర్త సహకారంతో బెంగళూరులోని బేకింగ్ బేసిక్ కోర్సులో చేరింది. 2012 నుంచి కేకుల తయారీ మొదలుపెట్టింది. మొదట్లో తెలిసిన వారంతా బిందూకే కేక్ ఆర్డర్ ఇచ్చేవారు. ఆ నోట ఈ నోట కేక్‌ల రుచి మరెందరికో తెలిసింది. ఎక్కువ సంఖ్యలో ఆర్డర్లు వస్తుండడంతో కేక్స్ అండ్ క్రంబ్స్ (cakes 'n' crumbs) బేకరీ ప్రారంభించింది.

**క్షణాల్లోనే వెరైటీ కేక్‌లు:** రుచితోపాటు వివిధ రకాల ఫ్లేవర్లలో కేక్‌లు తయారు చేయడంలో హిమబిందు సక్సెస్ అయింది. తనతో పాటుగా మరో ముగ్గురిని పనిలో పెట్టుకుంది. వారికి కొన్ని రోజులు శిక్షణ ఇచ్చింది. పెద్ద మొత్తంలో కావాలంటే నెల/వారం ముందు ఆర్డర్ ఇవ్వాలి. కేక్ రుచిగా తయారు చేయడం ఒక ఎత్తైతే.. దానిని అందంగా తయారు చేయడం మరో ఎత్తు. డెకరేషన్‌కు కావాల్సిన పూలు, బొమ్మలు సిద్ధం చేసుకోవాలి. వీటికే ఎక్కువ సమయం పట్టినా.. చాలా ఓపికతో కస్టమర్లు కోరుకున్న సమయానికే కేక్‌లు అందిస్తున్నది హిమబిందు. ప్రస్తుతం బెంగళూరు పరిసర ప్రాంతాల్లో 50 కిలోమీటర్లలోపు తన బాయ్స్‌తో సప్లయ్ చేయిస్తున్నది. కేక్‌ను చూడగానే అబ్బురపరిచేలా ఉండాలన్నది బిందు కాన్సెప్ట్. తన బేకరీకి మరో స్పెషాలిటీ ఏంటంటే 'మోడలింగ్ చాక్లెట్'.

### అందరికీ వర్క్‌షాపులు

వేడుకను బట్టి.. ఎలాంటి మోడల్స్ కావాలో చెబితే చాలు క్రియేటివ్‌గా చేసి కస్టమర్లకు అందిస్తున్నాం. దీని ధర రూ. 2000 నుంచి ప్రారంభమవుతుంది. మాకు ఈవెంట్ మేనేజర్లు కూడా కస్టమర్లుగా ఉన్నారు. ఒక్క కేక్ మాత్రమే కాకుండా పార్టీకి కావాల్సిన డెజర్ట్ టేబుల్ ఐటమ్ మొత్తాన్ని అందిస్తాం. నాకు కస్టమర్లను సంతృప్తి పరచడమే ముఖ్యం. భవిష్యత్తులో మోడలింగ్ చాక్లెట్‌ను ఇంకొంచెం క్రియేటివ్‌గా, పెద్ద పరిమాణంలో చేయాలనుకుంటున్నా. ప్రస్తుతం కేక్ తయారీ, డెకరేషన్‌పై వర్క్‌షాపులు నిర్వహిస్తున్నా. కొందరికి అవగాహన తరగతులు నిర్వహిస్తున్నాం. మరిన్ని వివరాల కోసం www.facebook.com/cakesncrumbsbangaloreలో చూడొచ్చు.

**అవార్డులు తెచ్చిన కేక్‌లు:** యునైటెడ్ కింగ్‌డమ్‌లోని కేక్ మాస్టర్స్ ప్రతియేడాది పదిమందికి 'ఇండియన్ టాప్ 10 కేక్ ఆర్టిస్ట్స్' పేరున అవార్డుని అందజేస్తుంది. 2018లో హిమబిందును ఈ అవార్డు వరించింది. 2019లో బెంగళూరులో జరిగిన 'ది గ్రేట్ బెంగళూరు బేక్ షో'కు న్యాయనిర్ణేతగా వ్యవహించింది. ఆ తర్వాత హైదరాబాద్‌లో జులై 10 నుంచి మూడు రోజుల పాటు జరిగిన 'ది గ్రేట్ ఇండియా బేక్ షో'కు కూడా హిమబిందు న్యాయనిర్ణేతగా వ్యవహరించింది. వందలాది మంది పాల్గొనే ఆ పోటీల్లో కేక్ రుచి చూసి విజేతను ప్రకటించడం చాలా కష్టమైన పని. ఎందుకంటే ఒక కేక్ రుచి చూడగానే మరొకటి అంత రుచిగా అనిపించకపోవచ్చు. అలాంటి కష్టతరమైె పోటీల్లో కూడా చాలా తెలివిగా, తనకున్న అనుభవంతో విజేతలను ప్రకటిస్తున్నది హిమబిందు. వాటికి మార్కులు ఎలా వేస్తారు అని అడిగితే.. 'కేక్‌ను చూడగానే ఒక ఐడియా వస్తుంది. దాన్ని కట్ చేసినప్పుడు అది గట్టిగా ఉందా? అందులో ఏం వాడారు, ఆరోగ్యానికి మంచిదేనా అన్న విషయాలు అర్థమవుతాయి. హోమ్ బేకింగ్ చేసేవారికి కొంచెం అనుభవం జోడిస్తే చాలు. ఇట్టే పసిగట్టేయొచ్చు' అంటున్నది హిమబిందు.

... వనజ వనిపెంట

## జలుబు బారిన పడకుండా..

**వర్షాకాలం వానల్లో తడవడం సహజం. ఇలా తడిసినప్పుడు ఎక్కువగా జలుబు, దగ్గు వస్తుంటాయి. అప్పుడప్పుడు జ్వరం కూడా రావొచ్చు. అయితే వానలో తడిసిన వెంటనే ఈ చిన్న టిప్స్ పాటిస్తే అనారోగ్యం దరిచేరదు.**

- వర్షంలో తడిసి జలుబు చేసినప్పుడు శొంఠి పొడిని నీళ్లలో కలిపి మరగబెట్టి తాగితే ఉపశమనం కలుగుతుంది. అలాగే మరుగుతున్న టీ లేదా కాఫీలో కూడా ఈ పొడిని కలిపి తీసుకున్నా ప్రయోజనం ఉంటుంది. మూడు పూటలు ఇలా చేస్తే జలుబు నుంచి పరిష్కారం దొరుకుతుంది.
- యాలకులు, లవంగాలు, దాల్చిన చెక్కను సమభాగాల్లో కలిపి చూర్ణం చేసుకుని భద్రపర్చుకోవాలి. కప్పు నీటిని మరిగించి, ఆ నీటిలో పావు చెంచా పొడి వేసి టీలా కాచుకోవాలి. చివర్లో ఎనిమిది తులసి ఆకులు వేసి వేడివేడిగానే తాగాలి. ఇలా నిత్యం చేస్తే వర్షాకాలంలో వచ్చే అనారోగ్యం నుంచి తప్పించుకోవచ్చు.
- కప్పు పాలల్లో అరచెంచా శొంఠి పొడి కలిపి కాసి గోరువెచ్చగా ఉన్నప్పుడు కొద్దిగా తేనె కలిపి తాగాలి. శొంఠి, పిప్పళ్లు, మిరియాలను విడివిడిగా మెత్తగా పొడి చేసి సమభాగాల్లో కలుపుకోవాలి. దీన్ని త్రికటు చూర్ణం అంటారు. ఇది జీర్ణక్రియను సైతం మెరుగుపరుస్తుంది. జ్వరం, దగ్గు, జలుబు, అలర్జీలని తగ్గిస్తుంది.
- రెండు చెంచాల శొంఠి కషాయంలో ఒక చెంచాడు ఆముదం కలిపి రాత్రి పడుకునేప్పుడు తాగితే విరేచనం సాఫీగా అవుతుంది. కడుపులో వాయువు తగ్గుతుంది. సయాటికా తగ్గుతుంది. ఇలా రోజు విడిచి రోజు మూడుసార్లు చేయవచ్చు.
- రెండు టీ గ్లాసుల చక్కెర పావుకిలో అల్లం ఒక గిన్నెలో వేసి నీళ్లు పోసి ఉడికించాలి. బాగా మరిగాక పాకం పట్టినట్లుగా అనిపించాక తీసి పక్కన పెట్టి చల్లార్చాలి. పూర్తిగా చల్లారక ముందే ఆ మిశ్రమాన్ని కత్తితో చిన్న చిన్న ముక్కలుగా చేసుకోవాలి. దీన్ని రోజూ తినడం వల్ల అజీర్తి సమస్య నుంచి బయటపడవచ్చు.



II.
నమస్తే తెలంగాణ
నిధి
[ కరీంనగర్ ]
శనివారం 3 ఆగస్టు 2019

## ఆరోగ్య బీమా అందుకోండిలా..

ఉదయం లేచింది మొదలు ఉరుకులు పరుగుల జీవితం.. సమయానికి సరైన తిండి కూడా తినకుండా.. లక్ష్యాలను చేరుకోవడానికి పరుగు పెట్టేవారి సంఖ్య తక్కువేం కాదు. బాసులు నిర్ణయించిన టార్గెట్లను అందుకోవడం మీద పెట్టేంత శ్రద్ధ.. ఆరోగ్య పాలసీని తీసుకోవడంలో పెడితే కుటుంబమంతా సంతోషంగా ఉంటుంది.



ఉద్యోగులైనా.. వ్యాపారులైనా.. నిదానంగా ఓసారి కూర్చొని ఆలోచించాలి. కాస్త యుక్త వయసులో సమయంతో పోటీపడి లక్ష్యాలను చేరుకోవడానికి పరుగులు పెడతారు. ఇలా పరుగులు పెట్టే క్రమంలో పొరపాటున ఏదైనా అనారోగ్య సమస్య తలెత్తితే మాత్రం.. కుటుంబ ఆర్థిక పరిస్థితులు చిన్నాభిన్నం అవుతాయి. భవిష్యత్తులో ఏదో జరుగుతుందని చెప్పడం కాదు కానీ.. అనుకోకుండా ఏర్పడే విపత్తు నుంచి మన జీవితాన్ని, మన కుటుంబ సభ్యులను రక్షించుకోవాలి. అందుకే, ఉద్యోగం చేసే ప్రతిఒక్కరూ ఆరోగ్య బీమా పాలసీని తప్పకుండా తీసుకోవాలి. మరి, ఇందుకోసం ఏయే అంశాలపై అధిక దృష్టి సారించాలంటే..

### ఇరవై ఏండ్లలో..

మనలో చాలామంది ఉద్యోగంలో చేరిన నాటి నుంచే ఆరోగ్య పాలసీని తీసుకుంటారు. 75 శాతానికి పైగా యువకులు కేవలం పన్ను రాయితీ కోసం ఆరోగ్య పాలసీ తీసుకోవడానికి ఆసక్తి చూపిస్తారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. 70 శాతానికి పైగా భారతీయులు ఆస్పత్రి ఖర్చులను తమ జేబులో నుంచి పెడుతుంటారు. పన్ను రాయితీని అటు ఉంచితే, ఆరోగ్య బీమా పాలసీ తీసుకునే వారు పలు అంశాలపై పక్కాగా దృష్టి సారించాలి.

- ఉద్యోగంలో చేరిన తర్వాత.. ఆస్పత్రిలో చేరే అవసరం రాదనుకోకూడదు. పొరపాటున డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధి బారిన పడి.. ఆస్పత్రిలో చేరాల్సి వస్తే.. ఖర్చు తడిసిమోపెడు అవుతుంది. కాబట్టి, ఆరోగ్య పాలసీ తీసుకునేటప్పుడు ఆస్పత్రి ఖర్చులు భరించేలా ఉండాలి. ప్రమాదం జరిగినా చికిత్స లభించేలా చూసుకోవాలి.

### ముప్పై వచ్చిందా?

ఇరవై నుంచి ముప్పయ్ ఏండ్లలోపు పెళ్లి చేసుకుంటే గనక.. మీ వ్యక్తిగత ఆరోగ్యమే కాకుండా.. కుటుంబం గురించీ ఆలోచించాలి. కాబట్టి, ఆరోగ్య పాలసీలో కొన్ని చికిత్సలుండేలా జాగ్రత్తపడాలి. ఉదాహరణకు, మొత్తం కుటుంబానికి కలిపి ఫ్యామిలీ ఫ్లోటర్ రక్షణ ఉండాలి. ఈ వయసులోనే సాధారణంగా పెళ్లి చేసుకునేవారు ఎక్కువ కాబట్టి.. మెటర్నిటీ కవర్ ఉంటే ఉత్తమం. పండంటి బిడ్డ పుట్టిన తర్వాత.. ఎలాంటి చికిత్సకైనా అందుబాటులో ఉండే విధంగా జాగ్రత్తపడాలి.

- మనం పని చేసే సంస్థలిచ్చే ఆరోగ్య పాలసీలు కొన్ని సందర్భాల్లో కుటుంబానికి పూర్తి భరోసాను ఇవ్వకపోవచ్చు. కాబట్టి, ఆ తేడా ఎంతుందో చూసి అదనపు హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీ కోసం సొంతంగా తీసుకుంటే ఉత్తమం. ఒకవేళ, పాలసీ తీసుకున్నాక.. దానిని వినియోగించుకోకపోతే.. మరుసటి ఏడాదిలో నో క్లెయిమ్ బోనస్ రాయితీని పొందవచ్చు. ఇది ప్రీమియం మొత్తం తగ్గడమో లేదా పాలసీ మొత్తం పెంచుకోవడమో చేయవచ్చు.



# మీ తల్లిదండ్రుల ఆరోగ్యం ఎలా ఉంది?

**తల్లిదండ్రులు కష్టపడి పిల్లల్ని పెంచుతారు. మంచి విద్యాబుద్ధులు చెప్పించడమే కాకుండా, తమ స్థాయిని మించి ఉన్నత చదువులను చెప్పించడానికి ప్రయత్నిస్తారు. ఇందుకోసం ఏ స్థాయిలోనూ రాజీపడరు. మొత్తానికి, తమ కళ్ల ముందే పిల్లలు ప్రయోజకులైతే, ఆ తల్లిదండ్రుల కళ్లల్లో కనిపించే ఆనందమే వేరు. మరి, చిన్నప్పట్నుంచి కంటికిరెప్పలా కాపాడిన తల్లిదండ్రులను బాగోగుల చూడాల్సిన బాధ్యత పిల్లలదే కదా? అందుకే, వారి కోసం మంచి ఆరోగ్య పాలసీ ఒకటి తీసుకోండి.**

మనల్ని కనిపెంచిన తల్లిదండ్రులు పదవీవిరమణ స్థాయికి చేరుకున్నారంటే.. అది నిజంగా గొప్ప ఆశీర్వాదమనే చెప్పాలి. జీవితంలో ఇదో బంగారు సమయమని అనుకోవాలి. మనం బాల్యదశలో ఉన్నప్పట్నుంచి కష్టించిన తల్లిదండ్రులకు కొంత అయినా విశ్రాంతి దొరికేదీ సమయంలోనే. ఈ దశలో వీరు తక్కువ పని చేయాలి. మనవళ్లు, మనవరాళ్లు, బంధుమిత్రులతో ఆనందంగా ఎక్కువ సమయం గడపాలి. ఒకవైపు సంతోషంగా కాలం వెళ్లదీస్తున్నప్పటికీ, మరోవైపు ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం లేకపోలేదు. ఈ విషయం వారు చెప్పకున్నా.. మీకు ఇట్టే తెలిసిపోతుంది. అందుకే, మీ తల్లిదండ్రులకు మెరుగైన ఆరోగ్య సౌకర్యాల్ని అందించాలంటే, వారికి అన్నిరకాలుగా ఉపయోగపడే ఆరోగ్య బీమా పాలసీని ఎంచుకోవాలి. ఇందుకోసం మార్కెట్లో అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయాలన్నీ పరిశీలించి తుది నిర్ణయానికి రావాలి. ఇందుకోసం మీరేం చేయాలంటే..

### ఆరోగ్య చరిత్ర తెలుసా?

మీ తల్లిదండ్రుల ఆరోగ్యానికి సంబంధించి పూర్తి చరిత్ర మీకు తప్పకుండా తెలిసి ఉండాలి. ప్రస్తుతం ఆరోగ్యపరంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలు, రోగాలు, చికిత్సకు తీసుకుంటున్న చర్యలు వంటివన్నీ కచ్చితంగా తెలుసుకోవాలి. కాస్త వీలు చేసుకుని అయినా, డాక్టర్ల వద్దకు వారిని తీసుకెళ్లి ఆరోగ్య పరిస్థితి గురించి అర్థం చేసుకోవాలి. ఆతర్వాత, వారికోసమే ప్రత్యేకంగా ఒక ఆరోగ్య పాలసీని తీసుకోవాలి. ఆ పాలసీ దేనికి వర్తిస్తుందో? దేనికి వర్తించదో ముందే కనుక్కోవాలి.

### పాలసీ పరిమితులు తెలుసుకోవాలి..

మార్కెట్లో అనేక సంస్థలు రకరకాల పాలసీలను అందజేస్తున్నాయి. వాటి పూర్తి వివరాలను అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి. ఒకవేళ ఆస్పత్రిలో చేరితే, ప్రతిరోజు అద్దె గదికి ఎంతిస్తారు? సర్జరీ, చికిత్సకయ్యే గరిష్ఠ పరిమితి వంటివి కనుక్కోవాలి. ఈ క్రమంలో కొన్ని పాలసీలు తక్కువ ప్రీమియం వసూలు చేయవచ్చు. కాకపోతే, అవి పలు నిబంధనల్ని విధిస్తాయని మర్చిపోవద్దు. కాబట్టి, వీలైనంత వరకూ పాలసీ నిబంధనల్ని తప్పకుండా తెలుసుకోవాలి. పాలసీ పరిమితుల్ని క్షుణ్నంగా అర్థం చేసుకున్నాకే తుది నిర్ణయానికి రావాలి.

### అవగాహన పెంచుకోవాలి..

మీరు పాలసీని ఎంచుకునేటప్పుడు, ఎలాంటి పరిమితులు లేకుండా ఉన్నవే తీసుకోవాలి. అలాంటి అవకాశం లేనప్పుడు తక్కువ పరిమితులున్న వాటిని ఎంచుకోవడం ఉత్తమం. అంతేతప్ప, తల్లిదండ్రులకు పాలసీలను తీసుకోకుండా మాత్రం ఉండకూడదు. పైగా, మీ తల్లిదండ్రుల వయసు అరవై దాటితే, అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. అందుకోసం బీమా సంస్థలు ప్రీమియం ఎక్కువ వసూలు చేయవచ్చు. లేదా, మీకు తెలియకుండా కొత్త నిబంధనల్ని జోడించవచ్చు. ఇలాంటి వాటి గురించి ముందే అవగాహన పెంచుకోవాలి.



### పెద్దల పాలసీ ముఖ్యాంశాలు

| ముఖ్య అంశాలు | రెడ్‌కార్పెట్ స్టార్ హెల్త్ | కేర్ ఫ్రీడమ్ రెలిగేర్ హెల్త్ | ఆప్టిమా సీనియర్ అపోలో మ్యూనిచ్ | సిల్వర్ హెల్త్ బజాజ్ అలియాంజ్ |
|---|---|---|---|---|
| ఏ వయసు ఉండాలి? | 60–75 ఏండ్లు | 18 ఏండ్లు– ప్లాన్ 1<br>46 ఏండ్లు– ప్లాన్ 2 | 61 ఏండ్లు పైబడి | 46– 70 ఏండ్లు |
| మెడికల్ చెకప్ | అవసరం లేదు | ప్లాన్ 1– అవసరం లేదు<br>ప్లాన్ 2–అవసరం | అవసరం | అవసరం |
| ముందస్తు వ్యాధులకు వెయిటింగ్ పీరియడ్ | 24 నెలలు | 24 నెలలు | 36 నెలలు | 12 నెలలు |
| డే కేర్ ప్రొసీజర్ | మొత్తం | 170+కి పైగా | 140 | 130 |

### విడిగా తీసుకోవడం మేలు..

మీ తల్లిదండ్రులకు తీసుకునే పాలసీ మొత్తం ఎంతుండాలనే విషయంలో ఒక స్పష్టత రావాలి. ఒకసారి పాలసీ తీసుకున్న తర్వాత, వారి పాలసీ మొత్తాన్ని పెంచడం చాలా కష్టమైన ప్రక్రియ. కాబట్టి, వారి వయసు ఎనభైకి చేరుకునేసరికి ఎంత అవుతుందనే విషయాన్ని అంచనా వేసి తుది నిర్ణయానికి రావాలి. ఇందుకోసం ఏటా 8 నుంచి 10 శాతం ద్రవోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుని పాలసీని ఎంచుకోవాలి. కొన్ని సందర్భాల్లో పెద్దలకు విడిగా ఆరోగ్య పాలసీ తీసుకోవడమెంతో సులువు. దరఖాస్తు పత్రంలో తల్లిదండ్రుల వివరాల్ని నింపి, వారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, చరిత్ర గురించి పేర్కొనాలి. ఆతర్వాత, వారు నిర్ణయించిన ప్రీమియాన్ని చెల్లించాలి. మీరు దరఖాస్తు చేసుకున్న తర్వాత, బీమా సంస్థ మీ తల్లిదండ్రుల ఆరోగ్య పరిస్థితుల్ని అంచనా వేస్తుంది. వీలైతే, ఒకసారి ఆరోగ్య పరీక్షలను చేయించాలని సూచిస్తుంది. ఆ రిపోర్టు ఆధారంగా పాలసీని జారీ చేస్తుంది.. అదనపు ప్రీమియం చెల్లించమంటుంది.. లేదా దరఖాస్తు తిరస్కరించొచ్చు.

### మీ సంస్థ పాలసీ ఇచ్చిందా?

మీరు తల్లిదండ్రులకు తీసుకున్న ఆరోగ్య పాలసీ ప్లాన్ ప్రకారమే బీమా సంస్థలు క్లెయిమ్‌లను చెల్లిస్తాయి. నగదురహిత ప్రయోజనాలు అందుకోవాలంటే, బీమా సంస్థ నెట్‌వర్క్ పరిధిలో ఉన్న ఆస్పత్రిలో చేరడం ఉత్తమం. అందుకు సంబంధించి ముందే, ఆస్పత్రి వర్గాలకు సమాచారం ఇవ్వడం కీలకం. ఒకవేళ, మీకు వివిధ రకాల పాలసీలు ఉన్నట్లయితే, మీ సంస్థ ఇచ్చిన పాలసీని ఉపయోగించుకోవడమే ఉత్తమమని గుర్తుంచుకోండి.

# ఎవరెంత పన్ను కట్టాలి?

**పన్ను విషయానికిస్తే రకరకాల సందేహాలు పట్టిపీడిస్తుంటాయి. ఉద్యోగులే కాదు మహిళలు, వృద్ధుల్లోనూ ఈ తరహా సందేహాలు సర్వసాధారణమే. ఇలాంటి ఇబ్బందుల్ని గమనించిన 'నిధి'.. ఎవరెంత పన్ను శాతం కట్టాలి? సర్‌ఛార్జీ, ఆరోగ్య, విద్యాసెస్సు శాతమెంత? మొత్తానికి ఎంత పన్ను కట్టాలనే విషయంపై అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నది. ఏడాదికి ప్రతిఒక్కరూ కట్టాల్సిన నికర పన్ను శాతమెంతో ఈ పట్టిక చూస్తే ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది.**

| శ్లాబులు | పన్ను | సర్‌ఛార్జీ విద్య సెస్సు (4 శాతం) | ఆరోగ్యం, పన్ను రేటు | మొత్తం |
|---|---|---|---|---|
| **వ్యక్తులు, హిందు అవిభాజ్య కుటుంబం** | | | | |
| రూ.2.50 లక్షల వరకూ | – | – | – | – |
| రూ.2,50,001 – 5 లక్షలు | 5 % | – | 0.20 | 5.20% |
| రూ.5,00,001 – 10 లక్షలు | 20 % | – | 0.80 | 20.80% |
| రూ.10,00,001 – 50 లక్షలు | 30 % | – | 1.20 | 31.20% |
| రూ.50,00,001 – రూ. 1కోటి | 30 % | 3 | 1.32 | 34.32% |
| రూ. 1 కోటికి మించితే | 30 % | 4.5 | 1.38 | 35.88% |
| **మహిళలు** | | | | |
| రూ.2.50 లక్షల దాకా | – | – | – | – |
| రూ.2,50,001 – 5 లక్షలు | 5 % | – | 0.20 | 5.20% |
| రూ.5,00,001 –10 లక్షలు | 20 % | – | 0.80 | 20.80% |
| రూ.10 లక్షల –50 లక్షలు | 30 % | – | 1.20 | 31.20% |

### గుర్తుంచుకోండి..

ఏడాదికి రూ.2.5 లక్షలు ఆర్జించే వ్యక్తులు ఎలాంటి పన్ను చెల్లించక్కర్లేదు. అదే రూ. 2.51 లక్షల నుంచి రూ.5 లక్షలను ఆర్జించేవారు ఐదు శాతంతో పాటు ఆరోగ్య, విద్యా సెస్సు నాలుగు శాతాన్ని కలుపుకుంటే, మొత్తం 5.20 శాతం చెల్లించాల్సి ఉంటుంది. రూ. 5 నుంచి 10 లక్షల వరకూ ఆదాయాన్ని ఆర్జించేవారు మొత్తం 20.80 శాతం పన్ను కట్టాల్సి ఉంటుంది.

- 60 ఏండ్లలోపు వయస్సు కలిగి పన్ను పరిధిలోకి వచ్చే రూ. 5 లక్షల వరకు ఆదాయం ఉన్నవారికి రూ.12,500 దాకా పన్ను రిబేటు లభిస్తుంది.
- రూ. 5 లక్షల కంటే అధిక పన్ను ఆదాయముంటే సెక్షన్ 89ఏ కింద రిబేటు లభించదు
- పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం రూ.50 లక్షల నుంచి రూ. 1 కోటి లోపు ఉంటే 10 శాతం అదనపు ఛార్జీలుంటాయి.
- పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం రూ. 1 కోటి పైన ఉంటే పన్ను మొత్తంలో 15 శాతం అదనపు ఛార్జీలు ఉంటాయి.
- ఆరోగ్యం, విద్యా సెస్సు పన్ను మొత్తం అదనపు ఛార్జీపై 4 శాతం ఉంటుంది.




– గంధం శివకృష్ణ,
ఛార్టెడ్ అకౌంటెంట్



# ప్రీమియం చూసి ఎంచుకోవద్దు..

**ప్రీమియం తక్కువ ఉన్నదని బీమా పాలసీలను ఎంచుకోవద్దు. ఆయా సంస్థ క్లెయిముల చెల్లింపు విధానాన్ని చూసి తుది నిర్ణయం తీసుకోవాలి. అంతేకాదు, మీ కుటుంబం జీవన విధానానికి ఎలాంటి భంగం కలిగించని విధంగా ఉండాలి.**

టెర్మ్ పాలసీల విలువ ఇప్పుడిప్పుడే చాలామందికి అర్థమవుతుంది. కాకపోతే, అధిక శాతం మందికి తెలియని విషయం ఏమిటంటే, ఈ పాలసీలను ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలూ విక్రయిస్తుంటాయి. ఎల్ఐసీ వంటి ప్రభుత్వ ప్రాయోజిత సంస్థలతో పోల్చితే, ప్రైవేటు సంస్థల టెర్మ్ పాలసీల ప్రీమియం రేట్లు తక్కువుంటాయి. అందుకే, వీటిని ఎంచుకోవడానికి అధిక ప్రాధాన్యతనిస్తారు. ఒకే రకమైన ప్రయోజనాల్ని రెండు సంస్థలు కల్పిస్తుంటే.. వాటి ప్రీమియంను చూసి చాలామంది నిర్ణయం తీసుకుంటారు. కాకపోతే, ప్రీమియం ఒక్కటే చూడొద్దని నిపుణులు అంటున్నారు. పాలసీని సులువుగా తీసుకోవడం, క్లెయిముల చెల్లింపు విధానం, పాలసీ ప్రత్యేకతలేమిటి? వంటి అంశాల్ని గమనించాలి. ఎల్ఐసీ సుమారు 98 శాతం దాకా క్లెయిములను పరిష్కరిస్తుందని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. అందుకే, ప్రీమియం బెడదను తప్పించుకోవడానికి తక్కువ కాలానికి పాలసీని తీసుకోవద్దు. అది గడిచిన తర్వాత, కొత్త ప్లాన్‌ను ఎంచుకోవడానికి అధిక ప్రీమియం చెల్లించాల్సి వస్తుందని మర్చిపోవద్దు.

# రెండింటి మధ్య తేడా..

**మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టాలనుకునేవారు డైవర్సిఫైడ్ ఈక్విటీ స్కీం, ఈఎల్ఎస్ఎస్ పథకాల గురించి తప్పక తెలుసుకోవాలి.**



డైవర్సిఫైడ్ ఈక్విటీ స్కీం, ఈఎల్ఎస్ఎస్ స్కీముల్లో స్టాకులు, వివిధ రంగాల ఎంపికలో కొంత తేడా ఉంటుంది. ఈఎల్ఎస్ఎస్‌లో ఉన్న ఏకైక ప్రయోజనం.. సెక్షన్ 80–సీ పన్ను ప్రయోజనం లభించడమే. డైవర్సిఫైడ్ ఈక్విటీ స్కీములో ఇలాంటి రాయితీ లభించదు. మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టాలని అనుకున్నప్పుడు గత పెట్టుబడుల గురించి పరిశీలించాలి. ప్రస్తుతం మన పెట్టుబడిని అంచనా వేసుకోవాలి. ఆర్థిక లక్ష్యాన్ని చేరుకోవడానికి మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టడం ఎంత వరకు సాయపడుతోందో తెలుసుకోవాలి.

# వ్యక్తిగత రుణం ఎవరికిస్తారు!

అత్యవసరాల్లో సొమ్ము కావాలంటే ప్రతిఒక్కరికీ ముందుగా గుర్తుకొచ్చేది వ్యక్తిగత రుణాలే. అందుకే ఉద్యోగులైనా, స్వయం ఉపాధి పొందేవారైనా.. తమ వ్యక్తిగత అవసరాల నిమిత్తం ఈ రుణం తీసుకోవడానికి ముందుకొస్తారు. ఈ తరహా రుణాల్ని తీసుకోవడానికి బ్యాంకులు ఎలాంటి సెక్యూరిటీని కోరవు. కాకపోతే, ఈ రుణాలపై వడ్డీ రేటు కాస్త ఎక్కువే ఉంటుంది. మరి, వ్యక్తిగత రుణాలను ఎవరికిస్తారు? ఉద్యోగం లేదా వ్యాపారంలో ఎంత అనుభవం ఉండాలి? రుణం తీసుకునే వ్యక్తి వయసు ఎంతుండాలి? గరిష్ఠంగా ఎంతవరకూ రుణానికి అర్హులో చూసేద్దామా..



| బ్యాంకు | గరిష్ఠ రుణమెంత? | గరిష్ఠ వ్యవధి? | రుణగ్రహీత వయసు? | ఉద్యోగ అనుభవం |
|---|---|---|---|---|
| ఎస్‌బీఐ | 15 లక్షలు | 48 నెలలు | 21– 58 | 24 నెలలు |
| హెచ్‌డీఎఫ్‌సీ | 50 లక్షలు | 60 నెలలు | 21– 60 | 12 నెలలు |
| ఐసీఐసీఐ | 30 లక్షలు | 60 నెలలు | 23– 58 | 24 నెలలు |
| సిటీ బ్యాంకు | 30 లక్షలు | 60 నెలలు | 23– 60 | 36 నెలలు |
| యాక్సిస్ | 15 లక్షలు | 60 నెలలు | 21– 60 | 12 నెలలు |
| ఇండస్‌ఇండ్ | 25 లక్షలు | 60 నెలలు | 21–58 | 36 నెలలు |
| కోటక్ బ్యాంకు | 15 లక్షలు | 60 నెలలు | 22–55 | 24 నెలలు |
| ఆర్‌బీఎల్ బ్యాంకు | 20 లక్షలు | 60 నెలలు | 25–60 | 36 నెలలు |
| స్టాండర్డ్ ఛార్టడ్ | 30 లక్షలు | 60 నెలలు | 23–58 | 36 నెలలు |
| యూనియన్ బ్యాంకు | 5 లక్షలు | 60 నెల | 21–58 | – |
| కెనెరా బ్యాంకు | 3 లక్షలు | 48 నెలలు | 21–60 | 36 నెలలు |
| యెస్ బ్యాంకు | 20 లక్షలు | 60 నెలలు | 21–60 | 24 నెలలు |
| ఇండియన్ ఓవర్సీస్ | 15 లక్షలు | 60 నెలలు | 21–58 | 36 నెలలు |
| కార్పొరేషన్ బ్యాంకు | 2.5 లక్షలు | 36 నెలలు | 21–58 | – |
| పంజాబ్ నేషన | 15 లక్షలు | 60 నెలలు | 21–58 | – |
| సిండికేట్ బ్యాంకు | 2 లక్షలు | 60 నెలలు | 21–58 | – |
| ఐడీబీఐ బ్యాంకు | 10 లక్షలు | 60 నెలలు | 21–58 | – |
| అలహాబాద్ బ్యాంకు | 7.50 లక్షలు | 60 నెలలు | 21–58 | 24 నెలలు |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 2 లక్షలు | 36 నెలలు | 21–58 | 24 నెలలు |
| ఆంధ్రాబ్యాంకు | 5 లక్షలు | 60 నెలలు | 21–55 | – |

★ కేవలం అవగాహన కోసమే ఈ పట్టిక. బ్యాంకుతో మీకున్న అనుబంధం, మీ లావాదేవీల రికార్డును బట్టి గరిష్ఠ రుణమొత్తం పెరిగే అవకాశముంది.

## సుడోకు

డైలీ సుడోకు 103 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 9 | 7 | 6 | 5 | 8 | 2 | 3 | 1 | 4 |
| 5 | 2 | 4 | 1 | 7 | 3 | 9 | 6 | 8 |
| 1 | 8 | 3 | 4 | 6 | 9 | 2 | 5 | 7 |
| 4 | 6 | 9 | 2 | 5 | 7 | 1 | 8 | 3 |
| 3 | 5 | 8 | 9 | 1 | 4 | 6 | 7 | 2 |
| 2 | 1 | 7 | 6 | 3 | 8 | 4 | 9 | 5 |
| 6 | 3 | 1 | 7 | 4 | 5 | 8 | 2 | 9 |
| 7 | 4 | 2 | 8 | 9 | 6 | 5 | 3 | 1 |
| 8 | 9 | 5 | 3 | 2 | 1 | 7 | 4 | 6 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతి వరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

### డైలీ సుడోకు -104

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | | | | | 4 | 9 | 3 | |
| | | | | 3 | | | 6 | |
| | 9 | | | 2 | | 1 | | |
| | | 2 | | 8 | 9 | | | 7 |
| | | 9 | | | | 4 | | |
| 5 | | | 7 | 4 | | 3 | | |
| | | 8 | | 6 | | | 4 | |
| | 2 | | | 9 | | | | |
| | 6 | 7 | 2 | | | | | 9 |

నమస్తే తెలంగాణ
సంపద
[ కరీంనగర్ ]
శనివారం 3 ఆగస్టు 2019



ప్రతికూల పరిస్థితుల్ని చూసి భయపడి.. తనేం చేయలేనని నీరసపడిపోయి.. వెనకడుగు వేస్తే జీవితంలో ఏం సాధించలేమని ఆ యువకుడు భావించాడు. కష్టపడి ఎన్‌ఏసీలో కొత్త నైపుణ్యాల్ని నేర్చుకున్నాడు. రష్యాలో జరిగే ప్రపంచ పోటీలకు సిద్ధమవుతున్నాడు.

## నార్సింగి నుంచి రష్యా దాకా..

మెదక్ జిల్లా నార్సింగికి చెందిన రాజిరెడ్డి అనే యువకుడు డిగ్రీలోనే చదువు ఆపేశాడు. కుటుంబం కోసం పెట్రోల్ పంపులో చేరాడు. తర్వాత, హైదరాబాద్‌లోని ఎన్‌ఏసీలో 'డ్రై వాల్ అండ్ ఫాల్స్ సీలింగ్స్'పై మూడు నెలల శిక్షణను తీసుకున్నాడు. కుటుంబానికి మెరుగైన జీవనాన్ని ఇవ్వడానికి ప్రయతిస్తుండగా.. ఎన్‌ఏసీ నుంచి ముంబైలోని సెయింట్ గోబెయిన్ జిప్రాక్ సంస్థలో చేరాడు. ఆరు నెలల పాటు శిక్షణ తీసుకున్న అనంతరం, అక్కడి స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఇమ్మానుయేల్ రాజిరెడ్డికి వరల్డ్ స్కిల్ పోటీలకు సన్నద్ధం కావాలని సూచించారు. దీంతో 2018 మే నుంచి సన్నాహాల్ని మొదలెట్టాడు. దేశవ్యాప్తంగా జరిగిన పోటీల్లో అనేక మందితో పోటీపడి గోల్డ్ మెడల్‌ను సాధించాడు. ప్రస్తుతం రష్యాలో జరిగే ప్రపంచ పోటీలకు సన్నద్ధం అవుతున్నాడు. జిప్సం ప్లాస్టరింగ్, డ్రై వాల్ విభాగంలో అంతర్జాతీయ పోటీల్లో ఇండియా నుంచి పోటిపడుతున్న ప్రప్రథమ యువకుడు రాజిరెడ్డి. రష్యాలో జరిగే అంతర్జాతీయ పోటీలో విజయవంతం కావాలని ఆకాంక్షిద్దాం.

## రెండున్నర కోట్ల ఇండ్లు కావాలి

దేశవ్యాప్తంగా మొత్తం జనాభాలో 34 శాతం మంది పట్టణ ప్రాంతాల్లోనే జీవిస్తున్నారు. ఈ పరిస్థితి దేశంలో 25 మిలియన్ల ఇండ్ల కొరతకు దారితీస్తుంది. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో 10 మిలియన్ల ఇండ్ల కొరత ఉంది. అది కూడా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల్లోనే గృహాల ఎక్కువగా నెలకొంది. అయితే, 2022 వరకూ అందరికీ అందుబాటు గృహాలు అందించడంలో భాగంగా ఇప్పటికే కేంద్రం 80 లక్షల ఇండ్లను మంజూరు చేసింది. అందులో 50 లక్షల ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. 20 లక్షల నిర్మాణం పూర్తయింది. వచ్చే డిసెంబర్ వరకు అదనంగా మరో కోటికి పైగా గృహాల్ని మంజూరు చేస్తారు. మరి, మన రాష్ట్రంలో అందుబాటు గృహాలను ప్రోత్సహించడానికి కేంద్రం సాయం చేయాల్సిన అవసరముంది.

# ఆధునిక ఆవిష్కరణలకు క్రెడాయ్ న్యాట్‌కాన్

**నిర్మాణాల్లో వినియోగించే ఆధునిక పరిజ్ఞానం గురించి నిత్యం తెలుసుకోవాలి.. ఈ రంగంలో అనుసరించే ఉత్తమ ప్రమాణాలపై అవగాహన పెంచుకోవాలి.. అత్యుత్తమ నిర్మాణాల్ని స్వయంగా పరిశీలిస్తే అనేక కొత్త విషయాలు వెలుగులోకి వస్తాయి. పైగా, ఏమైనా సందేహాలుంటే వాటిని నివృత్తి చేసుకునే వీలు కలుగుతుంది. ఇలాంటి చక్కటి ఉద్దేశ్యంతో.. క్రెడాయ్ జాతీయ సంఘం ప్రతిఏటా న్యాట్‌కాన్ సదస్సును విదేశాల్లో నిర్వహిస్తుంది. విదేశీ నిర్మాణ రంగం నుంచి ఎప్పటికప్పుడు సరికొత్త విషయాల్ని తెలుసుకునేందుకు క్రెడాయ్ కొన్నేండ్ల నుంచి ప్రయత్నిస్తుంది. ఈ క్రమంలో 19వ సదస్సును ఇజ్రాయేల్‌లోని టెల్ అవీవ్‌లో జరుపుతున్నది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. సదస్సు నిర్వహణ బాధ్యతల్ని ఈసారి క్రెడాయ్ తెలంగాణ సంఘం చేపడుతున్నది.**



దేశవ్యాప్తంగా దాదాపు 1300 మంది డెవలపర్లు.. మన తెలంగాణ నుంచి రెండు వందలకు పైగా బిల్డర్లు.. ఇజ్రాయేల్‌లోని టెల్ అవీవ్‌కు చేరుకున్నారు. మొత్తానికి దక్షిణ భారతదేశం నుంచే అధిక శాతం మంది సదస్సులో పాల్గొంటున్నారు. భారత నిర్మాణ రంగంలో చోటు చేసుకుంటున్న తాజా పోకడల్ని టెల్ అవీవ్ సదస్సులో చర్చిస్తారు. గత ఏడాది కాలంలో ఈ రంగం ఎదుర్కొన్న సమస్యలు, వాటిని అధిగమించిన తీరు గురించి నిపుణులు సభాముఖంగా వివరిస్తారు. టెల్ అవీవ్ సదస్సులో ఈసారి తెలంగాణ రాష్ట్రమే ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నది. ఎందుకంటే, దేశంలోనే ఏ రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించని విధంగా.. మన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఈ రంగంలో సింగిల్ విండో విధానానికి ఈమధ్యే శ్రీకారం చుట్టారు. గత పదిహేను, ఇరవై ఏండ్ల నుంచి దేశమంతటా దీన్ని గురించి చర్చిస్తుంటే, తెలంగాణ రాష్ట్రం మాత్రం అన్ని రాష్ట్రాల కంటే ముందుగా ఈ విధానాన్ని అమలు చేయడానికి పచ్చజెండా ఊపింది. ఇదే అంశం, ఈసారి న్యాట్‌క్యాన్ సదస్సులో చర్చకు వచ్చే అవకాశముందని క్రెడాయ్ వర్గాలు భావిస్తున్నాయి. పైగా, దేశమంతటా నిర్మాణ రంగం కునారిల్లుతుంటే.. తెలంగాణలో మాత్రం మూడు పూవులు ఆరు కాయలుగా విరాజిల్లుతున్నది. అసలు ఏ రాష్ట్రంలో లేని రియల్ రంగం పెరుగుదల మన తెలంగాణలో గత రెండేండ్ల నుంచి స్పష్టంగా కనిపిస్తున్నది. పైగా, మన ప్రభుత్వం ప్రత్యేకంగా మున్సిపల్ చట్టాన్ని తీసుకురావడం, శాటిలైట్ టౌన్‌షిప్పులను ఏర్పాటు చేసే అంశానికి చట్టంలో స్థానం కల్పించడం వంటి అంశాల వల్ల తెలంగాణ వ్యాప్తంగా రియల్ రంగం గణనీయంగా అభివృద్ధి చెందడానికి ఆస్కారముందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

### ఇజ్రాయేల్ ప్రధాని హాజరు..

ఇజ్రాయేల్ మొదటి రోజు సదస్సుకు ఇజ్రాయేల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతాన్యహూ ముఖ్య అతిథిగా హాజరవుతారు. టెల్‌అవీవ్ మేయర్ రాన్ హుల్దయ్, ఇజ్రాయేల్ అంబాసిడర్ పవన కపూర్, హెచ్‌డీఎఫ్‌సీ ఎండీ రేణుసూద్, క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు సతీష్ మగర్, ఛైర్మన్ జక్సే షా తదితరులు పాల్గొంటారు. ఇజ్రాయేల్ చరిత్రలోనే గతంలో ఎన్నడూ జరగనంత అతిపెద్ద సదస్సు ఇదే కావడం గమనార్హం. ఆ దేశ పరిస్థితులకు, మన రియల్ రంగం స్థితిగతులకు అతికినట్లు సరిపోతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇంకా, ఈ సదస్సులో ఏయే అంశాలు చర్చకొస్తాయంటే..

- వాణిజ్య సముదాయాల్లో ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించడం వల్ల కలిగే లాభనష్టాలపై చర్చిస్తారు. ఉద్యోగుల అంతర్గత సామర్థ్యాన్ని పెంపొందించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను డెలాయిట్ హ్యూమన్ కేపిటల్ హెడ్ డా. మాయా ఇంబర్మన్ వివరిస్తారు. ఇజ్రాయేల్‌లో రియల్ రంగం స్థితిగతుల గురించి ప్రత్యేక చర్చ జరుపుతారు. కొత్తతరం కొనుగోలుదారుల ఆలోచనా విధానం, కొనుగోలుదారులకు మెరుగైన సేవల్ని అందించడమెలా? రియల్ రంగంలో సుస్థిరతను సాధించడమెలా? వంటి పలు అంశాలపై ప్రత్యేక చర్చలుంటాయి.



### టెల్ అవీవ్ సదస్సు సదావకాశం..

తెలంగాణకు చెందిన బిల్డర్లు, డెవలపర్లు ప్రపంచ నిర్మాణ రంగం పోకడల గురించి తెలుసుకోవడానికి ఇదో చక్కటి అవకాశం. విదేశాల్లో నిర్మాణాల నాణ్యత, ఆయా సంస్థలు పాటించే ఉత్తమ ప్రమాణాల్ని తెలుసుకుంటే, ఇక్కడా వాటిని అమలు చేయడానికి వీలు కలుగుతుంది. ఇజ్రాయేల్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఘనవ్యర్థాల నిర్వహణ వంటి అంశాల్లో సరికొత్త విధానాల్ని తెలుసుకునే అవకాశమున్నది. ఈ సదస్సు విజయవంతం అవుతుందని, తెలంగాణ డెవలపర్లకు ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను.

– గుమ్మి రాంరెడ్డి,
అధ్యక్షుడు, క్రెడాయ్ తెలంగాణ



### ఇజ్రాయేల్ నుంచి నేర్చుకోవాలి..

ఇజ్రాయేల్ నిర్మాణ రంగం గురించి మన దేశీయ బిల్డర్లంతా తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. నాణ్యమైన నిర్మాణాల్ని చేపట్టడమే కాదు.. మెరుగైన రీతిలో పౌరసేవలు లభిస్తాయి. స్థానిక సంస్థలు ఘనవ్యర్థాల నిర్వహణను సమర్థంగా చేపడతాయి. నిర్మాణ రంగంలో ఆధునిక ఆవిష్కరణలకు ఇజ్రాయేల్ పెట్టింది పేరు. నిర్మాణాల్లో కాలుష్యాన్ని తగ్గించడానికి వాతావరణ అనుకూలమైన పరిజ్ఞానాన్ని అక్కడ వినియోగిస్తారు. వాణిజ్య సముదాయాలకు ఆధునిక పరిజ్ఞానాన్ని జోడించి ఎంతో స్మార్ట్‌గా నిర్మిస్తారు.

– చెరుకు రామచంద్రారెడ్డి,
కో-కన్వీనర్, క్రెడాయ్ న్యాట్‌కాన్



# అమ్మకాలు ఎందుకు తగ్గాయ్?

**దేశమంతటా నిర్మాణ రంగం ఇబ్బంది పడుతున్నది. ఇక్కడ మాత్రం సానుకూల పరిస్థితులు నెలకొన్నాయి. వాణిజ్య సముదాయాలు, రిటైల్ రంగానికి ఎక్కడ్లేని గిరాకీ పెరుగుతున్నది. కాకపోతే, ఆశించిన స్థాయిలో ఫ్లాట్ల అమ్మకాలు మాత్రం పెరగడం లేదు. పైగా, గత కొంతకాలం నుంచి తగ్గుముఖం పట్టింది. మరి, క్రమక్రమంగా ఫ్లాట్ల అమ్మకాలు ఎందుకు తగ్గుతున్నాయి? ఇందుకు గల కారణాలేమిటి? ప్రమోటర్లు తీవ్రంగా ఆలోచించాల్సిన అవసరమున్నది.**

తెలంగాణలో రెరా అథారిటీ ఏర్పడిన నేపథ్యంలో.. డెవలపర్లు చాలా పక్కగా వ్యవహరించాల్సిన అవసరముంది. ఎక్కడో ఒక చోట స్థలం తీసుకుని అపార్టుమెంట్ కట్టగానే కొనుగోలుదారులు వచ్చి ఫ్లాట్లు కొంటారనే రోజులు లేవిప్పుడు. ఏయే తరహా ఇండ్లకు మార్కెట్లో డిమాండ్ ఉందనే విషయాన్ని డెవలపర్లు పక్కాగా అంచనా వేశాకే ప్రాజెక్టులను ప్రారంభించాలి. సేల్స్ అండ్ మార్కెటింగ్ జట్టు చాలా పటిష్ఠంగా ఉండాలి. ఫ్లాట్ల విస్తీర్ణం అందుబాటులో ఉండి, సకాలంలో అందజేస్తామని చెప్పి, నాణ్యతలో ఎక్కడా రాజీపడమని కొనుగోలుదారుల్లో విశ్వాసం కలిగించాలి. పైగా, డెవలపర్లు కొనుగోలుదారులతో నేరుగా మాట్లాడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే, ఈ విషయం కొందరు డెవలపర్లకు ప్రస్తుతం అర్థం కాకపోవచ్చు. 'రెరా' అమల్లోకి వచ్చిన నేపథ్యంలో.. ప్రతిఒక్క డెవలపర్ తప్పకుండా తమ పంథాను మార్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

- అభివృద్ధికారకమైన ప్రభుత్వం, ప్రోత్సాహకర విధానాలతో దూసుకెళుతుండటం వల్ల.. భాగ్యనగరంలో వాణిజ్య సముదాయాలకు గిరాకీ పెరుగుతోంది. ఇది పెరుగుతూనే ఉంటుంది తప్ప తగ్గే ప్రసక్తే లేదు. కాబట్టి, హైదరాబాద్ రియల్ రంగానికి రానున్న రోజుల్లో తప్పకుండా ఆదరణ మరింత పెరుగుతుంది. కాకపోతే, గత ఏడాది నుంచి కొందరు ప్రమోటర్లు ఇష్టం వచ్చినట్లు ఫ్లాట్లను రేట్లను పెంచేశారు. కానీ, కొనుగోలుదారుల జీతాలు మాత్రం అంతే స్థాయిలో పెరిగిన దాఖలాల్లేవు. దీంతో, మెల్లిమెల్లిగా కొనుగోలుదారులు ఫ్లాట్లను కొనడానికి వెనకడుగు వేస్తున్నారు.

# రెరాను పట్టించుకోని రియల్టర్లు

"'రెరా' వస్తే మాకేంటి? మేం మాత్రం లేఅవుట్లను వేస్తాం.. మా ఇష్టం వచ్చినట్లు ప్లాట్లను విక్రయిస్తాం. మమ్మల్ని ఎవరైనా ఆపగలరా?' అన్నట్లు కొందరు రియల్టర్లు వ్యవహరిస్తున్నారు. ఇలా ఒకరిని చూసి మరొకరు రెరాలో నమోదు చేసుకోకుండానే అమాయక బయ్యర్లకు ప్లాట్లను అంటగట్టేస్తున్నారు. స్థానిక సంస్థల అనుమతులు తీసుకోకుండా పంచాయతీ అనుమతి తీసుకుని రేటు తక్కువంటూ అమ్మేస్తున్నారు. మరికొందరు రియల్టర్లు సాఫ్ట్‌లాంచ్‌లు, ప్రీలాంచ్‌ల పేరిట అమాయక కొనుగోలుదారులకు ఫ్లాట్లను విక్రయిస్తున్నారు. అయితే, ఇక నుంచి తమ అనుమతి తీసుకోకుండా ప్లాట్లను విక్రయించే సంస్థలపై కొరడా ఝుళిపించడానికి రెరా సమాయత్తం అవుతున్నది.




500 చదరపు మీటర్లు లేదా అంతకుమించిన విస్తీర్ణంలో 8 లేదా అంతకుమించిన ప్లాట్లు, ఫ్లాట్లను అభివృద్ధి చేసే రియల్ ఎస్టేట్ సంస్థలన్నీ తెలంగాణ రెరా అథారిటీ వద్ద నమోదు చేసుకోవాల్సిందే. పైగా, రియల్టర్లు తమ వెంచర్లను నమోదు చేయడానికి ఫీజు కూడా అతి తక్కువే. దేశవ్యాప్తంగా ఏర్పడ్డ రెరా అథారిటీలను గమనిస్తే.. మన వద్ద వసూలు చేసే ఫీజే తక్కువుందని చెప్పొచ్చు. ప్లాట్లను అభివృద్ధి చేసి విక్రయించే సంస్థలు చదరపు మీటర్‌కి చెల్లించాల్సింది కేవలం ఐదు రూపాయలే. గరిష్ఠంగా మహా అయితే రూ.2 లక్షలు అవుతుంది. అయినప్పటికీ, ఇంతవరకూ రాష్ట్రవ్యాప్తంగా అధిక శాతం మంది రియల్టర్లు తమ వెంచర్లను రెరాలో నమోదు చేసుకోలేదు. 'రెరా' అథారిటీ ఏం చేస్తుందిలే అనే నిర్లక్ష్యం చాలామంది రియల్టర్లలో నెలకొన్నట్లు సమాచారం. ఇప్పుడిలాంటి ప్రమోటర్ల నుంచి ముక్కుపిండి జరిమానాను వసూలు చేయడానికి రెరా అథారిటీ సమాయత్తం అవుతున్నది. 2017 జనవరి 1 తర్వాత తెలంగాణలో ఆరంభమైన వెంచర్లను నమోదు చేసుకునేందుకు రెరా అథారిటీ జులై 31 వరకూ గడువునిచ్చింది. ఇక మళ్లీ పొడిగించే ప్రసక్తే లేదని జులై 31న స్పష్టం చేసింది. రెరా సెక్షన్ 59 ప్రకారం, జరిమానా విధించడానికి సమాయత్తం అవుతున్నది. రెరా అథారిటీ మరింత మెరుగ్గా సేవల్ని అందిస్తేనే తెలంగాణలో ప్లాట్లను కొనేవారు మోసపోయే అవకాశమే లేదని నిపుణులు అంటున్నారు. ప్రమోటర్ స్థాయితో సంబంధం లేకుండా జరిమానా విధించాలంటున్నారు.

### పేపర్లో ప్రకటనలు..

రెరాలో అనుమతి తీసుకోకుండా ప్లాట్లు, ఫ్లాట్లను విక్రయిస్తున్న సంస్థల పేర్లను పత్రికల్లో ప్రచురించడానికి తెలంగాణ రెరా అథారిటీ సమాయత్తం అవుతున్నది. ఈ క్రమంలో నగరం నలువైపులా కొన్ని ప్రాజెక్టుల పేర్లను సిద్ధం చేసినట్లు సమాచారం. రెరా అనుమతి లేకుండా ఏ సంస్థా ప్రీలాంచ్‌లో కానీ సాఫ్ట్‌లాంచ్‌లో కానీ ప్లాట్లు లేదా ఫ్లాట్లను విక్రయించడానికి వీల్లేదు. అయినప్పటికీ, పలు సంస్థలు ఈ నిబంధనను బేఖాతరు చేస్తున్నాయని రెరా అథారిటీ దృష్టికి వచ్చింది. దీంతో, నిబంధనల ప్రకారం అట్టి సంస్థల నుంచి జరిమానాను వసూలు చేసేందుకు రెరా అథారిటీ దృష్టి సారిస్తోంది. పైగా, ఒక్కసారి రెరా అథారిటీ గనక పత్రికల్లో ప్రాజెక్టుల గురించి ప్రకటన విడుదల చేస్తే.. ఆ సంస్థ వద్ద ప్లాటు కానీ ఫ్లాటు కానీ కొనుగోలు చేయడానికి కొనుగోలుదారులెవ్వరూ ముందుకు రారు. పైగా, ఆయా సంస్థ పేరు ప్రతిష్ఠలకు భంగం కలుగుతుంది. ఇలాంటి ఇబ్బందులు పడకూడదని భావించేవారైతే ఎప్పుడో రెరాలో నమోదు చేసుకునేవారే. మరి, తమ వద్ద నమోదు కాని ప్రాజెక్టులకు సంబంధించి రెరా అథారటీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే విషయం గురించి తెలంగాణ ప్రమోటర్లు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.




# ఫ్లాట్ మెయింటనెన్స్.. పెద్ద న్యూసెన్స్

హైదరాబాద్‌లో గేటెడ్ కమ్యూనిటీల సంఖ్య పెరుగుతున్నది. పలు రాష్ర్టాలకు చెందిన వ్యక్తులు ఒకే అపార్టుమెంట్‌లో నివసిస్తుండటంతో.. ప్రతి అపార్టుమెంట్ కూడా ఓ మినీ ఇండియా మాదిరిగా తలపిస్తున్నది. ఒకవైపు, ఇది సానుకూలాంశమే అయినప్పటికీ, ఆయా నివాసితుల సంఘంలో చేరే వ్యక్తులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తోటి నివాసితుల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. నలుగురు లేదా ఐదుగురు వ్యక్తులు కలిసి హఠాత్తుగా మెయింటనెన్స్ ఛార్జీలను పెంచడం, ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకోవడం వల్ల అందులోని నివాసితులు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలో, అపార్టుమెంట్లలో ఇష్టం వచ్చినట్లు మెయింటనెన్స్ ఛార్జీలను పెంచవచ్చా?

మన హైదరాబాద్‌లో 1978 నుంచి అపార్టుమెంట్ల నిర్మాణం ఆరంభమైనప్పటికీ.. 1982 తర్వాతే ఊపందుకుంది. ఒకే స్థలంలో కొన్ని కుటుంబాలు కలిసి ఉండేవిధంగా అపార్టుమెంట్లను కట్టుకునే సంప్రదాయాన్ని ప్రజలు నెమ్మదిగా అలవాటు చేసుకున్నారు. వ్యక్తిగత గృహమైతే, ఎవరికి వారే నిర్వహణ చూసుకుంటారు. అయితే, కొద్దిమంది కలిసి ఒకే అపార్టుమెంట్‌లో నివసిస్తే మాత్రం.. నిర్వహణ బాధ్యతల్ని చేపట్టడానికి ప్రత్యేకంగా సంఘాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఆయా అపార్టుమెంట్ కట్టిన బిల్డర్ అయినా చేయవచ్చు. లేదా అందులోని గృహయజమానులే కలిసికట్టుగా ఒక సంఘంగా ఏర్పడి నిర్వహణ బాధ్యతను చేపట్టవచ్చు. పెరుగుతున్న అపార్టుమెంట్లను గమనించిన అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం 1987లో.. అపార్టుమెంట్ యజమానుల సంక్షేమ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం.. ఆయా ఫ్లాట్లను నిర్వహణ గురించి చర్చించడానికి ప్రత్యేకంగా ఒక సంఘం ఉండాలి. అందులో కనీసం ఏడుగురు సభ్యులుండాలి. అపార్టుమెంట్ నిర్వహణను ఈ సంఘ సభ్యులే చేపట్టాలి. మంచినీరు, విద్యుత్తు, లిఫ్టులు, జనరేటర్.. ఇలా ప్రతీది అందులోని నివాసితులకు సక్రమంగా అందేలా చూడటం ఈ సంఘం ప్రధాన కర్తవ్యం. ఇందులో ఎలాంటి లాభాపేక్ష ఉండకూడదు. ప్రత్యేకంగా బై లాస్ కూడా రాసుకోవాలి. ప్రతిఒక్కరూ దానికి బద్ధులై ఉండాలి.



### ఇష్టారాజ్యంగా పెంచకూడదు..

నివాసితుల సంక్షేమ సంఘం రెండు, మూడు నెలలకోసారి సమావేశం కావాలి. నిర్వహణ ఖర్చుల గురించి చర్చించాలి. మెయింటనెన్స్ సొమ్ము పెంచాలన్నా.. తగ్గించాలన్నా.. సంఘ సభ్యులంతా కలిసి నిర్ణయించాలి. ఆయా అసోసియేషన్‌కి కొత్తగా అధ్యక్షుడు ఎన్నిక కాగానే నిర్వహణ సొమ్ము పెంచకూడదు. తాము రూపొందించుకున్న బైలాస్ ప్రకారం అపార్టుమెంట్ బాధ్యతల్ని నిర్వహించాలి. అంతే తప్ప, అధ్యక్షుడు లేదా ప్రధాన కార్యదర్శి ఇష్టం వచ్చినట్లు వ్యవహరించడానికి వీల్లేదు.

- అపార్టుమెంట్ నిర్మాణ దశలోనే బిల్డర్.. అట్టి యజమానుల నుంచి కొంత సొమ్మును కార్పస్ ఫండ్‌గా వసూలు చేస్తారు. అట్టి సొమ్మును నిర్మాణం పూర్తయ్యాక.. బిల్డర్ సంక్షేమ సంఘానికి అప్పగించాలి. ఆయా సొమ్ముతో సంక్షేమ సంఘం అపార్టుమెంట్ భారీ ఖర్చుల కోసమే వినియోగించాలి. ఉదాహరణకు భవనానికి రంగులేయడం, ఇతర స్ట్రక్చరల్ రిపేర్లు, జనరేటర్లు తీసుకోవడం వంటివి చేయాలి.

### చిన్నదైనా.. పెద్దదైనా..

నిర్వహణ బాధ్యతల్ని చేపట్టడానికి ప్రత్యేకంగా సంఘం ఏర్పడాలి. ఇందుకోసం ఏకంగా ఆయా అపార్టుమెంట్‌కి సంబంధించిన ప్రతిఒక్క అంశాన్ని బైలాస్‌లో పొందుపర్చాలి.



# దేవదాస్ కనకాల ఇకలేరు


దేవదాస్ కనకాల

సినీ నటుడు, నటశిక్షకుడు, దర్శకుడు దేవదాస్ కనకాల(74) శుక్రవారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాసవిడిచారు. దక్షిణాది అగ్ర కథానాయకులు రజనీకాంత్, చిరంజీవితో పాటు రాజేంద్రప్రసాద్, భానుచందర్, శుభలేఖసుధాకర్, రాంకీ, అరుణ్‌పాండ్యన్, నాజర్, రఘువరన్..ఇలా ఎంతో మందిని ఉత్తమ నటులుగా తీర్చిదిద్దిన గురువుగా దేవదాస్ కనకాల పేరుప్రఖ్యాతుల్ని సొంతం చేసుకున్నారు. ఆయనకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. తండ్రి నటవారసత్వాన్ని కొనసాగించిన తనయుడు రాజీవ్ కనకాల, కుమార్తె శ్రీలక్ష్మి నటులుగా రాణిస్తున్నారు. ఆయన కోడలు సుమ తెలుగునాట ప్రముఖ వ్యాఖ్యాత, ప్రయోక్తగా పేరు తెచ్చుకుంది. గత ఏడాది ఆయన భార్య లక్ష్మి కన్నుమూయడంతో దేవదాస్ కనకాల కృంగిపోయారు. 1945 జూలై 30న యానాం సమీపంలోని కనకాలపేటలో జన్మించారాయన. దేవదాస్ తండ్రి కనకాల పాపయ్యనాయుడు ఫ్రెంచి పాలనలో యానాం శాసనసభ్యుడిగా పనిచేశారు. విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో థియేటర్ ఆర్ట్స్ పూర్తిచేసిన దేవదాస్ పూణే ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో చేరారు. ఈ ఇనిస్టిట్యూట్‌లో నటశిక్షణ పొందిన తొలితరం తెలుగు వారిలో ఆయన ఒకరు. అనంతరం సినిమా అవకాశాల కోసం ప్రయత్నించినా రాకపోవడంతో సాంగ్ అండ్ డ్రామా డివిజన్‌లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించారు. అక్కడే సతీమణి లక్ష్మితో దేవదాస్‌కు పరిచయం ఏర్పడింది. తనకంటే వయసులో ఆరేళ్లు పెద్ద అయిన ఆమెను ప్రేమించి పెళ్లాడారు. మద్రాస్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్, మధు ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లలో శిక్షకుడిగా, తెలుగు విశ్వవిద్యాలయంలో రంగస్థల విభాగ అధ్యాపకునిగా పనిచేశారు దేవదాస్ కనకాల.

**బాపు సినిమాతో నటుడిగా..**

ఓ వైపు నటనలో శిక్షణ ఇస్తూనే సినిమాల్లో నటించారు దేవదాస్ కనకాల. దిగ్గజ దర్శకుడు బాపు రూపొందించిన 'బుద్ధిమంతుడు' సినిమాలో అక్కినేని స్నేహితుల్లో ఒకరిగా సినీ పరిశ్రమకు పరిచయం అయ్యారు. మాంగళ్యానికి మరోముడి, సిరి సిరి మువ్వ, మంచుపల్లకి, చెట్టు కింద ప్లీడర్, మన సంతా నువ్వే, ఒకటో నంబర్ కుర్రాడు, గ్యాంగ్‌లీడర్, పెదబాబు, మల్లీశ్వరి, కింగ్, నీ స్నేహంతో పాటు దాదాపు వంద చిత్రాల్లో నటించారు. సహాయనటుడిగా, హాస్యనటుడిగా, ప్రతినాయకుడిగా భిన్న తరహా పాత్రలతో విలక్షణ నటుడిగా గుర్తింపును సొంతం చేసుకున్నారు. కె. విశ్వనాథ్ దర్శకత్వంలో అంటరానితనం, కులనిర్మూలన ఇతివృత్తంతో రూపొందిన 'కాలం మారింది' సినిమాలో దళితుడిగా సహజ నటనతో ఆకట్టుకున్నారు. బాపు, విశ్వనాథ్, వంశీ, రాఘవేంద్రరావుతో పాటు నవతరం దర్శకులందరితో పనిచేశారు దేవదాస్ కనకాల.

> నటనా శిక్షణా సంస్థ ద్వారా ఎందరో అగ్ర నటుల్ని తెలుగు తెరకు అందించిన దేవదాస్ కనకాల సేవలు చిరస్మరణీయం.
> – ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

> నట శిక్షణ సంస్థను నెలకొల్పి ఎందరినో సినీ పరిశ్రమకు పరిచయం చేసిన దేవదాసు కనకాల మరణం సినీ పరిశ్రమకు తీరని లోటు. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.
> – ముఖ్యమంత్రి కేసీఆర్

**దర్శకుడిగా విలక్షణ ముద్ర**

నటుడిగానే కాకుండా ఆరు సినిమాలకు దర్శకత్వం వహించారు దేవదాస్ కనకాల. సామాజిక ఇతివృత్తంతో దేవదాస్ కనకాల దర్శకత్వంలో రూపొందిన 'చలిచీమలు' చిత్రం విమర్శకుల ప్రశంసలతో పాటు నంది పురస్కారాన్ని దక్కించుకున్నది. ఈ సినిమాలో నూటొక్క జిల్లాల అందగాడిని అంటూ నూతన ప్రసాద్ చెప్పే సంభాషణలు ప్రాచుర్యాన్ని పొందాయి. ఈ సినిమాతోనే పరుచూరి సోదరుల్లో ఒకరైన వెంకటేశ్వరరావు రచయితగా సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు. నిజం, నాగమల్లి, పుణ్యభూమి కళ్లు తెరిచింది, ఓ ఇంటి బాగోతం చిత్రాలతో దర్శకుడిగా ప్రతిభను చాటుకున్నారు దేవదాస్ కనకాల. ఓ సందర్భంలో తనతో ఓ సినిమా చేయమని రజనీకాంత్ స్వయంగా దేవదాస్ కనకాలను అడిగినా తమిళ భాషపై అవగాహన లేకపోవడంతోత చేయనని చెప్పారు. అమృతం, రాజశేఖరచరిత్ర, డామిట్ కథ అడ్డం తిరిగింది వంటి ధారావాహికలతో నటుడిగా, దర్శకుడిగా బుల్లితెర ప్రేక్షకుల్ని అలరించారు. ఆయన మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపాన్ని ప్రకటించారు. దేవదాస్ కనకాల భౌతికకాయాన్ని రేపు హైదరాబాద్‌లోని స్వగృహానికి తరలించి అభిమానుల సందర్శనార్థం మధ్యాహ్నం వరకు ఉంచనున్నారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

# జీవితాంతం గుర్తుండిపోతుంది


అనిల్, ప్రవీణ, తిరుమల్‌రెడ్డి, కార్తికేయ, అర్జున్ జంధ్యాల

'కెరీర్‌లో సూపర్‌హిట్స్, బ్లాక్‌బస్టర్స్ వస్తుంటాయి. కానీ కొన్ని సినిమాలు మాత్రం నటుడిగా గౌరవాన్ని తీసుకొస్తాయి. ప్రేక్షకులు మనల్ని చూసే ధోరణి మారుతుంది. అలాంటి మంచి పాత్రను పోషించే అవకాశం ఈ సినిమాతో దొరికింది' అని అన్నారు కార్తికేయ. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'గుణ 369'. అర్జున్ జంధ్యాల దర్శకుడు. అనిల్ కడియాల, తిరుమల్‌రెడ్డి నిర్మించారు. శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకులముందుకొచ్చింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో హీరో కార్తికేయ మాట్లాడుతూ ''ఆర్‌ఎక్స్ 100' హీరో అనే ముద్ర తొలగిపోయి ఇకపై నన్ను అందరూ గుణ అని పిలుస్తారు. మంచి సినిమాలో నటించే అవకాశాన్ని నాకు ఇచ్చిన అర్జున్ జంధ్యాలకు రుణపడి ఉంటాను. నా జీవితాంతం గుర్తుండిపోయే సినిమా ఇది. సక్సెస్‌లు, బ్లాక్‌బాస్టర్‌లు ఎన్ని వచ్చినా ఈ సినిమా మాత్రం నా మనసులో ఎప్పటికీ నిలిచిపోతుంది. అర్జున్ జంధ్యాలతో ఈ ఏడాది మరో సినిమా చేయబోతున్నాను' అని తెలిపారు. మంచి విషయాన్ని చెబితే అందులో నుంచి కొంత నేర్చుకుంటారనే ఆలోచనతో చేసిన ఈ ప్రయత్నాన్ని తెలుగు ప్రేక్షకులు ఆదరించడం ఆనందంగా ఉందని నిర్మాతలు చెప్పారు. చక్కటి సందేశంతో ఈ చిత్రాన్ని రూపొందించారని, తమ అబ్బాయి కార్తికేయ మంచి అభినయాన్ని కనబరిచాడని అతడి తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అర్జున్ జంధ్యాల, అనఘతో పాటు చిత్రయూనిట్ పాల్గొన్నారు.

**'రన్‌రాజా రన్' చిత్రంతో ప్రతిభావంతుడైన దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు సుజీత్. ద్వితీయ ప్రయత్నంలో ప్రభాస్ వంటి స్టార్‌హీరోను డైరెక్ట్ చేసే సువర్ణావకాశాన్ని సొంతం చేసుకున్నారు. ఇప్పుడు 'సాహో' దర్శకుడిగా సుజీత్ అందరి దృష్టిని ఆకట్టుకుంటున్నారు. 'బాహుబలి' సిరీస్ తర్వాత ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రమిదే కావడంతో దేశ వ్యాప్తంగా ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ఈ నెల 30న 'సాహో' చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులముందుకురానుంది. శుక్రవారం సినిమాలో ఓ గీతాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు సుజీత్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆయన చెప్పిన సంగతులివి...**


సుజీత్

# నిరీక్షణను ఆస్వాదించాను!

**'సాహో' సినిమా కోసం వీడియో గేమ్ ప్లాన్ చేస్తున్నారని తెలిసింది?**

'సాహో' లార్జ్‌స్కేల్ మూవీ. ఈ సినిమా ఆరంభానికి ముందే స్టిల్స్ గురించి, కాస్ట్యూమ్స్ గురించి చాలా మంది చర్చించారు. వీడియో గేమ్ చేయడం వల్ల సినిమా పరిధి మరింత పెరుగుతుందని భావించాం. అందుకే వీడియోగేమ్ ఆలోచనను ముందుకుతెచ్చాం.

**'బాహుబలి'తో ప్రభాస్ అంతర్జాతీయంగా గుర్తింపు పొందడంతో 'సాహో' పై అంచనాలు ఎక్కువయ్యాయి. నిర్మాణపరంగా ఈ సినిమా ఎలా వుండబోతున్నది?**

అంతర్జాతీయంగా లేదా బాలీవుడ్ తరహాలో సినిమా చేద్దామని ప్రయత్నించలేదు. ఇప్పుడు అందుబాటులో ఉన్న మీడియా మాధ్యమాల దృష్ట్యా ప్రేక్షకులు సినిమాల్లో కొత్తదనాన్ని కోరుకుంటున్నారు. 'సాహో' విషయంలో కూడా ఆడియెన్స్‌కు కొత్తగా ఏం చూపించాలనే ఆలోచించాం. మేం అనుకున్న లక్ష్యాన్ని చేరకున్నామనే విశ్వాసంతో ఉన్నాం. ఈ టైమ్‌లో సినిమా గురించి ఎక్కువగా మాట్లాడటం నాకు ఇష్టం లేదు. విడుదలైన తర్వాత సినిమా చూసి మీ అభిప్రాయాన్ని తెలియజేయండి.

> **శంకర్, రాజమౌళిగారితో నన్ను పోల్చకండి. వారు అందనంత ఎత్తులో ఉన్నారు. అయితే శంకర్‌గారిలా హైరేంజ్‌లో పాట చేయాలనే కోరిక ఉండేది. ఈ సినిమాతో అది నెరవేరింది.**

**ఈ సినిమా సంగీతం విషయంలో పాటకో స్వరకర్తను ఎంచుకున్నారు. ఆ ఐడియా ఎవరిది?**

ఒక సినిమాకు ఎక్కువ మంది సంగీత దర్శకులు పనిచేయడం కొత్తేమి కాదు. ఈ సినిమాలో మూడు నాలుగు పాటలుంటాయి. ప్రతీది విభిన్నంగా ఉంటుంది. అందుకే పాటకు ఒక్క సంగీత దర్శకున్ని తీసుకున్నాం. ముందస్తుగా అనుకొని తీసుకున్న నిర్ణయం కాదిది. సినిమా ప్రయాణంలో అలా చేయాల్సి వచ్చింది. దీనివల్ల సంగీతపరంగా ఎలాంటి ఇబ్బందులు ఉండవు. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఎమోషన్‌ను క్యారీ చేస్తుంది కాబట్టి ఒక్క మ్యూజిక్ డైరెక్టర్ పనిచేయాల్సి ఉంటుంది. పాటల విషయంలో అలా ఉండదు. సందర్భానుసారంగా పాటలకు స్వరరచన చేసే వీలుంటుంది.

**రెండో సినిమా కోసం మీరు ఇన్నేళ్లు ఎందుకు వేచి చూడాల్సి వచ్చింది?**

నా తొలి సినిమా వచ్చి ఐదేళ్లయింది. మరో సినిమాకు ఇంత టైమ్ తీసుకుంటానని ఊహించలేదు. భవిష్యత్తు ఎప్పుడు మన చేతిలో ఉండదు కదా. ఆలస్యమైనా ఈ నిరీక్షణను, సినిమా ప్రయాణాన్ని నేను ఆస్వాదించాను. 'సాహో' నాకు పది సినిమాల అనుభవాన్నిచ్చింది.

**ఈ సినిమా బడ్జెట్ నియంత్రణ కోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?**

అందరు అనుకుంటున్నట్లుగా ఈ సినిమా ఆలస్యం కాలేదు. ప్రీ ప్రొడక్షన్ వర్క్‌కే ఎక్కువ సమయం కేటాయించాం. 2017 నవంబర్‌లో సినిమాను సెట్స్‌మీదకు తీసుకొచ్చాం. అయితే అంతకు ముందే టీజర్ రిలీజ్ చేయడం వల్ల షూటింగ్ మధ్యలో ఉందేమో అనుకున్నారు. చిత్రీకరణ మొదలుపెట్టిన తర్వాత ఎక్కడా ఆపలేదు. అనుకున్న షెడ్యూల్స్‌లో పూర్తిచేశాం.

**సినిమాకు ఈ స్థాయిలో భారీ బడ్జెట్‌ను ఎందుకు కేటాయించాల్సి వచ్చింది? ప్రభాస్ ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకొని అంతమొత్తంలో వెచ్చించారా?**

ఇమేజ్ దృష్టిలో పెట్టుకొని బడ్జెట్‌ను కేటాయించాలని అనుకోలేదు. కథ డిమాండ్ మేరకే వ్యయం చేశాం. నేను రాసుకున్న స్క్రిప్ట్‌కు అంత బడ్జెట్ అవసరం అయింది. ఈ సినిమా ఇంత భారీగా రూపొందుతుందని ఎప్పుడూ అనుకోలేదు. ప్రభాస్ వ్యక్తిత్వాన్ని నేను బాగా ఇష్టపడతాను. అందుకే ఇన్ని రోజులు వేచి చూశాను. అదే మరో హీరో అయితే నా నిర్ణయాలు వేరే విధంగా ఉండేవేమో.

**'బాహుబలి' ముందే ప్రభాస్‌కు ఈ కథ చెప్పారు. 'బాహుబలి' విడుదల తర్వాత కథలో ఏమైనా మార్పులు చేశారా?**

అలాంటిదేమి లేదు. స్క్రిప్ట్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. అయితే సమయం ఉంది కాబట్టి యాక్షన్ సీక్వెన్స్‌లో మరింత బెటర్‌మెంట్ వచ్చేలా చూసుకున్నాం.





అభిషేక్, సాయిశ్రీనివాస్, సత్యనారాయణ, రమేష్‌వర్మ, వాసు

# మరపురాని రోజు ఇది!

''రాక్షసుడు' సినిమా గురించి ప్రతి ఒక్కరూ పాజిటివ్‌గా మాట్లాడుతున్నారు. ఈ రోజు కోసమే రెండేళ్లుగా నిరీక్షిస్తున్నా. జీవితంలో మరచిపోలేని రోజు ఇది' అన్నారు బెల్లంకొండ శ్రీనివాస్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'రాక్షసుడు'. రమేష్‌వర్మ దర్శకుడు. కోనేరు సత్యనారాయణ నిర్మాత. అభిషేక్ నామా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేశారు. శుక్రవారం ప్రేక్షకులముందుకొచ్చింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో బెల్లంకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ 'ఇంత పెద్ద విజయాన్ని అందించిన నిర్మాత సత్యనారాయణగారికి జీవితాంతం రుణపడి ఉంటాను. తొలి సినిమాతోనే ఆయన పెద్ద హిట్ కొట్టారు. సమీక్షకులు సినిమా బాగుందని ప్రశంసించడం ఆనందంగా ఉంది' అన్నారు. 'ఈ సినిమా విషయంలో నిర్మాత నాలో విశ్వాసం నింపారు. ఎంత ఖర్చు అయినా పర్వాలేదు సినిమా చేయమంటూ స్వేచ్ఛనిచ్చారు. తమిళంలో పెద్ద విజయం సాధించిన ఈ సినిమాను ఎక్కడా చెడగొట్టకుండా తెలుగు ప్రేక్షకులకు అందిస్తే చాలనుకున్నా. బెల్లంకొండ సురేష్‌గారు ఫోన్ చేసి 'మా అబ్బాయికి బ్లాక్‌బస్టర్ హిట్ ఇచ్చావు' అంటూ మెచ్చుకున్నారు' అని దర్శకుడు చెప్పారు. అభిషేక్ నామా మాట్లాడుతూ 'హిట్ కొట్టాలని తపనతో సాయిశ్రీనివాస్ పనిచేశారు. రమేష్‌వర్మ అత్యద్భుతంగా చిత్రాన్ని తెరకెక్కించాడు. ఓవర్‌సీస్‌లో 120 స్క్రీన్స్‌లో విడుదల చేశాం. అక్కడ ప్రేక్షకుల స్పందన బాగుంది. ఈ సినిమాకు మంచి కలెక్షన్లు లభిస్తున్నాయి. ఈ ఏడాది బిగ్గెస్ట్ థ్రిల్లర్ హిట్‌గా నిలిచిపోతుందనే నమ్మకం ఉంది' అన్నారు.



# 'ఆర్‌ఆర్‌ఆర్' రామ్‌చరణ్ లుక్!

ఎన్టీఆర్, రామ్‌చరణ్ తొలిసారి కలిసి నటిస్తున్న భారీ మల్టీస్టారర్ చిత్రం 'ఆర్‌ఆర్‌ఆర్'. ఎన్టీఆర్ కొమరంభీం, రామ్‌చరణ్ అల్లూరి సీతారామరాజు పాత్రల్లో కనిపించబోతున్న విషయం తెలిసిందే. అత్యంత భారీ బడ్జెట్‌తో డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ దశలో వుంది. రామ్‌చరణ్ ఈ సినిమా షూటింగ్‌లో బిజీగా గడుపుతున్నారు. చిత్రీకరణకు కొంత విరామం చిక్కడంతో ఇటీవల హీరో రామ్‌చరణ్.. కథానాయిక కియారా అద్వానీ పుట్టిన రోజు పార్టీలో పాల్గొనడం కోసం ముంబయి వెళ్లారు. అక్కడి ఫొటోగ్రాఫర్లు తీసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆ ఫొటోల్లో రామ్‌చరణ్ సరికొత్త గెటప్‌లో కనిపిస్తున్నారు. అల్లూరి సీతారామరాజు పాత్ర కోసం ఆయన గుబురు మీసాలతో కనిపించడం ఆకట్టుకుంటోంది.

# ఔత్సాహికులకు శిక్షణ


బసిరెడ్డి,రామ్‌మోహన్‌రావు, జ్యోతి జోషి

మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ స్కిల్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎమ్ఇసీ) ప్రతినిధులు జ్యోతి జోషి తదితరులు తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ రామ్‌మోహన్‌రావుని శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖకు అనుబంధ సంస్థ అయిన జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఎన్ఎస్‌డీసీ) ద్వారా సినిమా, టీవీ రంగానికి సంబంధించిన 24 శాఖలకు శిక్షణ ఇచ్చేందుకు కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. 'రాష్ట్రంలో ఉన్న వివిధ జిల్లాల్లోని ఆసక్తిగల యువతకు ప్రత్యేక సెమినార్‌లు, వర్క్ షాప్‌లను ఈ రంగానికి సంబంధించిన నిపుణుల ద్వారా శిక్షణనిచ్చి వారికి ఈ రంగంలో ప్రవేశించడానికి కావాల్సిన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ స్కిల్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఫిక్కీ ఏర్పాటు చేయడమైంది. దీనికి మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఫైనాన్సియల్ సపోర్ట్‌ని అందించనుంది' అని టీఎస్ఎఫ్‌డీసీ చైర్మన్ పి. రామ్‌మోహన్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు.


సతీష్, విశ్వాంత్, వేణుమాధవ్

# ముక్కోణపు ప్రేమాయణం

విశ్వాంత్, మాళవిక సతీషన్, పూజా రామచంద్రన్ నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'బీఎఫ్‌హెచ్'(బాయ్‌ఫ్రెండ్ ఫర్ హైర్). సంతోష్ కంభంపాటి దర్శకుడు. స్వస్తిక సినిమా పతాకంపై వేణుమాధవ్ పెద్ది ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమా ప్రారంభమైంది. ఈ వేడుకకు నిర్మాత యష్ రంగినేని, హీరో విజయ్ దేవరకొండ తండ్రి గోవర్ధన్ దేవరకొండ అతిథులుగా హాజరయ్యారు. నిర్మాత మాట్లాడుతూ 'రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇది. ముక్కోణపు ప్రేమాయణంతో తెరకెక్కిస్తున్నాం. ఈ నెల 26 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. కేరింత, మనమంతా చిత్రాలతో నటుడిగా ప్రతిభను చాటుకున్న విశ్వాంత్ ఓ వినూత్నమైన పాత్రలో కనిపిస్తారు. గోపీసుందర్ సంగీతం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది' అని తెలిపారు. శివాజీరాజా, రాజారవీంద్ర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.

